సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 339

బుధవారం 1-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



మెస్సీనే మేటి

2022 ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్‌గా అర్జెంటీనా కెప్టెన్ - 12లో



'అభివృద్ధి చెందిన భారత్'

డిజిటల్ విప్లవంతో 2047 కల్లా సాధిస్తామన్న ప్రధాని మోదీ - 6లో



సిసోడియా, సత్యేంద్ర రాజీనామా

ఢిల్లీ మంత్రులు మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్ తమ పదవులకు రాజీనామా చేశారు. వాటిని సీఎం కేజ్రీవాల్ ఆమోదించారు.

వివరాలు 6లో ▸



పులులకు 'ఎండదెబ్బ'

ఎండాకాలం పులులకు శాపంగా మారుతోంది. దేశంలో ఈ ఏడాది 2 నెలల్లో 34 పులులు మరణించడం కలవరానికి గురిచేస్తోంది.

వివరాలు 6లో ▸



విస్తరిస్తున్న ఖలిస్తానీ ఉద్యమం

'ఆపరేషన్ బ్లూస్టార్'తో అంతరించిన ఖలిస్తానీ ఉద్యమం తాజాగా అమృత్‌పాల్ సింగ్ నేతృత్వంలో తిరిగి ప్రాణం పోసుకుంటోంది.

వివరాలు 6లో ▸



కెనడాలోనూ టిక్‌టాక్‌పై నిషేధం

చైనాకు చెందిన టిక్‌టాక్‌పై కెనడా కూడా నిషేధం విధించింది. ఈ యాప్ వల్ల భద్రతకు భంగమని కెనడా అధికారులు తెలిపారు.

వివరాలు 6లో ▸

నారాయణకు సీఐడీ నోటీసులు



- అమరావతి భూకుంభకోణం కేసులో దూకుడు
- మార్చి 6వ తేదీన విచారణకు హాజరు కావాలని నారాయణ, ఆయన భార్యకు..
- మార్చి 7వ తేదీన ఆయన కుమార్తెలు, అల్లుడు వంతు
- ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్, స్టార్టప్ ఏరియా నిర్ణయంలో భారీగా అక్రమాలు.. ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ

3 లో







గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

175 చోట్ల ఒంటరిగా పోటీచేసే ధైర్యముందా?

పొత్తులు లేకుండా గెలిచే సత్తా ఉందా?

చంద్రబాబుకు, దత్తపుత్రుడికి ఇదే మా చాలెంజ్

తెనాలి సభలో సీఎం వైఎస్ జగన్

- ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఒక్కటైనా మంచిపని చేశారా?
- చెప్పుకునేందుకు ఏమీ లేకనే దుష్ట చతుష్టయం దుష్ప్రచారం
- రానున్నవి పేదలు – పెత్తందారులకి మధ్య జరిగే ఎన్నికలు
- మేం చేసిన మంచి గురించి చెప్పి ఓటు అడుగుతాం
- మంచి జరిగిందనుకున్న వారంతా సైనికుల్లా మాకు తోడు నిలవండి
- వైఎస్సార్ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీని పంపిణీ చేసిన సీఎం
- 52.03 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.1,167.75 కోట్లు జమ

2 లో



"చంద్రబాబుకు, దత్తపుత్రుడికి సవాల్ విసురుతున్నా.. 175 నియోజకవర్గాలకు 175 చోట్ల ఒంటరిగా పోటీ చేసి గెలిచే ధైర్యం ఉందా? ఆ ధైర్యం వాళ్లకు లేదు.. ఎందుకంటే జీవితంలో ఏ రోజూ వారు ప్రజలకు మంచి చేయలేదు కాబట్టి. కానీ మీ బిడ్డకు ఆ ధైర్యం ఉంది.. కారణం మేం మంచి చేశాం కనుకనే. చేసిన మంచి గురించి చెప్పుకుని మళ్లీ అధికారంలోకి వస్తానన్న నమ్మకం, ధైర్యం మీ బిడ్డకు ఉంది. రాబోయే రోజుల్లో కుట్రలు ఇంకా ఎక్కువ కనిపిస్తాయి. రాజకీయాల్లో అన్యాయాలు పెరుగుతాయి. అన్నీ గమనించండి. నిర్ణయం తీసుకునేటప్పుడు మాత్రం బాగా ఆలోచించండి. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అన్న ఒకే ఒక్కటి ప్రామాణికంగా తీసుకోండి. మీ ఇంట్లో మంచి జరిగితే మీ బిడ్డకు మీరే సైనికులుగా తోడుగా నిలబడండి."

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రాష్ట్ర సంస్కృతికి అద్దం పట్టేలా..

- విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- బ్యాడ్జీల దగ్గర నుంచి కిట్ల వరకు రాష్ట్ర సంస్కృతికి పెద్దపీట
- అతిథులకు ఇచ్చే గిఫ్ట్ బాక్సులపై పెడన కలంకారీ డిజైన్
- ముఖ్య అతిథులకు సిల్వర్ ఫిలిగ్రీతో చేసిన జీఐఎస్ లోగో బహుమతులు
- థింసా, కూచిపూడి నృత్యం, తప్పెటగుళ్లు, గరగలు, కొమ్ము నృత్యం, ఉరుములు ప్రదర్శనలు


3 లో

ఎస్ఐ మెయిన్స్‌కు 57,923 మందికి అర్హత

రాష్ట్రంలో 411 ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షకు 1,51,288 మంది హాజరవ్వగా.. 57,923 మంది మెయిన్ పరీక్షకు అర్హత సాధించారు. త్వరలోనే మెయిన్ పరీక్ష తేదీని ప్రకటిస్తామని రాష్ట్ర పోలీసు నియామక మండలి తెలిపింది.

14 లో





అవార్డులు బాధ్యతలను పెంచుతాయి

- ఏపీ సీడ్స్‌కు వరుసగా రెండోసారి 'గవర్నెన్స్ నౌ' అవార్డు
- అభినందించిన సీఎం జగన్



అవార్డుతో సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన మంత్రి కాకాణి, గోపాలకృష్ణ ద్వివేది, గెద్దం శేఖర్‌బాబు

సాక్షి, అమరావతి: సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాల పంపిణీలో ఏపీ సీడ్స్ కృషి ప్రశంసనీయమని సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఏపీ సీడ్స్ వరుసగా రెండోసారి కూడా 'గవర్నెన్స్ నౌ' అవార్డు గెలుచుకున్నందుకు సంబంధిత అధికారులను సీఎం అభినందించారు. అవార్డులు బాధ్యతలను పెంచుతాయని అన్నారు. 'గవర్నెన్స్ నౌ' అవార్డుతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఏపీ సీడ్స్ ఎండీ డాక్టర్ గెద్దం శేఖర్‌బాబు మంగళవారం సీఎంను కలిశారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు గవర్నెన్స్ నౌ అనే సంస్థ తొమ్మిదేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తోంది. ఈ ఏడాది పీఎస్‌యూ–ప్రభుత్వ రంగ సంస్థల కేటగిరిలో ఏపీ సీడ్స్‌కు అవార్డును ప్రకటించింది. ఇటీవల ఢిల్లీలో మాజీ సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా చేతుల మీదుగా ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్‌బాబు, చైర్‌పర్సన్ పేర్నాటి సుస్మిత ఈ అవార్డును అందుకున్నారు.

నేడు నిడదవోలులో సీఎం పర్యటన

సాక్షి,అమరావతి: సీఎం జగన్ ఈ నెల 1న తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 10.40 గంటలకు నిడదవోలు చేరుకుంటారు. 11 గంటలకు నిడదవోలు గాంధీనగర్‌లో సెయింట్ ఆంబ్రోస్ గ్రౌండ్స్‌లో జరగనున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరవుతారు. 11.45కు అక్కడి నుంచి బయలుదేరి 12.25 గంటలకు తాడేపల్లికి చేరుకుంటారు.

సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రాజెక్టులకు అవార్డులు

సాక్షి, అమరావతి: విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో 15 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి విజేతలైన విద్యార్థులకు మంగళవారం అవార్డులు అందించారు. సోమవారం నుంచి ఈ సైన్స్ ఫెయిర్ ప్రారంభమవగా.. మంగళవారం విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. రాష్ట్రస్థాయిలో ప్రదర్శించిన 260 ప్రాజెక్టుల్లోని 5 విభాగాల్లో మూడేసి చొప్పున 15 ప్రాజెక్టులను ఉత్తమమైనవిగా న్యాయనిర్ణేతలు ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా జేసీ నుపుర్ అజయ్, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి, ఆంధ్రా లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

FORM IV
(See Rule 8)

Statement about ownership and other particulars about newspaper **SAKSHI**

1. Place of Publication	:	VIJAYAWADA
2. Periodicity of its publication	:	DAILY
3. Printer's Name	:	V. MURALI
Nationality	:	INDIAN
Address	:	Jagati Publications Limited, 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
4. Publisher's Name	:	V. MURALI
Nationality	:	INDIAN
Address	:	Jagati Publications Limited, 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
5. Editor's Name	:	V. MURALI
Nationality	:	INDIAN
Address	:	Flat No. 301, Rajya Lakshmi Residency, Padma Colony, Nallakunta, Hyderabad - 500 044.
6. Name & Addresses of Individuals who own the Newspaper and shareholders holding more than one percent of the total capital	:	1. M/s. Jagati Publications Limited, 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034. 2. M/s.Carmel Asia Holdings Pvt Ltd., No. 12/2, Commerce at mantri, Bannerghatta Main road, Opposite mantri home care office, Bangalore, Karnataka - 560 076. 3. M/s.Gilchrist Investments Pvt Ltd, # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003. 4. M/s. Alpha Avenues Pvt Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003. 5. M/s. Alpha Villas Pvt Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003. 6. M/s. India Cements Ltd. # 827, Annasalai, Dhun Building, IVth Floor, Chennai - 600 002 7. M/s. P.R. Enerrgy Holding Limited Lakshmi Nivas, Plot. No. 705, Road. No.3, Banjara Hills, Hyderabad-500 034 8. M/s. PVP Business Ventures Pvt. Ltd. # 46, Avenue 4, Street No.1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034 9. M/s. PVP Business Towers Pvt Ltd., 8-2-609/K, Avenue 4, Street No. 1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034. 10. M/s.R.R. Global Enterprises Pvt. Ltd. 8-2-120/86/5, Third Floor, Sneha House, Road No. 3, Banjara Hills, Hyderabad - 500 034. 11. M/s. Sentia Developers Ltd. 1A-Hamilton House, 1st Floor, Connaught Place, New Delhi - 110 001. 12. M/s.Avant Garde Fashion Wear Pvt. Ltd, 54/3, Ejipura Main Road, Vivek Nagar, Bangalore - 560 047. 13. M/s. Beta Avenues Pvt. Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003. 14. M/s. IA and IC Pvt. Ltd., Pada.No.3, Balkum, Opp Casa Lodha Royal, Near Jalaram Mandir, Thane (West) - 400 608.

I, V. MURALI hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(V. MURALI)
Publisher

Date: 28-02-2023



సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



సభాస్థలి కిక్కిరిసిపోవడంతో బయటే ఉండిపోయిన ప్రజలు

175 చోట్ల ఒంటరిగా పోటీ చేసే ధైర్యముందా?

చంద్రబాబుకు, దత్తపుత్రుడికి తెనాలి సభలో సీఎం జగన్ సవాల్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వచ్చే ఎన్నికల్లో యుద్ధం కరువుతో ఫ్రెండ్‌షిప్ ఉన్న చంద్రబాబుకు, వరుణ దేవుడి ఆశీస్సులున్న మనందరి ప్రభుత్వానికి మధ్య జరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఒక్క మంచి పని కూడా చేయని చంద్రబాబు ఇక చెప్పుకునేందుకు ఏమీ లేకపోవడంతో దుష్ట చతుష్టయంతో కలసి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 98.5 శాతం హామీలను నెరవేర్చి ఈ రోజు సంతృప్తిగా ఓటు అడగడానికి వస్తున్నామని, ఎమ్మెల్యేలు ప్రతి గడపనూ సందర్శిస్తున్నారని చెప్పారు. మంగళవారం గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డు వద్ద నిర్వహించిన బహిరంగ సభలో వైఎస్సార్ రైతు భరోసా, మాండూస్ తుపాన్ బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని బటన్ నొక్కి జమ చేసిన అనంతరం సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

నాడు డీపీటీ.. నేడు డీబీటీ

ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం వద్దన్న చంద్రబాబుకు, అదే స్కూళ్లను నాడు–నేడుతో రూపురేఖలు మార్చేసి సీబీఎస్‌ఈ విధానంలో ఇంగ్లిష్ మీడియం తెచ్చిన మీ బిడ్డ ప్రభుత్వానికి మధ్య యుద్ధం జరుగుతోంది. మొదటి సంతకంతోనే డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పి మోసగించి పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలను రోడ్డుమీదకు తెచ్చిన చంద్రబాబుకు... వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, జగనన్న అమ్మఒడి, 30 లక్షల ఇళ్ల పట్టాలిచ్చి ఇప్పటికే 22 లక్షల గృహ నిర్మాణాలను చేపట్టిన చేస్తున్న మీ బిడ్డ ప్రభుత్వానికి మధ్య యుద్ధం జరుగుతోంది. జన్మభూమి కమిటీలనే గజదొంగల ముఠాతో మొదలుపెడితే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడితో కలిసి దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) స్కీంలు సృష్టించిన చంద్రబాబుకు, గ్రామ రూపురేఖలను సమూలంగా మార్చేసిన మన ప్రభుత్వానికి మధ్య యుద్ధం జరుగుతోంది. కళ్లెదుటే కనిపిస్తున్న గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం చదువులు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ విధానం, అందుబాటులోకి రానున్న డిజిటల్ గ్రంథాలయాల ద్వారా గ్రామాల స్వరూపం మారిపోతోంది. ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా ఏ ఒక్క అర్హుడూ మిస్ కాకూడదన్న ఉద్దేశంతో సోషల్ ఆడిట్ చేసి పేదలకు రూ.1.93 లక్షల కోట్లను డీబీటీ ద్వారా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి మీ ప్రభుత్వం జమ చేసింది.

అప్పుడెందుకు ఇవ్వలేదంటే...

ఆ రోజూ, ఈ రోజూ ఒకే బడ్జెట్ అయినా అప్పులలో పెరుగుదల గ్రోత్ రేటు మాత్రం అప్పటికన్నా ఇవాళ తక్కువే. మీ బిడ్డ మాత్రమే ఎందుకు బటన్‌నొక్కగలుగుతున్నాడు? చంద్రబాబు బటన్‌ నొక్కే స్కీంలు ఎందుకు లేవన్నది ఆలోచన చేయండి. అప్పట్లో ఆ డబ్బులు ఎవరి



రైతులకు పంట నష్ట పరిహారం- పెట్టుబడి రాయితీకి సంబంధించిన చెక్‌ను విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్

జేబుల్లోకి వెళ్లాయో ఆలోచన చేయండి. ఆ డబ్బులన్నీ గ్రామస్థాయిలో మొదలుపెడితే జన్మభూమి కమిటీల నుంచి గజదొంగల ముఠా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడు, వీళ్లందరి బాస్ చంద్రబాబు కలసి దోచుకో, పంచుకో, తినుకో అని పంచుకున్నారు.

పేదలు ఒకవైపు.. పెత్తందార్లు మరోవైపు

ఎస్సీ కులాలలో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా? బీసీల తోకలు కత్తిరిస్తాం.. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి వ్యతిరేకమన్న పెత్తందారీ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు, మనకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు గ్రామ స్థాయి నుంచి కేబినెట్ వరకూ రాజకీయ సాధికారిత కల్పించాం. నామినేటెడ్ పదవుల నుంచి పాలించే పదవుల దాకా ప్రతి అడుగులోనూ భాగస్వాములుగా చేశాం. ఈ రోజు యుద్ధం జరుగుతోంది కులాల మధ్య కాదు. ఇవాళ రాష్ట్రంలో జరుగుతోంది క్లాస్ వార్. పేదవాడు ఒకవైపు, పెత్తందార్లు మరోవైపు ఉన్నారు. పొరపాటు జరిగిందంటే రాజకీయాల్లో ఇక ఎవరూ మాట ఇవ్వడం, మాట మీద నిలబడటం అన్న మాటకు అర్థమే లేకుండా పోతుంది. రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలి. విశ్వసనీయత అన్న పదానికి అర్థం తెలియాలి. ఒక మాట చెబితే, ఆ మాట నిలబెట్టుకోలేకపోతే.. ఆ వ్యక్తి రాజకీయాలలో ఉండడానికి అర్హుడు కాదన్న పరిస్థితులు రావాలి.

టార్గెట్ 175 దిశగా అడుగులు..

ఈ రోజు మీ బిడ్డకు ఉన్నదల్లా దేవుడి దయ, మీ అందరి చల్లని ఆశీస్సులు మాత్రమే. మీ బిడ్డకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 లేకపోవచ్చు. దత్తపుత్రుడు తోడు ఉండకపోవచ్చు. మీ బిడ్డ ఏరోజూ వాళ్లమీద ఆధారపడలేదు. మీకు మంచి జరిగింది అనిపిస్తే మీ బిడ్డకు తోడుగా ఉండాలని కోరుతున్నా. మీ బిడ్డకు భయం లేదు. అందుకే 175 టార్గెట్ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాం.

దుష్ట చతుష్టయానికి కడుపు మంట

వ్యవసాయం దండగన్న చంద్రబాబుకు, రైతుకు ఇచ్చిన ప్రతి మాటా తప్పిన చంద్రబాబుకు, ఆయన భజన బృందానికి, దుష్ట చతుష్టయానికి మన ప్రభుత్వంపై కడుపు మండుతోంది. అయినా కడుపు మంటకు మందు లేదు. అసూయకు అసలే మందు లేదు. మనది పేదల ప్రభుత్వం. మనది రైతన్నల ప్రభుత్వం. రైతులను వంచించిన చంద్రబాబు ఒకవైపున, అన్నదాతలకు అండగా నిలుస్తున్న మనందరి ప్రభుత్వం మరోవైపున నిలిచి ఇవాళ యుద్ధం జరుగుతోంది.

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగు



- ఇవాళ రెయిన్ గన్లు లేవు.. రెయిన్ మాత్రమే ఉంది
- మనందరి ప్రార్థనలను దేవుడు ఆలకించి రైతులకు అండగా నిలిచారు
- అన్యాయస్తుడు సీఎంగా ఉన్నప్పుడు కచ్చితంగా కరువు తాండవిస్తుంది
- వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్‌తో రూ.1,090.76 కోట్లు.. 51.12 లక్షల మందికి లబ్ధి
- ఇన్‌పుట్ సబ్సిడీతో మరో రూ.76.99 కోట్లు పరిహారం.. 91,237 మందికి ప్రయోజనం
- నాలుగేళ్లుగా ఏటా 12 లక్షల టన్నుల మేర పెరిగిన ఆహార ధాన్యాల దిగుబడి
- గత ప్రభుత్వ హయాంలో సగటున దిగుబడి 154 లక్షల టన్నులు.. ఇవాళ 166 లక్షల టన్నులు
- గత సర్కారు హయాంలో రూ.40,237 కోట్లతో 2.65 కోట్ల టన్నుల ధాన్యం సేకరణ
- ఈ మూడేళ్ల 8 నెలల వ్యవధిలో రూ.55,444 కోట్లతో 2.94 కోట్ల టన్నుల సేకరణ
- గతంతో పోలిస్తే ఉద్యాన పంటల విస్తీర్ణం 1,43,901 హెక్టార్లు పెరుగుదల
- మనందరి ప్రభుత్వంలో రైతులకు చెల్లించిన బీమా సొమ్ము రూ.6,685 కోట్లు
- గత సర్కారు హయాంలో రూ.3,411 కోట్లు మాత్రమే
- ఆక్వా రైతులకు రూ.2,647 కోట్లు విద్యుత్ సబ్సిడీ
- ఉచిత విద్యుత్ కోసం రూ.27,800 కోట్లు వ్యయం
- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.1,834 కోట్లు అందచేశాం



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

తెనాలికి సీఎం వరాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెనాలి ఎమ్మెల్యే శివకుమార్ విజ్ఞప్తి మేరకు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల కోసం నిధులను మంజూరు చేస్తున్నట్లు మంగళవారం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు.

- తెనాలిలో మున్సిపల్ భవనం కోసం రూ.15 కోట్లు
- షాదీ ఖానా కోసం రూ.4 కోట్లు
- ఎస్సీ కాలనీలో స్మశానవాటిక కోసం రూ.9 కోట్లు
- కొల్లిపర మండలంలో అగ్రికల్చర్ మినీ మార్కెట్ యార్డు భూముల కొనుగోలు కోసం రూ.5 కోట్లు
- దుగ్గిరాల- కొల్లిపర రోడ్డు విస్తరణకు రూ.10 కోట్లు

అన్నదాతలు ఆశీస్సులు అందించాలి

అన్నదాతలకు అన్ని విధాలా అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్‌కి సంపూర్ణ ఆశీస్సులు అందించాలి. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల కోసం నూటికి నూరు శాతం బీమా ప్రీమియాన్ని భరిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్. సున్నా వడ్డీ రుణాలు ఇస్తున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకు అండగా నిలుస్తున్నాం. రైతే అసలైన శాస్త్రవేత్త అని నమ్మి వ్యవసాయ సలహా మండలి ఏర్పాటు చేసి లక్ష మంది రైతులతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం. ఇవన్నీ కొన్ని పత్రికలకు, టీడీపీ నాయకులకు పట్టడం లేదు. గాడిదలకు ఏం తెలుసు గంధపు చెక్కల వాసన అన్న మాదిరిగా వ్యవహరిస్తున్నారు.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

వారి నోటిని వేటితో కడగాలి?



పేద ఎస్సీ మహిళా కౌలు రైతునైన నాకు సెంటు భూమి కూడా లేదు. 6 ఎకరాలు కౌలుకు తీసుకుని పసుపు, వరి సాగు చేస్తున్నా. కరోనా సమయంలో పసుపు రూ. 5,500 ఉంటే మీరు రూ.6,850 ప్రకటించడంతో లబ్ధి పొందాం. గతేడాది పసుపు వర్షాలతో దెబ్బతింటే ఇన్సూరెన్స్ కింద రూ.80వేలు వచ్చాయి. టైలరింగ్ కూడా చేస్తున్న నాకు చేయూత సాయం అందుతోంది. మీరు పాదయాత్ర చేసినప్పుడు ప్రజలు బ్రహ్మరథం పట్టగా కొంతమంది మాత్రం మీరు వెళ్లిన తర్వాత తుడిచేశారు. ఇప్పుడు కొందరు పాదయాత్ర చేస్తున్నారు. వారి మాటలూ వింటున్నాం. మరి వాళ్ల నోటిని వేటితో కడగాలి?

– పి.మేరిమ్మ, రేవేంద్రపాడు, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా

సీఎం సారూ.. ఆదుకోండి..

- ముఖ్యమంత్రిని కలిసిన అనారోగ్య బాధితులు
- వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి
- వైద్యానికి అయ్యే ఖర్చు మంజూరు చేయాలని కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి ఆదేశం

వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్, మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించే కార్యక్రమానికి గుంటూరు జిల్లా తెనాలి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు అనారోగ్య బాధితులు కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. హెలిప్యాడ్ నుంచి సమావేశానికి వస్తున్న సమయంలో, సమావేశం వద్ద వారు ముఖ్యమంత్రిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో ముఖ్యమంత్రి స్పందించి వారికి మెరుగైన వైద్యం అందించడమే కాకుండా, దానికి అయ్యే ఖర్చును కూడా విడుదల చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిని ఆదేశించారు. – సాక్షి ప్రతినిధి, గుంటూరు



గుంటూరు జిల్లా తెనాలి మండలం కంచర్లపాలెం గ్రామానికి చెందిన బుల్లా శ్రీనివాస్ ముఖ్యమంత్రిని కలిసి తన కుమారుడు కార్తీక్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడని, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం రూ.26 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.26 లక్షలు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు.

బాపట్ల జిల్లా అమర్తలూరుకు చెందిన పోలియో బాధితురాలు కొల్లూరు జాన్సీ థైరాయిడ్, మానసిక వ్యాధులతో బాధపడుతున్నట్లు ఆమె తండ్రి కిషోర్ ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రస్తుతం మంచంలో ఉన్నందున ఆమెకు వస్తున్న పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచాలని, సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థికసాయం అందించాలని కోరారు.





వేమూరు మండలం చంపాడు గ్రామానికి చెందిన పాపిడిపాగు హదస్సాకు అగ్నిప్రమాదంలో రెండుకాళ్లు పూర్తిగా గాయపడ్డాయి. చికిత్స నిమిత్తం అయ్యే రూ.8.5 లక్షలను సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరు చేయాలని కోరారు.

నకిరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన గడిబోయిన శివలక్ష్మి బ్లడ్‌కేన్సర్ చికిత్స కోసం రూ.20 లక్షలు ఖర్చుచేశారు. వీరికి సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.11 లక్షలు మంజూరయ్యాయి. మిగిలిన మొత్తంతోపాటు ఇతర శస్త్రచికిత్సల కోసం ఆర్థికసాయం చేయాలని కోరారు.





కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన గోవాడ సురేష్‌కుమార్.. తనకు మెటబాలిక్ బేరియాట్రిక్, గాల్‌బ్లాడర్‌లోని రాళ్లకి సంబంధించిన శస్త్రచికిత్స కోసం రూ.15 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారని తెలిపారు. ఆ మొత్తం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఐతానగర్‌కు చెందిన దివ్యాంగులు కందుల అహల్య, కందుల అమూల్య తమకు ఆర్థికసాయం చేయాలని కోరారు.



ఏలూరు జిల్లా పెదపాడు మండలం వీరమ్మకుంట పంచాయతీకి చెందిన కర్నాటి వెంకటనాగమణి.. తనకు రెండు కిడ్నీలు పాడయ్యాయని, దీనికి చికిత్స కోసం రూ.25 లక్షలు ఖర్చయ్యాయని సీఎంకు చెప్పారు. మరో రూ.10 లక్షలు అవసరమని తెలిపారు. ఆ మొత్తాన్ని సీఎంఆర్‌ఎఫ్ కింద నిధులు మంజూరు చేయాలని కోరారు.



ముత్తంశెట్టిపాలేనికి చెందిన దామర్ల చంద్రశేఖర్ పుట్టు మూగ, చెవిటి. పదోతరగతి వరకు చదువుకున్నానని, తన అర్హతల మేరకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని ముఖ్యమంత్రిని కోరారు.

క్లుప్తంగా...

పింఛన్ల పంపిణీకి రూ.1,754.64 కోట్లు విడుదల

- నేడు 63.66 లక్షల మందికి వలంటీర్ల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు
- గ్రామ, వార్డు సచివాలయాల వారీగా నిధులు జమ: ఉప ముఖ్యమంత్రి బూడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 63,66,280 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, వివిధ చేతి వృత్తిదారులతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బుధవారం నుంచి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ.1,754.64 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో ఇప్పటికే జమ చేసినట్టు ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి డబ్బులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

'పడవ' బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

పొదలకూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని తోడేరులో జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురు కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలు పడుతున్న వేదనను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎంకు మంత్రి కాకాణి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎస్‌కు ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ నోటీసు

సాక్షి, అమరావతి: ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తాము చేపట్టదలచుకున్న ఉద్యమ కార్యాచరణ నోటీసును ఏపీ జేఏసీ అమరావతి నేతలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి అందించారు. తమ డిమాండ్లపై నిర్లక్ష్యంగా ఉన్న నేపథ్యంలో ఈ నెల 9 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకూ దశల వారీగా చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను మంగళవారం వెలగపూడి సచివాలయంలో జేఏసీ నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు తదితరులు సీఎస్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలన్నింటిపైనా స్పష్టమైన లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ఈ నెల 9 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు.

మహిళల స్వీయ శ్రద్ధే సమస్యలకు పరిష్కారం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



ఏఎన్‌యూ: మహిళలు తమ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ తీసుకోవడమే అన్ని సమస్యలకు పరిష్కారమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. ఏపీ మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్, ఏఎన్‌యూ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా 'మహిళలకు ఆరోగ్యం, మహిళలు, బాలికలకు సమానత్వం' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాసిరెడ్డి పద్మ ప్రసంగిస్తూ కుటుంబంతోపాటు తమ ఆరోగ్యమూ ముఖ్యమనే వాస్తవాన్ని మహిళలు గుర్తించాలన్నారు. బాధ్యత, సంస్కృతి, సాంప్రదాయం అనే సాకులతో మహిళ తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. మహిళ తనకున్న బాధ్యతలలో స్వయం సంరక్షణ కూడా ఉందనేది గ్రహించాలని చెప్పారు. వర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్, ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, మహిళా అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ శాంతిశ్రీ ప్రసంగించారు.

7న విశాఖకు చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం: ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఈ నెల 7న విశాఖలో పర్యటించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిలతో మధురవాడ వి కన్వెన్షన్‌లో సమావేశం కానున్నారు. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలతో సమీక్షించనున్నారు. అదేవిధంగా సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాల వారీగా మార్పులు చేపట్టాలా లేదా అనే అంశాలపైనా చర్చించనున్నారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించి టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జనాల రక్తం పీల్చుతున్న జగన్!

పాదయాత్రలో నారా లోకేశ్

తిరుపతి రూరల్/చంద్రగిరి: సీఎం వైఎస్ జగన్ చాలా తెలివిగలవారని, కొత్త కొత్త పద్ధతుల్లో పన్నులు వసూలు చేస్తూ జనాల రక్తం పీల్చుతున్నారని టీడీపీ నేత నారా లోకేశ్ ఆరోపించారు. యువగళం పేరుతో ఆయన నిర్వహిస్తున్న పాదయాత్ర మంగళవారం తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలో మామండూరు నుంచి పాకాల మండలం గాదంకి టోల్‌ప్లాజ వరకు సాగింది. మామండూరు వద్ద రజకులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే తిరుపతిలో రజక భవనానికి స్థలం ఇస్తామన్నారు.

రాష్ట్ర సంస్కృతికి అద్దం పట్టేలా..



విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జీఐఎస్ సదస్సు కోసం సిద్ధమవుతున్న ప్రాంగణాలు

విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు



టేబుల్ నోట్ బుక్‌పై కలంకారీ డిజైన్

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) ద్వారా కేవలం పెట్టుబడుల ఆకర్షణే కాకుండా రాష్ట్ర హస్తకళలు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వీటికి పెద్ద ఎత్తున ప్రచారం కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. సదస్సులో చర్చాగోష్టులకే పరిమితం కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యమివ్వనుంది. ఇందులో భాగంగా అటు సంప్రదాయ కళలకు కూడా పెద్దపీట వేయనుంది. మెడలో వేసుకునే బ్యాడ్జీల దగ్గర నుంచి కార్యక్రమంలో పాల్గొనే వారికి ఇచ్చే కిట్ల వరకు అన్నింటిలోనూ రాష్ట్ర హస్తకళలకు ప్రాచుర్యం కల్పించనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ రెండుసార్లు సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. తోలుబొమ్మల తయారీలో వినియోగించే మెటీరియల్‌తో కూడిన బ్యాడ్జీలు చేసి.. వాటి వెనుక పెడన కలంకారీ డిజైన్లను ముద్రించారు. ఆహూతులకు ఇచ్చే నోట్‌బుక్స్‌ను కూడా కలంకారీ డిజైన్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పెన్నులపై రాష్ట్ర పక్షి.. చిలుక లోగోతో పాటు అడ్వాంటేజ్ ఏపీ అని ముద్రించారు. ముఖ్య అతిథులకు సిల్వర్ పిలిగ్రీతో చేసిన రాష్ట్ర జీఐఎస్ లోగో బహూకరిస్తారు.



అతిథుల కోసం కలంకారీ డిజైన్‌తో తయారు చేసిన సిరామిక్ ప్లేట్

గిఫ్ట్ బాక్సుల్లో ఎన్నో ప్రత్యేకతలు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరయ్యే అతిథులకు ఇచ్చే గిఫ్ట్ బాక్స్‌ల్లో చాలా ప్రత్యేకతలున్నాయి. సిరామిక్ ప్లేట్, పెన్ను, అరకు కాఫీ, వుడెన్ కోస్టర్స్‌తో కూడిన గిఫ్ట్ బాక్స్‌లను ఇవ్వనున్నారు. ఈ సిరామిక్ ప్లేట్‌ను కలంకారీ డిజైన్‌తో అందంగా తీర్చిదిద్ది.. దాని వెనుక రాష్ట్ర చిహ్నం, జీఐఎస్ లోగోను ముద్రించారు. బ్లాక్ కలంకారీ డిజైన్‌తో వుడెన్ కోస్టర్స్‌ను అందంగా రూపొందించారు. చూడగానే ఆకట్టుకునేలా గిఫ్ట్ బాక్స్‌లపైనా కలంకారీ డిజైన్‌ను ముద్రించారు.

సదస్సులో వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ కింద రాష్ట్రంలోని హస్తకళలు, వివిధ ఉత్పత్తులకు ప్రచారం కల్పించేలా ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



డెలిగేట్స్ కోసం సిద్ధం చేసిన బ్యాగ్



వుడెన్ కోస్టర్స్

కూచిపూడి, జానపద కళలకు పెద్దపీట..

సదస్సు జరిగే రెండు రోజులు రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కూచిపూడి నృత్యం, జానపద కళలకు పెద్దపీట వేశారు. మార్చి 3న తొలిరోజు రాష్ట్ర గీతం.. 'మా తెలుగు తల్లి'తో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ప్రముఖ నర్తకి యామినీరెడ్డితో కూచిపూడి నృత్యంతోపాటు ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ తుషార్ కలియాతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. వీటితోపాటు రాష్ట్ర జానపద కళలైన థింసా, తప్పెటగుళ్లు, గరగలు, ఉరుములు, కొమ్ము నృత్యం తదితర ప్రదర్శనలు అతిథులను ఆకట్టుకోనున్నాయి. సదస్సు రెండో రోజు నవరత్న పథకాలను అందరికీ అర్థమయ్యేలా కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించనున్నారు.





4న సీఎం జగన్ సమక్షంలో కీలక ఒప్పందాలు

రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రాథమిక అంచనా

- రాష్ట్రంలో పరిశ్రమలకు ఉన్న వనరులను ప్రపంచానికి పరిచయం చేస్తాం
- ఇండస్ట్రియల్ కారిడార్లలో కేటాయింపులకు సిద్ధంగా 48 వేల ఎకరాలు
- ఎంపికచేసిన 14 రంగాల్లో పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం
- ఎర్లీబర్డ్ కింద జీఐఎస్‌లో పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)–2023లో భాగంగా మార్చి 4వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో కీలక పారిశ్రామిక ఒప్పందాలు జరగనున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. విశాఖలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన జీఐఎస్–2023కు సంబంధించిన వివరాలు తెలిపారు. ఏపీలో ఏయే రంగాల్లో పెట్టుబడులకు ఎంతమేర అవకాశాలున్నాయి, రాష్ట్రంలో ఉన్న వనరులు, సౌకర్యాలు మొదలైన అంశాలన్నింటినీ ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి చాటిచెబుతామన్నారు. 14 రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి ఎంవోయూలు జరుగుతాయని చెప్పారు. రెండురోజుల పాటు సదస్సులో కీలక ఒప్పందాలు జరగనున్నాయన్నారు. 24 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్న ఈ సదస్సుకు ప్రపంచస్థాయి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఐటీ, వ్యవసాయం, హెల్త్, ఫార్మా, టూరిజం, ఎంఎస్ఎంఈ, పునరుత్పాదక ఇంధన రంగం, డిఫెన్స్, ఏరోస్పేస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, మేరీటైమ్ తదితర రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాల్ని దేశవిదేశీ ప్రతినిధులకు వివరిస్తామని తెలిపారు. అత్యధిక పెట్టుబడులు వచ్చే పునరుత్పాదక ఇంధన వనరుల రంగం, అత్యధికంగా ఉపాధి అవకాశాలు సృష్టించే టెక్స్‌టైల్స్ రంగంపై ప్రధానదృష్టి సారించినట్లు చెప్పారు.

త్వరలో కొత్త పారిశ్రామిక విధానం

ప్రస్తుత పారిశ్రామిక విధానం మార్చితో ముగియనున్న నేపథ్యంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా కొత్త ఇండస్ట్రియల్ పాలసీని రూపొందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలనలో ఉందన్నారు. సీఎం ఆమోదం పొందిన తర్వాత త్వరలోనే 2023–28కి కొత్త ఇండస్ట్రియల్ పాలసీని అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు. కొత్త పాలసీతో పాటు జీఐఎస్‌లో ఎంవోయూ చేసుకున్న సంస్థలు ఆరునెలల్లోగా పరిశ్రమల స్థాపనకు పనులు ప్రారంభిస్తే ఎర్లీబర్డ్ పాలసీ ద్వారా అదనపు ప్రోత్సాహకాలు అందించాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారని తెలిపారు. ఈ ప్రత్యేక రాయితీల గురించి సీఎం జీఐఎస్‌లో ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఇండస్ట్రియల్ పాలసీతోపాటు, ఇతర రంగాల పాలసీలు కూడా అద్భుతంగా ఉన్నాయని, అవి ఆయా రంగాల్లో పెట్టుబడులు ఆహ్వానించనున్నాయని పేర్కొన్నారు.

కార్యరూపం దాల్చే పరిశ్రమలతోనే ఒప్పందాలు

దావోస్‌లో రూ.128 వేల కోట్ల ఒప్పందాలు జరిగితే ప్రస్తుతం రూ.38 కోట్ల పరిశ్రమలు పైప్‌లైన్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ జీఐఎస్ ద్వారా రూ.2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వస్తాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని, అంతకుమించి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా అంకెల గారడీతో ప్రజల్ని మభ్యపెట్టకుండా, వాస్తవంగా కార్యరూపం దాల్చే పరిశ్రమలతోనే ఒప్పందాలు చేసుకుని వాటిని మాత్రమే ప్రజలకు వివరిస్తామని తెలిపారు. టీడీపీ హయాంలో ఉత్తుత్తి ఒప్పందాలు చేసుకుని ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టని సంస్థలు మరోసారి ఎంవోయూలు చేసుకుంటామని వచ్చినా ఆహ్వానించే పరిస్థితి లేదని పేర్కొన్నారు.

సుదీర్ఘ తీరంలో పెట్టుబడులకు అవకాశాలు

దేశంలోనే సుదీర్ఘ తీరరేఖ కలిగిన రాష్ట్రాల్లో రెండో స్థానంలో ఉన్నా.. మొదటి స్థానంలో ఉన్న గుజరాత్‌తో పోలిస్తే ఏపీ తీరం వెంబడి పెట్టుబడులకు పుష్కలమైన అవకాశాలున్నాయని చెప్పారు. అందుకే తీరం వెంబడి పోర్టుల అభివృద్ధికి సంబంధించిన పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. ఏపీ మారిటైం బోర్డు ద్వారా రూ.15 వేల కోట్లతో 10 పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్లుని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి రామాయపట్నం పోర్టుకు మొదటి కార్గోవెసల్ తీసుకురావాలన్న లక్ష్యంతో పనులు పూర్తిచేస్తున్నామన్నారు. ప్రతి పోర్టుకి అనుసంధానంగా పారిశ్రామిక అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా దాదాపు 5 వేల ఎకరాలు, భావనపాడులో 3 వేల ఎకరాల వరకు పారిశ్రామిక అభివృద్ధి కోసం సమాలోచనలు జరుగుతున్నాయని వెల్లడించారు. దేశంలో ఉన్న 11 ఇండస్ట్రియల్ కారిడార్లలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలో 3 కారిడార్లున్నాయని చెప్పారు. ఈ కారిడార్లలో 48 వేల ఎకరాల భూమి కేటాయించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పెద్దపెద్ద పెట్రోలియం కంపెనీలు కూడా వచ్చేలా చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ డైరెక్టర్ సృజన పాల్గొన్నారు.

బ్రహ్మాండంగా వ్యాపారం చేసుకుంటున్న చంద్రబాబు

పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తుండటం హాస్యాస్పదమన్నారు. ఏపీలో మంచి వాతావరణం లేకపోతే ప్రతిపక్షనేత చంద్రబాబుకు చెందిన హెరిటేజ్ కంపెనీని ఎప్పుడో తరలించేవారన్నారు. కానీ అది జరగలేదని, అంటే ఏపీలో ఎంత మంచి వాతావరణం కల్పిస్తున్నామో అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. బ్రహ్మాండంగా బిజినెస్ చేసుకుంటున్న చంద్రబాబు.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి ప్రపంచానికి చాటిచెప్పాలని, కానీ ఆయనకు అంత మంచి మనసు లేదని ఎద్దేవా చేశారు.

2,500 మంది పోలీసులతో భద్రత

విశాఖ నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఎస్ఐ)కి 2,500 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చెప్పారు. నగరంలో జరుగుతున్న సదస్సు ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సమ్మిట్‌కు వచ్చేందుకు సుమారు పదివేలమంది ప్రతినిధులు రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. వీరితోపాటు 50 నుంచి 60 మంది ఇతర దేశాల నుంచి వస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. అతిథులందరికీ ఎంజీఎం పార్కులో ముఖ్యమంత్రి విందు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. 2,500 మంది పోలీసులతోపాటు గ్రేహౌండ్స్, ఆక్టోపస్, క్యూఆర్‌టీ టీమ్స్‌తో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అతిథులు ఎయిర్‌పోర్టు నుంచి వేదికకు వచ్చి తిరిగి వెళ్లేవరకు 800 మంది ట్రాఫిక్ పోలీసులు రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణలను పర్యవేక్షించనున్నట్లు ఆయన తెలిపారు.

పారిశ్రామిక కారిడార్లకు మహర్దశ

జీఐఎస్ నేపథ్యంలో నగర సుందరీకరణ

వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల



సాక్షి, విశాఖపట్నం: విశాఖలో జరగనున్న జీఐఎస్‌తో రాష్ట్రంలోని విశాఖ–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్లకు మహర్దశ పట్టనుందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల చెప్పారు. విశాఖ మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. జీఐఎస్ సందర్భంగా విశాఖ నగరంలో ప్రధాన జంక్షన్లు, బీచ్ రోడ్డు, పర్యాటక ప్రాంతాలను సుందరీకరిస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రధాన జంక్షన్లలో, ముఖ్యంగా ఏయూ గోడలపై స్థానికతను తెలిపే కళాచిత్రాలు వేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కృపాజ్యోతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

జీరో ర్యాగింగ్

- వైద్య కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు చురుగ్గా పనిచేయాలి
- సీసీ కెమెరాలు తప్పనిసరి
- ప్రిన్సిపాళ్లకు మంత్రి రజిని ఆదేశం



సాక్షి, అమరావతి: ర్యాగింగ్ విషయంలో రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలు బాధ్యులు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. తెలంగాణలో వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య నేపథ్యంలో మంగళగిరిలో మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లతో మంత్రి రజిని సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ విషయంలో కఠినంగా ఉండాలని ఆదేశించారు. జూనియర్ మెడికోలపై సీనియర్లు ఎలాంటి వేధింపులకు పాల్పడకుండా చూడాలన్నారు. ఇందుకు కళాశాలల్లోని యాంటీ ర్యాగింగ్ కమిటీలు చురుకుగా పనిచేయాలని చెప్పారు. ర్యాగింగ్, ఇతర వేధింపులకు సంబంధించి ఆయా కళాశాలలపై నేరుగా డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పర్యవేక్షణ ఉండాలన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ప్రతి విద్యార్థిని దిశ యాప్‌ను వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. చదువుల్లో నాణ్యతే కాదని, భద్రత కూడా ఉండాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి వైద్య కళాశాల డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ కార్యక్రమం అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి పీజీ విద్యార్థి మూడు నెలలు గ్రామీణ ప్రాంతంలో పనిచేయాలని చెప్పారు.

నారాయణకు సీఐడీ నోటీసులు

అమరావతి భూ కుంభకోణం కేసులో దూకుడు

సాక్షి, అమరావతి: చంద్రబాబు హయాంలో అమరావతిలో చోటుచేసుకున్న భూ కుంభకోణాలపై దర్యాప్తులో సీఐడీ అధికారులు దూకుడు పెంచారు. నారా, నారాయణ అవినీతి బంధం గుట్టును ఇప్పటికే రట్టుచేసిన అధికారులు ఆ దిశగా విచారణను మరింత వేగవంతం చేశారు. అమరావతిలో భూదోపిడీకి సంబంధించి నాటి సీఎం చంద్రబాబును ఏ–1గా, మున్సిపల్ మంత్రిగా చేసిన పొంగూరు నారాయణను ఏ–2గా సీఐడీ అధికారులు గతంలోనే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా అమరావతి మాస్టర్ ప్లాన్‌లో స్టార్టప్ ఏరియా ఎంపిక, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ల రూపకల్పనలో అక్రమాలపై నారాయణ, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు తమ ముందు విచారణకు హాజరుకావాలని మంగళవారం నోటీసులు జారీచేశారు. సీఐడీ అధికారులు కొన్ని నెలల క్రితం హైదరాబాద్‌లోని నారాయణ నివాసాల్లో సోదాలు.. ఇటీవలే హైదరాబాద్‌లోని నారాయణ కుమార్తెల నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు. అమరావతి స్టార్టప్ ఏరియా, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాలకు సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. నారాయణ విద్యా సంస్థలకు చెందిన ఎన్‌స్పైరా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నిధులు మళ్లించి.. ఆ సంస్థల ఉద్యోగులను బినామీలుగా చేసుకుని అసైన్డ్ భూములు కొల్లగొట్టినట్లు ఆధారాలు వెలుగు చూశాయి. దీంతో నారాయణ, ఆయన భార్య పి. రమాదేవి, కుమార్తెలు పి.సింధూర, పి.శరణి, అల్లుడు పునీత్ కొత్తప్ప, అల్లుని సోదరుడు వరుణ్‌కుమార్ కొత్తప్ప, రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అంజనీకుమార్, ఎన్‌స్పైరా ఉద్యోగి ప్రమీల మార్చి 6, 7 తేదీల్లో విచారణకు హాజరుకావాలని సీఆర్‌పీసీ 41ఏ కింద వారికి సీఐడీ నోటీసులు జారీచేసింది.

మార్చి 6న విచారణకు హాజరుకావల్సిన వారు..

- పొంగూరు నారాయణ
- పి. రమాదేవి
- పొత్తూరి ప్రమీల
- కేపీవీ అంజనీకుమార్

మార్చి 7న..

- పి. సింధూర
- పి.శరణి
- పునీత్ కొత్తప్ప
- వరుణ్‌కుమార్ కొత్తప్ప

ఇన్నర్ రింగ్ రోడ్డు.. ఇన్‌సైడర్ ట్రేడింగ్..

సీఆర్‌డీఏ అధికారులు ఇన్నర్ రింగ్‌రోడ్డు (విజయవాడ తూర్పు బైపాస్) అలైన్‌మెంట్‌ను 2016, డిసెంబర్ 12న ఖరారు చేశారు. దాని ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డు కానూరులోని నారాయణ విద్యా సంస్థలకు చెందిన భవానీ క్యాంపస్ మీదుగా వెళ్తుంది. అప్పట్లో మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న నారాయణ అధికార దుర్వినియోగానికి పాల్పడి ఆ అలైన్‌మెంట్‌కు మార్పులు చేసేలా సీఆర్‌డీఏను ప్రభావితం చేశారు. చంద్రబాబు, నారాయణ కుటుంబ సంస్థలకు చెందిన భూముల సమీపం నుంచే నిర్మించేలా.. తాడిగడప–ఎనికేపాడు 100 అడుగుల రోడ్డుకు 3 కి.మీ. అవతలకు ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చారు. పోరంకిలోని నారాయణ శ్రీకరీ భవన్, నిడమానూరులోని నారాయణ బైపీసీ బాలికల క్యాంపస్, నిడమానూరులోని నారాయణ బైపీసీ బాలుర క్యాంపస్, గూడవల్లిలోని నారాయణ వేదవ్యాస స్పార్క్ ఐఐటీ క్యాంపస్, ఈడుపుగల్లులోని నారాయణ విద్యా సంస్థల భవనాలకు సమీపం నుంచే ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. అలాగే, చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, ఆయన సన్నిహితుడు లింగమనేని సంస్థలు, నారాయణ విద్యాసంస్థలు, నారాయణ బినామీగా భావిస్తున్న రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భూముల సమీపం నుంచి ఈ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను నిర్ణయించారు. దాంతో హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ, లింగమనేని, రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భూముల విలువ అమాంతం పెరిగేలా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అంతేకాదు.. 2016, 2017లలో నారాయణ విద్యా సంస్థలు అదే ప్రాంతంలో పలువురు భూయజమానులతో ల్యాండ్ డెవలప్‌మెంట్ ఒప్పందాలు చేసుకుని భవనాలను నిర్మించడం గమనార్హం.

- రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భూముల విలువ కూడా భారీగా పెరిగాయి. ఆ సంస్థ భూములున్న పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని నంబూరు గ్రామంలో 2015లో ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.16లక్షలు ఉండగా.. 2018 నాటికి రూ.57,75,000కు పెరిగింది. కాజ ప్రాంతంలో 2015లో ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.14లక్షలు ఉండగా... 2018 నాటికి రూ.21 లక్షలకు పెరిగింది. అక్కడ మార్కెట్ ధర ఎకరా రూ.5 కోట్లకు పైగా ఉండటం గమనార్హం.
- 2015లో ప్రభుత్వ ధర ప్రకారం పోరంకిలో చ.గ.రూ.9,500, పెనమలూరులో రూ.4వేలు, గంగూరులో రూ.5,800 ఉండేది. ఈడుపుగల్లులో ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.75 లక్షలుగా ఉండేది. కానీ, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారుచేసిన తరువాత ఆ ప్రాంతంలో భూముల ధరలు అమాంతంగా పెరిగాయి. చదరపు గజం భూమి కనీస విలువ పోరంకిలో రూ.12,700, పెనమలూరులో రూ.5,100, గంగూరులో రూ.7,650కు పెరిగింది. ఇక ప్రభుత్వ ధర ప్రకారం ఈడుపుగల్లులో ఎకరా రూ.1.54 కోట్లకు చేరింది. మార్కెట్ విలువ ఎకరా ఏకంగా రూ.8 కోట్లకు చేరుకుంది. నారాయణ విద్యా సంస్థలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి.
- 2015లో నిడమానూరులో ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.60లక్షలు, గూడవల్లిలో రూ.25 లక్షలు ఉండేది. అలైన్‌మెంట్ రూపొందించాక నిడమానూరు, గూడవల్లిలో ఎకరా రూ.3.86 కోట్లకు పెరిగింది. అక్కడ మార్కెట్ విలువ ప్రకారం ఎకరా ధర రూ.10 కోట్లకు చేరుకుంది.

నారాయణ భూముల సమీపంలోనే స్టార్టప్ ఏరియా..

అమరావతిలోని సీడ్ క్యాపిటల్ పరిధిలో స్టార్టప్ ఏరియా ఎంపికలోనూ నారాయణ భారీ అక్రమాలకు పాల్పడ్డారు. తాను అనుకున్న 6.84 చదరపు కి.మీ. పరిధిలోని ప్రాంతమే సీడ్ క్యాపిటల్‌గా ఎంపిక చేశారు. ఆ ప్రకటనకు ముందుగానే అంటే 2015 జూన్ నుంచి ఆగస్టు మధ్యలో ఆ స్టార్టప్ ఏరియాకు సమీపంలోనే నారాయణ తన కుటుంబ సభ్యులు, తమ సంస్థల్లో ఉద్యోగుల పేరిట 65.50 ఎకరాలను రూ.4.23 కోట్లకు కొనుగోలు చేశారు. తన సమీప బంధువు ఆవుల మునిశంకర్, తన కుమార్తె, అల్లుడి పేరున నెలకొల్పిన ఎన్‌స్పైర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌లో ఉద్యోగి పొత్తూరి ప్రమీల, తన బావమరిది రాపూరు సాంబశివరావు, తన అల్లుడి సోదరుడు కె.వరుణ్‌కుమార్ పేరున ఆ భూములు కొనుగోలు చేశారు. దానికి కొన్ని రోజుల ముందే ఆవుల మునిశంకర్, పొత్తూరి ప్రమీల, రాపూరు సాంబశివరావు ఖాతాల్లోకి భారీగా నిధులు బదిలీ చేసినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. ఆ డబ్బులతోనే నారాయణ బినామీలుగా వారి పేరిట 148 ఎకరాల అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. అందుకోసం నారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ, నారాయణ లెర్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్, రామనారాయణ ట్రస్ట్‌ల నుంచి రూ.17.50 కోట్లను రామకృష్ణా హౌసింగ్ సొసైటీ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ నిధులను నారాయణ భార్య పి.రమాదేవి, కుమార్తెలు పి.సింధూర, పి.శరణి, అల్లుడు పునీత్ కొత్తప్ప, అల్లుని సోదరుడు వరుణ్ కొత్తప్ప, కుటుంబ సభ్యులు పి.సుబ్రహ్మణ్యం, పి.ఇందిర పేరుతోనే మళ్లించారు. ఆ తర్వాత వాటిని కేపీవీ అంజనీకుమార్ బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేశారు. ఆ ఖాతా నుంచి రైతులకు డబ్బులు చెల్లించి అసైన్డ్ భూములను తమ పేరిట బలవంతంగా రాయించుకున్నారు.



వన్య మృగం కన్నా కపటి, దుష్టుడు అయిన స్నేహితుడికి ఎక్కువ భయపడాలి. వన్యమృగం మీ శరీరాన్నే గాయపరచవచ్చు, కానీ దుష్ట స్నేహితుడు మీ మనసును గాయపరుస్తాడు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, మార్చి, 1

సతత హరిత వ్యూహాత్మకం

ఢిల్లీలోని చాణక్యపురిలో రోడ్డుపై దుకాణంలో తేనీరు సేవించిన జర్మనీ అధినేత! ఇది, ప్రధాని మోదీతో కలసి సంయుక్త మీడియా ప్రకటన మినహా జర్మనీ ఛాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ రెండు రోజుల భారత అధికారిక పర్యటనపై హడావిడి వార్తలు, ప్రకటనలు మీడియాలో కనిపించి ఉండకపోవచ్చు. అంతమాత్రాన షోల్జ్ భారత పర్యటన అప్రధానమనుకుంటే పొరపాటే. రాష్ట్రపతిని కలసి సంభాషించడం, ప్రధానిని కలసి చర్చించడం, ఔత్సాహిక వ్యాపారవేత్తలతో గోష్ఠి జరపడం – ఇలా ఫిబ్రవరి 25, 26ల్లో షోల్జ్ సుడిగాలిలా చుట్టేశారు. ఇప్పటికే జపాన్, చైనా, ఆసియాన్ దేశాల్లో పర్యటించిన ఆయన తమ దేశ ఇండో–పసిఫిక్ విధానంలో భాగంగా భారత్‌తో బంధం దృఢమైనదని తేల్చేశారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి ఏడాది నిండిన వేళ ఈ పర్యటన వ్యూహాత్మకంగా కీలకమనేది అందుకే.

పదహారేళ్ళ సుదీర్ఘ ఏంజెలా మెర్కెల్ పాలన తర్వాత 2021 డిసెంబర్‌లో జర్మనీ ప్రభుత్వాధినేత అయిన షోల్జ్ ఆ పైన మన దేశంలో పర్యటించడం ఇదే తొలిసారి. ఆ మాటకొస్తే, 2011 తర్వాత ఒక జర్మన్ నేత భారత్‌లో ప్రత్యేకంగా పర్యటించడం కూడా ఇదే ప్రథమం. అలా ఈ తాజా పర్యటనకు విశేష ప్రాధాన్యం ఉంది. జర్మన్ అధినేత వెంట వచ్చిన వ్యాపార ప్రతినిధి బృందంలో సీమెన్స్, శాప్ సంస్థలు ఉన్నాయి. ఐటీ, టెలికామ్ సహా కీలక రంగాల్లో భారత సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాయి. స్వచ్ఛ ఇంధనం, వాణిజ్యం, నవీన సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల పటిష్ఠతే లక్ష్యంగా ప్రధాని మోదీతో షోల్జ్ విస్తృత స్థాయి చర్చలు జరిపారు. మరీ ముఖ్యంగా, యూరప్ తన సరఫరా వ్యవస్థలను చక్కదిద్దుతున్న వేళ షోల్జ్ చర్చలు కీలకమయ్యాయి.

సహజంగానే ఉక్రెయిన్ వ్యవహారం అజెండాలో ముందుంది. అయితే, రష్యా వ్యతిరేక వైఖరి తీసుకొనేలా ఒత్తిడి తెచ్చే కన్నా... అందరికీ కావాల్సిన మనిషిగా, మధ్యవర్తిత్వం నెరిపే వీలున్న దేశంగా భారత్‌తో జర్మనీ జత కడుతోంది. జీ20 సారథిగా భారత్ ఈ యుద్ధానికి త్వరగా తెరపడేలా చేసి, ఆర్థిక పునరుజ్జీవనం జరిపించాలని భావిస్తోంది. అందుకీ పర్యటనను సాధనంగా ఎంచుకుంది. రష్యా రక్షణ ఉత్పత్తుల సరఫరాలపై భారత్ ఆధారపడినందున జలాంతర్గాముల సంయుక్త తయారీ లాంటి అంశాల్లో భారత్‌తో చేయి కలుపుతూ, సరఫరా వ్యవస్థల్లో మార్పుకు చూస్తోంది. ఈ భౌగోళిక – రాజకీయ సంక్షోభాన్ని కాస్త పక్కనపెడితే, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని పటిష్ఠం చేసుకొనేలా ఒక దార్శనిక పత్రాన్ని మోదీతో కలసి షోల్జ్ ఆమోదించారు. స్వచ్ఛ ఇంధన సాంకేతికత నుంచి కృత్రిమ మేధ (ఏఐ) దాకా పలు హామీలు ఇచ్చిపుచ్చుకున్నారు. రెండు అంతర్ ప్రభుత్వ పత్రాలతో పాటు, మూడు వ్యాపార ఒప్పందాల పైనా చేవ్రాలు జరిగింది.

నూతన ఆవిష్కరణల పత్రంలో ప్రధానంగా హరిత ఉదజని సహా ఇంధన, స్వచ్ఛ సాంకేతికతల్లో భాగస్వామ్యానికి అగ్ర తాంబూలం ఇచ్చారు. హరిత ఉదజని ఆర్థికంగా గిట్టుబాటయ్యేలా చూడడమే ఉమ్మడి దీర్ఘకాలిక లక్ష్యం. కొన్నేళ్ళుగా ఇరుదేశాల మధ్య సంబంధాలు కీలక రంగాల్లో జోరందుకున్నాయి. గత డిసెంబర్‌లో జర్మన్ విదేశాంగ మంత్రి భారత్‌ను సందర్శించారు. షోల్జ్ పర్యటనకు రంగం సిద్ధం చేశారు. గత ఏడాది కాలంలో మూడుసార్లు కలసిన మోదీ, షోల్జ్‌ల మధ్య మంచి స్నేహం నెలకొంది. నిరుడు మేలో 6వ ఇండియా– జర్మనీ అంతర్ ప్రభుత్వ సంప్రతింపులలో (ఐజీసీ) ఇరువురు నేతలూ తొలిసారి సమావేశమయ్యారు. ఆపైన జర్మనీ సారథ్యంలోని 'జీ7' సదస్సుకు మోదీని షోల్జ్ ఆహ్వానించారు. జూన్‌లో ఆ వార్షిక సదస్సులో మోదీ పాల్గొన్నారు. ఇక నవంబర్‌లో 'జీ20' సదస్సు వేళ ఇండొనేసియాలో ద్వైపాక్షిక చర్చలతో బంధం బలపడింది.

ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పలు సవాళ్ళను దీటుగా ఎదుర్కొనే విషయంలో భారత, జర్మనీల దృక్పథం చాలావరకు కలుస్తుంది. నియమానుసారమే అంతర్జాతీయ క్రమం సాగాలనీ, ఐరాస నిబంధనావళిలోని అంతర్జాతీయ న్యాయ ఆదేశిక సూత్రాలను గౌరవించాలనీ ఇరుదేశాల వైఖరి. ఈ అభిప్రాయాలతో పాటు ఇండో– పసిఫిక్ విధానంలో భాగంగా అంతర్జాతీయ అవసరాలు, అనివార్యతలు ఉభయ దేశాలనూ మరింత దగ్గర చేశాయి. యూరోపియన్ యూనియన్ (ఈయూ) – భారత్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ), ఈయూలో భాగం కాని థర్డ్ కంట్రీల్లో అభివృద్ధి పథకాలపై చర్చల్ని త్వరితగతిన ఖరారు చేయాలని జర్మనీ గట్టిగా యత్నిస్తోంది. గతంలో ఆరేళ్ళు చర్చించినా, 2013లో తొలిసారి మన ఎఫ్టీఏ ప్రయత్నం విఫలమైంది. ఇప్పుడు షోల్జ్ సైతం ఎఫ్టీఏకు వ్యక్తిగతంగా కట్టుబడ్డారు. ఇవన్నీ ప్రపంచ వేదికపై పెరుగుతున్న భారత్ పలుకుబడికి నిదర్శనం.

జర్మనీ విదేశాంగ మంత్రి ఆ మధ్య అన్నట్టు, 'ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా చైనాను అధిగమిస్తున్న భారత్‌ను సందర్శిస్తే, ప్రపంచంలో ఆరోవంతును చూసినట్టే.' అలాగే, '21వ శతాబ్దంలో ఇండో– పసిఫిక్‌లోనూ, అంతకు మించి అంతర్జాతీయ క్రమాన్ని తీర్చిదిద్దడంలో నిర్ణయాత్మక ప్రభావం భారత్‌దే.' ఇక, మన దేశంలో దాదాపు 1800 జర్మనీ సంస్థలు క్రియాశీలంగా ఉన్నాయి. భారత్‌లో భారీ విదేశీ పెట్టుబడుల్లోనూ ముందున్న ఆ దేశం వేలల్లో ఉద్యోగ కల్పనకు కారణమవుతోంది. ఈ పరిస్థితుల్లో షోల్జ్ ఆత్మీయ స్నేహం, అవసరమైన మిత్రుడితో మోదీ అనుబంధం అర్థం చేసుకోదగినవి. 141 కోట్ల జనాభాతో అపరిమిత ఇంధన అవసరాలున్న వేళ, హరిత ఇంధనం సహా అనేక అంశాల్లో జర్మనీతో బంధం భవిష్యత్తుకు కీలకమైనది. ఈ సమయం, సందర్భాలను అందిపుచ్చుకోవడమే భారత్‌కు తెలివైన పని.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.నవమి ఉ.6.33 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** మృగశిర ఉ.11.57 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.9.05 నుండి 10.51 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.50 నుండి 12.34 వరకు, **అమృతఘడియలు:** రా.3.10 నుండి 4.56 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

నైతిక పునాది లేని జాతీయవాదం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పర్చడానికి విదేశీ విశ్వవిద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం తలుపులు తెరిచింది. ఈ క్యాంపస్‌ను ఏర్పర్చాలనుకునే విదేశీ విశ్వవిద్యాలయం గ్లోబల్ ర్యాకింగ్స్‌లో టాప్ – 500ల్లో ఉండాలి. స్పష్టంగా వీటిలోని కోర్సులను ప్రపంచస్థాయిలో పోటీపడే సిలబస్‌తో ఇంగ్లిష్‌లో నేర్పుతారు. కేంద్రం ఇంగ్లిష్‌లో తమ ఇచ్ఛప్రకారం కోర్సులను బోధించే విశ్వవిద్యాలయాలను అనుమతించడం ఆశ్చర్యంగా లేదా? ఇదే ప్రభుత్వం ఉన్నత విద్యా సంస్థల్లో హిందీని బోధనా భాషగా చేయాలనీ, సిలబస్ భారతీయ సంస్కృతిపై ఎక్కువగా ఆధారపడి ఉండాలనీ చెబుతూ వచ్చింది. ప్రశ్న ఏమిటంటే, భారతీయ విశ్వవిద్యాలయాల్లో హిందీలో చదివేవారు ఎవరు? విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఇంగ్లిష్‌లో అధ్యయనం చేసేది ఎవరు?

మన విద్యా వ్యవస్థ ద్వంద్వ ప్రమాణాల వల్ల దెబ్బతింటోంది. తీవ్ర జాతీయవాది సైతం తమ పిల్లలకు ఇంగ్లిష్, విదేశీ యూనివర్సిటీ విద్య నేర్పించడాన్నే ఇష్టపడుతున్నారు. మరోవైపు సంస్కృతి, వారసత్వం, మాతృభాష అంటూ రాగం ఎత్తుకుంటారు. ఒక కుటుంబానికి డబ్బుంటే, వారి పిల్లలు ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్స్‌లో చదవడానికి భారీగా ఖర్చు చేస్తారు. విదేశీ యూనివర్సిటీల్లో చదవడానికి అమెరికా లేదా ఇంగ్లండ్‌కు పోతారు. కానీ స్వదేశంలో అత్యున్నత విజ్ఞానాన్ని మన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు బోధించాలని వీరు కోరుకోవడం లేదు.

కేంద్ర ప్రభుత్వం కొన్ని నెలల క్రితం భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పర్చడానికి విదేశీ విశ్వవిద్యాలయాలకు (యేల్, హార్వర్డ్, ప్రిన్స్‌టన్) తలుపులు తెరిచింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్‌పర్సన్ ఎం. జగదీశ్ కుమార్ జనవరి 5న నిర్వహించిన ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ ప్రకటన చేశారు. మీడియా నివేదికల ప్రకారం, 'భారత్‌లో తన క్యాంపస్‌ను ఏర్పర్చాలనుకునే విదేశీ విశ్వవిద్యాలయం గ్లోబల్ ర్యాకింగ్స్‌లో టాప్– 500ల్లో ఉండాలి.' అంటే వివిధ దేశాలకు చెందిన అగ్రశ్రేణి యూనివర్సిటీలు భారత్ లోని కొత్త క్యాంపస్‌లపై దృష్టి సారిస్తాయని దీనర్థం. స్పష్టంగా వీటిలోని అన్ని కోర్సులను ప్రపంచస్థాయిలో పోటీపడే సిలబస్‌తో ఇంగ్లిష్‌లో నేర్పుతారు.

బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇంగ్లిష్‌లో తమ ఇచ్ఛప్రకారం కోర్సులను బోధించే విశ్వవిద్యాలయాలను అనుమతించడం ఆశ్చర్యం కలిగించడం లేదా? ఇదే ప్రభుత్వం ఉన్నత విద్యా సంస్థల్లో హిందీని బోధనా భాషగా చేయాలనీ, సిలబస్ భారతీయ సంస్కృతి, వారసత్వంపై ఎక్కువగా ఆధారపడి ఉండాలనీ పదే పదే చెబుతూ వచ్చింది. యూనివర్సిటీ సిలబస్‌లో నిర్బంధంగా వేద, పురాణ అధ్యయనాలను చొప్పించాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. వివాదాస్పదమైన ప్రశ్న ఏమిటంటే, భారతీయ విశ్వవిద్యాలయాల్లో హిందీలో చదివేవారు ఎవరు, విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఇంగ్లిష్‌లో అధ్యయనం చేసేది ఎవరు? విదేశీ విశ్వవిద్యాలయాలు వేద విజ్ఞానం, గణితం, మానవ శాస్త్రాలను 'ప్రపంచ' నాగరికతా ఆధారాలుగా హిందీలో బోధిస్తాయా?

'భారతీయ క్యాంపస్‌లో విదేశీ విశ్వవిద్యాలయం అందించే విద్యా నాణ్యత, దాని సొంత దేశంలోని ప్రధాన క్యాంపస్‌లో అందించే విద్యానాణ్యతకు సమానంగా ఉంటుందని హామీ ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే భారతీయ క్యాంపస్‌లోని విద్యార్థులకు అందించే విద్యాపరమైన అవార్డులు సొంతదేశంలోని ప్రధాన క్యాంపస్‌లోని ఉన్నత విద్యాసంస్థలు అందించే విద్యాపరమైన అవార్డులకు సరిసమానంగా



ఉండటమే కాకుండా ఆ మేరకు తగిన గుర్తింపును కూడా ఇవ్వాల్సి ఉంటుంది' అని యూజీసీ చైర్‌పర్సన్ జగదీశ్ కుమార్ పేర్కొన్నారు. భారత్‌లో విదేశీ విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి గురించి కూడా ఆయన నొక్కి చెప్పారు. క్యాంపస్‌లో విద్యా కార్యక్రమాలు, మౌలిక వసతుల విషయంలో తప్ప, నిర్వహణాత్మక అంశంలో యూజీసీ నుంచి ఎలాంటి జోక్యం ఉండబోదని అన్నారు.

జాతీయ విద్య వర్సెస్ గ్లోబల్ విద్యతో దేశాన్ని కుల, వర్గ ప్రాతిపదికన మరింతగా విభజించాలని మోదీ ప్రభుత్వం కోరుకుంటున్నట్లయితే, భారతీయ యూనివర్సిటీలలో విద్యా నాణ్యత, పట్టభద్రుల ఉపాధి విషయం ఏమిటి? ఇదే జరిగితే, భారత్ మరోసారి తన అంధకార గతం వైపు వెళ్లిపోతుంది. శూద్రులు, ఇతర వెనుకబడిన వర్గాలు (ఓబీసీలు), దళితులు, ఆదివాసీలు ఆధునిక విద్యా సంస్థల్లో ప్రవేశం పొందలేరు. రిజర్వేషన్ ప్రయోజనాలు ఇకపై శూన్యమైపోతాయి. ఉత్పాదక వర్గాల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం విద్యా భారతిని చూపిస్తుంది. ఇది ఆరెస్సెస్ నిర్వహించే పాఠశాలల నెట్‌వర్క్. ఇలాంటి విద్యా నమూనా ద్వారా ఘనమైన ప్రాచీన నాగరికతను భారతీయులు అనుసరించాలని ఆరెస్సెస్, బీజేపీ కోరుకుంటున్నాయి. అదే సమయంలో ఆధునిక ఉత్పత్తి, ఆధునిక విజ్ఞానశాస్త్రం, వనరుల పంపిణీ, సమానత్వం వంటివాటిని భారతీయేతరమైనవిగా ఇవి చూస్తున్నాయి. వర్ణవ్యవస్థ కేంద్రకంగా ఉన్న మానవ సంబంధాలు, ఆశ్రమాల్లో నివసించడమే సమాజ ఆదర్శాలుగా మారిపోతాయి.

అదే సమయంలో విదేశీ, భారతీయ ప్రైవేట్ పాఠశాలలు, యూనివర్సిటీలు దేశంలోని కులీన వర్గాల, పాలక వర్గాల పిల్లలకు హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, యేల్ యూనివర్సిటీల సిలబస్‌తో ఇంగ్లిష్‌లో బోధనను అందిస్తాయి. దీనివల్ల వీరు పాశ్చాత్య దేశాలతో వాటికి వెలుపలి ప్రపంచంతో కూడా కనెక్ట్ అవుతారు. వీరే నిజమైన విశ్వగురువులుగా లేదా ప్రపంచ నేతలుగా మారతారు.

ఈ రకమైన విభజన వల్ల మన దేశంలోని సెక్యులర్, లిబరల్ ద్విజులు పెద్దగా కోల్పోయేది ఏమీ ఉండదు. తమ పిల్లలకు హిందీ మీడియం విద్యా భారతి సిలబస్‌ను నేర్పరని వీరందరికీ స్పష్టంగా తెలుసు. బోధనా పద్ధతులపై, బోధనా శాస్త్రంపై వీరి విమర్శ అటు భాష, ఇటు విషయంపై అస్పష్టతతోనే ఉంటుంది. కానీ వీరు సమానతా విద్య గురించి వల్లిస్తుంటారు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన విద్యావేత్తలు ఈ విద్యా నమూనాతో పోరాడరు. గతంలో పేలవమైన విద్యా విధానాలను రూపొందించింది వీరే మరి. దీనివల్లే శూద్రులు, ఓబీసీలు, దళితులు, ఆదివాసుల్లో ఇంగ్లిష్ విద్య పొందిన మేధావులు అతి కొద్ది సంఖ్యలో మాత్రమే ఉండిపోయారు. ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ మేధావుల విషయానికి వస్తే ఈ విధమైన విద్యాపరమైన విభజన వారికి పెద్ద సమస్య కాదు. ఎందుకంటే పలువురు ముస్లిం విద్యార్థులు మదరసాల్లో, క్రిస్టియన్ విద్యార్థులు మిషనరీ స్కూల్స్‌లో చదువుకుంటూ ఉంటారు. మదరసాలు, క్రిస్టియన్ స్కూళ్లు అంతరిస్తున్నాయనుకోండి! మరోవైపున విద్యావకాశాలకు దూరమైన శూద్రులు, ఓబీసీలు కూడా ఈ సమస్యను పెద్దగా పట్టించుకోవడం లేదు. హిందూ సామ్రాట్ గుర్తింపుతో మొట్టమొదటి బీసీ ప్రధానిగా చెప్పుకొంటున్న నరేంద్ర మోదీ తమను చారిత్రక బానిసత్వం నుంచి బయటపడేస్తారని వీరిలో చాలామంది భావిస్తున్నారు. భారతీయ ప్రాంతీయ పార్టీలు కూడా ప్రజారాసులకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఎందుకంటే అది వారి సొంత భాషా దురహంకారానికి వ్యతిరేకమవుతుంది. ఇక ఓబీసీ, దళిత సంస్థల విషయానికి వస్తే విద్యా నాణ్యత కంటే రిజర్వేషన్ లో తమ వాటా గురించే ఆందోళన చెందుతున్నాయి.

నిరంకుశమైన 2020 వ్యవసాయ సంస్కరణ చట్టాలను ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం ద్వారా వ్యవసాయ ప్రజా బాహుళ్యం చిన్న విజయం సాధించగలిగింది. కానీ ఆరెస్సెస్, బీజేపీ విద్యా కుట్రతో తమ పిల్లలు మరింత ప్రమాదంలో పడనున్నారని వీరు గుర్తించడం లేదు. ప్రజారాసుల పిల్లలను చేర్చుకుంటామని హామీ ఇవ్వకుండానే అనేక విదేశీ విశ్వవిద్యాలయాలు చాలావరకు ప్రజల భూములను కొనివేయబోతున్నాయి. రైతుల పిల్లల విద్యాపరమైన శక్తిసామర్థ్యాన్ని విచ్ఛిన్నపర్చడానికి పాలక వర్గాలు పథకం వేస్తున్నాయి. ఈ విధానాల ద్వారా వీరి భవిష్యత్తు అంధకారం కానుంది. ప్రభుత్వ రంగంలో మాత్రమే ఉంటున్న రిజర్వేషన్లు పొందుతున్నవారేమో ఒకసారి ప్రైవేటీకరణ పూర్తి శక్తితో ముందుకొచ్చాక న్యూనతతో బాధపడక తప్పదు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ప్రమాదకారి



అత్యంత ప్రమాదకరమైన నాయకుడు ఎవరంటే– తాను శక్తిమంతంగా ఉండటానికి సమాచారాన్ని దాచిపెట్టేవాడు.

– అంకుర్ వారికూ, కంటెంట్ క్రియేటర్

పింఛన్ భారం



పనిలో ఉన్న ప్రభుత్వోద్యోగుల కంటే ఇండియాలో పింఛన్‌దారులు ఎక్కువున్నారు. పింఛన్‌దారులు: సుమారు 77 లక్షలు. సర్వీసులో ఉన్నవారు: 50–60 లక్షలు.

– రవిసుతాంజనీ కుమార్, ఆంట్రప్రెన్యూర్

ఇండియాకే ప్రాధాన్యం



గతేడాది యూకే 28,36,490 వీసాలు ఇచ్చింది. అందులో 25 శాతం ఇండియాకు వచ్చాయి. ఏ దేశానికైనా ఇదే అత్యధికం. భారతీయులు 2021 కంటే 73 శాతం అధిక స్టూడెంట్ వీసాలు అందుకున్నారు, 130 శాతం అధిక వర్క్ వీసాలు అందుకున్నారు.

– అలెక్స్ ఎల్లిస్, ఇండియాలో బ్రిటిష్ హైకమిషనర్

పనిలో ఉంటారు



రోల్స్ రాయ్స్ కంపెనీకి చెందిన ఒక మార్కెటింగ్ హెడ్ ఏమన్నాడంటే– "మేము వాణిజ్య ప్రకటనలను రూపొందించము ; ఎందుకంటే మా లక్షిత ప్రేక్షకులు టీవీ చూస్తూ కూర్చోరు."

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఇదేనా వికాసం?



జమ్మూలోని ఎన్నో గ్రామాల్లో ఆరింటి తర్వాత దుకాణాలు మూసేస్తున్నారు. వేర్వేరు ఉగ్రదాడుల్లో తొమ్మిది మంది హత్యకు గురయ్యాక స్థానికులు భయంతో బతుకుతున్నారు. 'లోయ'కు వికాసం తెస్తామని ఓ వైపు బీజేపీ చెబుతోంది, కానీ 2014 నుంచీ జనాలు ఇదే భయంతో బతుకుతున్నారు.

– షమా మహమ్మద్, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

అన్యాయం జరగదు



జనగాంకు చెందిన యువ డాక్టర్ ప్రీతి మరణం చాలా దురదృష్టకరం. అది మనకు మేలుకొలుపు కావాలి. అభివృద్ధి చెందుతున్న సమాజానికీ, పరిణత సమాజానికీ మధ్య తేడా ఏమిటంటే– రెండోదానిలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది, బాధితులకు అన్యాయం జరగనివ్వదు. నిశ్చయంగా, అలాగే చేస్తుంది. ఆమె కుటుంబానికి సానుభూతి.

– స్మితా సభర్వాల్, తెలంగాణ ఉన్నతాధికారి

పెద్ద బరువు



మీరు పిల్లల్ని కనవద్దని ఎప్పుడైతే గట్టిగా అనుకుంటారో– అదింక మీ భుజాల మీద పెద్ద బరువును తొలగించుకున్నట్టు. భవిష్యత్ తరం కోసం భారీ మొత్తాన్ని కూడబెట్టాలన్నది ఊహించండి! పిల్లలే వద్దనుకుంటే ఈ ఒత్తిడి లేదు, మన వారసత్వం కొనసాగాలన్న పట్టింపు లేదు. అబ్బో... ఎంత రిలీఫో!

– శ్రుతి చతుర్వేది, ఆంట్రప్రెన్యూర్

ఇన్‌బాక్స్

అసలు కారకులు ఎవరు?

నల్లగొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న నవీన్‌ను అతి కిరాతకంగా అతని స్నేహితుడు హరిహర కృష్ణ హత్య చేయడం తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టించింది. ఇద్దరూ పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే. నవీన్, హరిహర కృష్ణ ఇద్దరూ ఇంటర్మీడియట్ చదివే నాటి నుండి స్నేహితులు. వారిద్దరూ ఒకే అమ్మాయిని ప్రేమించడం వల్ల జరిగిన గొడవ... హత్యకు దారి తీసిందనేది స్థూలంగా హత్యోదంతం సారాంశం. హత్య చేసింది హరిహరకృష్ణే అయినా... నిజానికి ఈ హత్యకు నేపథ్యాన్ని కలుగజేసింది ప్రభుత్వం, సమాజమే అని అర్థమవుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం, గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో న్యూ ఇయర్ లాంటి వేడుకలకు టార్గెట్లు పెట్టి ప్రభుత్వమే మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోంది. విద్యార్థులే లక్ష్యంగా విద్యాసంస్థల దగ్గర భారీగా చట్టవ్యతిరేకంగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్, మెడిసిన్ చదివే విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్స్ ముఠాలు అమ్మకాలు జరుపుతున్నాయి.

నవీన్, హరిహర కృష్ణ –ఇద్దరూ గంజాయి లాంటి మత్తుమందులకు అలవాటు పడ్డారనీ, మద్యం సేవిస్తారనీ తెలిసింది. హత్యాఘటన సమయంలో ఇద్దరూ మద్యం సేవించిన సంగతి తెలిసిందే. అలాగే వీరిపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడమూ కనిపిస్తోంది. అంటే ప్రభుత్వం, తల్లిదండ్రులూ; ఇంటర్నెట్ ప్రపంచం... లాంటి మరెన్నో కారణాలూ నవీన్ హత్యకు కారణాలుగా పేర్కొనవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం మాదక ద్రవ్యాల సరఫరాపై గట్టి నిఘాపెట్టి ఆపాలి. మద్యాన్ని ఆదాయ వనరుగా చూడటాన్ని తెలంగాణ ప్రభుత్వం మానుకోవాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ఒక కన్ను వేసి ఉంచాలి. ఇంటర్నెట్‌కు బానిసలు కాకుండా కాపాడుకోవాలి. వీటిలో ఏ ఒక్కటి జరక్కపోయినా మరింతమంది హంతక హరిహరకృష్ణలు పుట్టుకొస్తూనే ఉంటారు.

– పి. మహేష్, పీడీఎస్‌యూ తెలంగాణ అధ్యక్షులు

సమ్మిట్‌కు సరైన వేదిక విశాఖ

సందర్భం



యాతం వీరాస్వామి

'అందాల విశాఖ' వేదికగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్! ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో... ఆర్థిక రాజధాని విశాఖ వేదికగా అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు మార్చి 3, 4 తేదీల్లో జరుగబోతోంది. నేటికి పాతిక పైగా దేశాల నుంచీ, దేశంలోని వివిధ పరిశ్రమల నుంచీ దాదాపు 9 వేల మందికి పైగా ప్రతినిధుల హాజరు ఖరారైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలో... ఏపీ ప్రభుత్వం విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఎంపిక చేసిన కీలకమైన 13 రంగాలపై దృష్టి సారించింది.

విశాఖ నగరం ఏపీ (ఆర్థిక) రాజధానే కాదు, ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక నగరం కూడా. అందుకే ఇది భారతదేశంలో అత్యంత సంపన్న నగరాల్లో తొమ్మిదో నగరంగా భాసిల్లుతోంది. పారిశ్రామికంగానూ, మౌలిక సదుపాయాల అభివృద్ధిలోనూ, స్వచ్ఛతలోనూ, మానవ వనరుల కేంద్రంగానూ విశాఖ గణనీయమైన స్థానంలో ఉంది. దేశంలో అత్యంత పరిశుభ్రత కల్గిన నగరాల్లో మూడోది. భారత్ తూర్పు తీరంలో రోడ్డు, రైలు, జల, వాయు రవాణాతో కూడిన సంపూర్ణ నెట్ వర్క్ సౌకర్యం కల్గిన రెండవ పెద్ద పారిశ్రామిక నగరం విశాఖ. దేశంలోనే సహజ ఓడరేవు ఉన్న నగరం ఇది. ఓడలను నిర్మించే హిందుస్థాన్ షిప్‌యార్డ్ కూడా విశాఖ సిగలో ఓ మల్లెపూవే. 1971లో వేల ఎకరాల్లో నిర్మించిన విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలో ఏకైక తీర ఆధారిత స్టీల్ ప్లాంట్. తూర్పు తీరంలో పెట్రోలు, సహజ వాయువుతో అతి పెద్ద పెట్రో కేరిడార్ కల్గిన నగరం విశాఖ. అతి పెద్ద ఫిషింగ్ హార్బర్ కలిగిన విశాఖ మత్స్య వాణిజ్యంలో నంబర్ వన్. బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్ తయారీ కోసం వేల ఎకరాల విస్తీర్ణంలో 102 కంపెనీలతో విశాఖలో నిర్మించిన జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (రాంకీ ఫార్మా సిటీ ఇండియా లిమిటెడ్) ఔషధ పరిశ్రమలో ముందుకు దూసుకుపోతోంది. మనదేశ తూర్పు నౌకా దళం కేంద్రం ఇక్కడే ఏర్పాటైంది.

ఆసియాలో అతి పురాతన బౌద్ధ స్థావరాలలో కొన్ని ఇక్కడే ఉన్నాయి. విస్తారమైన ఖనిజ సంపద, పుష్కలమైన మానవ వనరులు, తరగని నీటి నిల్వలు, విద్యుత్ వంటి ఎన్నో అంశాలు విశాఖకు ఆభరణాలు. తూర్పు, ఆగ్నేయ దేశాలతో సముద్ర వాణిజ్యానికి విశాఖ ఎంతో అనుకూలం. ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిషా... విశాఖ పోర్టుకి సమీపంలో ఉండడంతో ఎంతో ఖనిజ సంపద కల్గిన ఆ రెంటికీ ఎగు మతి, దిగుమతులకు విశాఖ పోర్టే ద్వారం కావడం గమనార్హం.



జీ–20 సదస్సులో... పలు దేశాల నాయకులు, అధికారులను సమన్వయం చేసుకుని, సామర్థ్యాలను ఇచ్చిపుచ్చుకోవడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. విశాఖలో పూర్తి స్థాయిలో ఐటీ పరిశ్రమ ఏర్పాటు వల్ల తక్షణ ఉపాధి, అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. లక్షల్లో ఉద్యోగులు ఒకేచోట ఉంటే రియల్ ఎస్టేట్, హోటల్ పరిశ్రమ, రవాణా, సర్వీస్ సెక్టార్ వంటి రంగాల్లో వేగంగా వృద్ధి రేటు పెరుగుతుంది. విలువైన మానవ వనరులు, బలమైన మార్కెట్ కల్గిన విశాఖ డిజిటల్ పరిశ్రమలకు ఎంతో అనువైనది.


పర్యాటకం, సముద్ర వాణిజ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం లాభ దాయకం. సముద్రపు చేపల నుంచి నూనెను తీసే పరిశ్రమలకు ఇక్కడ అవకాశం ఉంది. పువ్వులు, పండ్లు, ఆయుర్వేద మొక్కల పెంపకానికి ఎంతో అనువైనదీ ప్రాంతం. దీంతో ఫార్మాతో పాటు ఆయుర్వేదం, కాస్మోటిక్స్ అండ్ పెర్ ఫ్యూమ్స్ పరిశ్రమలు కూడా ఇక్కడ బాగా అభి వృద్ధి చెందే అవకాశం ఉంది. గ్లోబల్ మార్కెట్‌లో మార్కెటింగ్ సర్వే చేయించి విశాఖ కేంద్రంగా ఉత్పత్తి అయ్యే ఉత్పత్తులకు ఎక్కడ లాభదాయక డిమాండ్ ఉందో నిర్ణయించి అక్కడి అవకాశాలను కొల్లగొట్టాలి. ఆ విధంగా ఇండియా గ్లోబల్ లీడర్‌గా ఎదగటంలో విశాఖ పాత్రను సుస్థిరం చేయాలి.

వ్యాసకర్త రచయిత, విశ్లేషకులు
మొబైల్: 95816 76918

రాజధర్మం

కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. వీరస్వర్గం పొందిన వీరులకు యథోచితంగా శ్రాద్ధ కర్మలు జరిపించాడు ధర్మరాజు. తిరిగి కోటకి వెళ్లిన ధర్మరాజులో వైరాగ్యం ప్రవేశించింది. తన తమ్ములను పిలిచి 'ప్రియమైన వారినెందరినో చంపగా వచ్చిన రాజ్యం నాకు అక్కరలేదు, మీరే పరిపాలించుకోండి, నేను అడవులకు వెళ్లి మునులతో కలసి జీవిస్తాను' అని అన్నాడు. ఆ నిర్ణయాన్ని విరమించుకోమని శ్రీకృష్ణాది ముఖ్యులు, పాండవ సోదరులు విన్నవించారు. ఆ సమయంలో ధర్మరాజు నుద్దేశించి ద్రౌపది పలికిన మాటలకు చక్కని ప్రాముఖ్యమివ్వవచ్చు.

''అరణ్య వాసం, అజ్ఞాత వాసం చేసే రోజుల్లో మీ తమ్ముళ్లను ఓదారుస్తూ 'దుర్యోధనుడిని చంపి భోగాలను అనుభవిస్తూ, వినోద విహారాలు చేద్దామని' ఊరడించిన విషయం గుర్తు లేదా? అనుకున్నట్టే శత్రువు మరణించాక వచ్చిన రాజ్యాన్ని త్యాగం చేసి, అడవులకు పోతాననడం సబబుగా ఉందా? లోకాన్ని రక్షించమనీ, దిక్పాలకుల అంశతో ప్రజల్ని పాలించమనీ రాజుని సృష్టించాడు బ్రహ్మ. అలాంటి రాజయిన మీరు ధైర్య స్థైర్యాలను పోగొట్టుకుని పిరికివాడిలా మాట్లాడడం ధర్మమా?



విషం పెట్టడం, ఇల్లు తగలబెట్టడం, రాజకీయ రహస్యాలను బయట పెట్టడం, ఇతరుల సంపదలు దొంగిలించడం చేసినవారిని వధించినప్పుడే రాజు పుణ్యాత్ముడవుతాడు. రాజ దండన పేదలకు, సజ్జనులకు, వేదాలకు, దేవతలకు కూడా రక్షగా ఉండాలి. పాపాత్ములను శిక్షించడం రాజధర్మం అవుతుంది కానీ ముక్కు మూసుకుని జపం చేసుకోవడం రాజధర్మం కాదు.

కౌరవులంతా తమ పాపాలు పండి నశించారే కానీ వారి చావుకు మీరు కారకులు కారు. కాబట్టి రాజ్యలక్ష్మిని చేజిక్కించుకుని చక్కని పరిపాలన ప్రజలకు అందించండి'' అని పలికింది.

ద్రౌపది మాటలు విజ్ఞతతో కూడి, వివేకం రేకెత్తించి ధర్మరాజు నిర్ణయాన్ని మార్చుకునేలా చేశాయి. స్త్రీ తలచుకుంటే ప్రళయాన్ని సృష్టించగలదనీ, భర్తకు ఉపదేశం చేసి దారి మార్చుకునేలా చేయగలదనీ ఆనాడే నిరూపించింది ద్రౌపది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

బందరు పోర్టుకు పర్యావరణ అనుమతులు

• ఎంపీ బాలశౌరి



చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి అవసరమైన పర్యావరణ అనుమతులను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ మంగళవారం మంజూరు చేసిందని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు ద్వారా గ్రీన్ ఫీల్డ్ నాన్ మేజర్ పోర్టు నిర్మాణం జరుగుతుందని, ఇందుకు అనుమతులు రావటం ఎంతో సంతోషంగా ఉందని బాలశౌరి పేర్కొన్నారు. మచిలీపట్నం ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన పోర్టు నిర్మాణ పనులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఏటా 35 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో హ్యాండిలింగ్ కోసం ఫేజ్-1లో నాలుగు బెర్త్‌లు, ఫేజ్-2లో 80.97 కార్గో హ్యాండ్లింగ్ కోసం మరో 12 బెర్త్‌లు చొప్పున మొత్తం 16 బెర్త్‌ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి అనుమతులు మంజూరు చేశారని పేర్కొన్నారు. పోర్టు నిర్మాణంతో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఓడ రేవుకు అనుబంధంగా ఎన్నో పరిశ్రమలు ఇక్కడ స్థాపించే అవకాశం ఉంటుందని తెలిపారు.

దుర్గమ్మ సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



ఆశీర్వచన మండపంలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.మానవేంద్రనాథ్ రాయ్ మంగళవారం దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనాన్ని, అర్చకులు అమ్మవారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

సీఆర్‌డీఏ అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

• పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్



మాట్లాడుతున్న మంత్రి సురేష్

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్‌డీఏ పరిధిలో చేపట్టిన అన్ని పనులు వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఆర్‌డీఏ పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. కొన్ని పనులకు కోర్టు కేసులు, ఇతర అవాంతరాలను అధిగమించి పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కరకట్ట పనులు, సీడ్ యాక్సిస్ రోడ్డు పనులు ఏకకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కోర్టు హాల్ అదనపు గదుల నిర్మాణాలపైనా మంత్రి ఆరా తీశారు. గదుల నిర్మాణం దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నాయని, రెండో దశలో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.4.65 కోట్లు మంజూరైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. టిడ్కో గృహాల నిర్మాణంలో సీఆర్‌డీఏ పరిధిలోని 8 ప్రాంతాల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను త్వరగా అందుబాటులోకి తేవాలని మంత్రి ఆదేశించారు. సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు అందజేసే పింఛన్లు, శానిటేషన్, హ్యాపీ నెస్ట్, సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయ భవన నిర్మాణం, ఎంబజీ లేఅవుట్లపై మంత్రి సురేష్ అధికారులతో సమీక్షించారు. సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, అడిషనల్ కమిషనర్లు సింహాచలం, అలీంబాషా, సీఈలు పళ్లంరాజు, ప్రసాద్, జీడీ శర్మ, చిరంజీవి పాల్గొన్నారు.

ఏప్రిల్ 11న శ్రీశైలంలో కుంభోత్సవం

శ్రీశైలం టెంపుల్: చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం, శుక్రవారం ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీశైల భ్రమరాంబదేవికి కుంభోత్సవం నిర్వహించడం సంప్రదాయం. ఈ ఏడాది ఏప్రిల్ 11న భ్రమరాంబదేవి అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి సాత్విక బలి సమర్పించేందుకు కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు మొదలైనవి సమర్పిస్తారు. అలాగే కుంభోత్సవం రోజున స్త్రీవేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతి సమర్పించడం ప్రధానఘట్టం. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళ, శుక్రవారాలలో అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమతో పూజలు చేశారు.

విద్యా హక్కుపైనా వికృత రాతలు

నాడు చంద్రబాబు అమలుచేయకున్నా ఒక్క ప్రశ్న వేయని ఈనాడు

• నేడు పేద పిల్లలకు మేలు జరిగేలా అమలుచేస్తున్నా ప్రభుత్వంపై దుష్ప్రచారం
• గతంలో ఎక్కడాలేని అమ్మఒడి కింద రూ.15 వేలు ఇస్తుంటే దానిపైనా విమర్శలు
• తల్లిదండ్రులపై భారం పడుతోందంటూ 'పచ్చ'పత్రిక విష ప్రచారం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లటమే పనిగా పెట్టుకున్న 'ఈనాడు' విద్యా హక్కు చట్టం అమలుపైనా, అమ్మఒడి పథకంపైనా తన వక్రబుద్ధిని చాటుకుంది. విద్యా హక్కు చట్టం గురించి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు కనీసం పట్టించుకోకపోయినా ఈనాడు ఒక్క వార్తా రాయలేదు. పేద పిల్లలకు మేలు జరిగే ఈ చట్టాన్ని ఎందుకు అమలుచేయడం లేదని ఒక్కసారి కూడా ప్రశ్నించలేదు. కానీ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ చట్టాన్ని అమలుచేయిస్తూ పేదపిల్లలకు ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్లలోనూ చదువుకునే అవకాశం కల్పిస్తుంటే 'ఈనాడు'కు నచ్చడంలేదు. అందులో భాగంగానే విద్యా హక్కు చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓను తప్పుపడుతూ ఈనాడు సోమవారం నాటి దినపత్రికలో అసత్యపు వార్తను అచ్చేసింది. వాస్తవాలను మసిపూసి మారేడు కాయ చేస్తూ అసత్యాలతో ఆరోపణలు చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన 'ఫ్యాక్ట్‌చెక్'లో ఈనాడు బండారం, వార్తలోని డొల్లతనం బట్టబయలయ్యాయి. అంశాల వారీగా ఈనాడు చేసిన ఆరోపణల్లోని అవాస్తవాలను వెల్లడిస్తూ వాటిని ఖండించింది. అవి..

ఆరోపణ-1: విద్యా సంస్థల ఫీజులను ప్రభుత్వం చెల్లించాలి. ఇతర రాష్ట్రాల్లో విద్యా హక్కు చట్టం ఇలాగే అమలు చేస్తున్నారు.

వాస్తవం: 2019-2020 విద్యా సంవత్సరం నుండి అమ్మఒడి పథకం కింద తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.15,000లను 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థుల విద్యా ఖర్చుల కోసం (స్కూల్ ఫీజులతో కలిపి) జమచేస్తోంది. నిజానికి.. గతంలో ఈ పథకం లేదు. ఇలాంటి పథకం ఈ రాష్ట్రంలో కానీ, దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనూ లేదు. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యా ఖర్చుల నిమిత్తం నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలోకి ఈ అమ్మఒడి నిధులు జమచేస్తోంది. 2019-20లో 42,33,098 మంది తల్లులకు రూ.6,349.60 కోట్లు, 2020-21లో 44,48,865 మంది తల్లులకు రూ.6,673.40 కోట్లు, 2021-22లో 42,62,419 మంది తల్లులకు రూ.6,393.60 కోట్లు జమచేసి విద్యా ఖర్చుల నిమిత్తం చెల్లించింది.

2వ ఆరోపణ: అమ్మఒడితో సంబంధం లేకుండా ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని భావించి గత ఏడాది విద్యాహక్కు చట్టం కింద ప్రవేశాలు పొందారు..

వాస్తవం: ఈనాడు ఆరోపణ అవాస్తవం. గత సంవత్సరం విద్యాహక్కు చట్టం కింద ప్రవేశాల అమలులో ప్రభుత్వం ఎక్కడా అమ్మఒడితో సంబంధం లేకుండా ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని ప్రకటన చేయలేదు. ఆ విధంగా తల్లిదండ్రులకు ప్రభుత్వం ఏ సందర్భంలోనూ ఆ విధంగా హామీ ఇవ్వలేదు.

3వ ఆరోపణ: తాజా ఉత్తర్వులతో తల్లిదండ్రులపై భారం పడింది.

వాస్తవం: ఈనాడులోని ఈ ఆరోపణ పూర్తిగా అవాస్తవం. 2019-2020 విద్యా సంవత్సరం నుండి మాత్రమే అమ్మఒడి పథకం కింద తల్లుల బ్యాంకు ఖాతాలోకి నేరుగా ప్రభుత్వం రూ.15,000లు జమచేస్తోంది. అంతకుపూర్వం ఇలాంటి పథకం ఈ రాష్ట్రంలో కానీ దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోను లేదు. విద్యా హక్కు చట్టం ప్రకారం నిర్ధారించబడిన ఫీజు అమ్మఒడి నుండి చెల్లించిన పిదప ఇంకా విద్యా ఖర్చుల నిమిత్తం కొంత భాగం తల్లిదండ్రులకు మిగులుతుంది. గతంలో ప్రైవేట్ పాఠశాల్లో ఫీజులపై నియంత్రణలేదు. విద్యా హక్కు చట్టం అమలుచేయలేదు. ఇది తల్లిదండ్రులకు భారం కాదు.. అని ఫ్యాక్ట్‌చెక్‌లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది.

విద్యార్థిని హత్య కేసులో 143 రోజుల్లోనే తీర్పు

• ప్రేమోన్మాదికి జీవిత ఖైదు
• గతేడాది అక్టోబర్ 8న తూర్పు గోదావరి జిల్లాలో ఘటన
• డిగ్రీ విద్యార్థిని దేవికను పాశవికంగా హత్య చేసిన ప్రేమోన్మాది
• చలించిపోయిన సీఎం వైఎస్ జగన్
• మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా
• త్వరితగతిన విచారణ జరపాలని పోలీసులకు ఆదేశం
• 7 రోజుల్లోనే చార్జిషీట్.. త్వరితగతిన విచారణ
• స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ

కాకినాడ లీగల్: ఓ విద్యార్థినిని పాశవికంగా హత్య చేసిన కేసులో ప్రేమోన్మాదికి కేవలం 143 రోజుల్లోనే శిక్ష పడింది. నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.కమలాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. రాష్ట్రంలో కేసులు త్వరితగతిన విచారణ జరిగి, నిందితులకు శిక్ష పడాలని, బాధితులకు సత్వర న్యాయం జరగాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన కన్విక్షన్ బేస్డ్ ట్రయల్ కేసుల మానిటరింగ్ వ్యవస్థ ఇందుకు దోహదం చేసింది. గత ఏడాది జరిగిన హత్య కేసు విచారణ వేగంగా జరిగి, నిందితుడికి కఠిన శిక్ష పడింది.

తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బాలవరానికి చెందిన గుబ్బల వెంకట సూర్యనారాయణ కూరాడలో మేనమామ ఇంట్లో ఉండేవాడు. అదే గ్రామంలో కె.దేవిక తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ కాకినాడ పీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుకునేది. దేవికను ప్రేమించానంటూ సూర్యనారాయణ వెంటపడేవాడు. సుమారు ఏడాది పాటు వెంట పడి వేధించాడు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేవాడు. ఇతని వేధింపులు భరించలేక దేవిక విషయాన్ని బంధువులకు చెప్పింది. పెద్దలు యువకుడ్ని మందలించి పంపించేశారు. అయినా అతడు తన చేష్టలు ఆపలేదు. గతేడాది అక్టోబర్ 8న కాండ్రేగుల - కూరాడ మధ్య కాపు కాశాడు. యాక్టివా మోపెడ్‌పై వస్తున్న దేవికను ఆపి నడిరోడ్డుపై కత్తితో 18 సార్లు కిరాతకంగా పొడిచాడు. ఆమె అక్కడికక్కడే చనిపోయింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగింది. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసు త్వరితగతిన కేసు దర్యాప్తు చేశారు. సాక్ష్యాధారాలు సేకరించి 7 రోజులలోనే కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణ త్వరితగతిన జరిగింది. నేరం రుజువు కావడంతో సూర్యనారాయణకు జీవిత ఖైదు విధిస్తూ జడ్జి పి.కమలాదేవి తీర్పు చెప్పారు.

కన్విక్షన్ బేస్డ్ ట్రయల్ కేసుల మానిటరింగ్ వ్యవస్థతో సత్ఫలితాలు

విద్యార్థిని పాశవిక హత్య ఘటనపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. వెంటనే మృతురాలి కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. త్వరితగతిన విచారణ జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు నిరంతరం దర్యాప్తును పర్యవేక్షించారు. ఇందుకు కన్విక్షన్ బేస్డ్ ట్రయల్ కేసుల మానిటరింగ్ వ్యవస్థ చక్కగా పనిచేసింది. కేసు నమోదు చేసిన 143 రోజుల్లో విచారణ చేసి నిందితుడికి శిక్ష పడేలా చేశారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఈ తీర్పు చెంపపెట్టు అవుతుందని పోలీసు అధికారులు వ్యాఖ్యానించారు. కేసు విచారణ విషయంలో ప్రభుత్వం బాగా స్పందించిందని, నిందితుడికి కఠిన శిక్ష పడిందని మృతురాలి తల్లి నాగమణి అన్నారు.

కమిషనర్ తుది ఉత్తర్వులకు లోబడే నిర్మాణాలు

హయగ్రీవ ఫారమ్స్ అండ్ డెవలపర్స్‌కు హైకోర్టు స్పష్టీకరణ

• జీవీఎంసీ నోటీసుల అమలు నిలిపివేత
• కమిషనర్ నోటీసులకు హయగ్రీవ వివరణ ఇవ్వాలని ఆదేశం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం యండాడ గ్రామ పరిధిలో హయగ్రీవ ఫారమ్స్ అండ్ డెవలపర్స్ చేపట్టిన నిర్మాణాలన్నీ గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కమిషనర్ ఇచ్చే తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి పర్యవసానాలన్నింటినీ కూడా కంపెనీనే ఎదుర్కోవాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. ఇదే సమయంలో హయగ్రీవ చేపట్టిన నిర్మాణాలను నిలిపేయాలంటూ జీవీఎంసీ కమిషనర్ జారీ చేసిన నోటీసు అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. ఈ నోటీసుకు రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని హయగ్రీవ సంస్థను ఆదేశించింది. హయగ్రీవ సంస్థ వివరణ అందిన తర్వాత, దానిని పరిగణనలోకి తీసుకుని మూడు వారాల్లో తుది ఉత్తర్వులు జారీ చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

యండాడ గ్రామం పరిధిలో 12.51 ఎకరాల్లో హయగ్రీవ సంస్థ చేపట్టిన నిర్మాణాల విషయంలో కొన్ని లోపాలను ఎత్తి చూపుతూ పనులను నిలిపేయాలని జీవీఎంసీ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) సమర్పించలేదని, మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రోడ్‌ను చూపాలంటూ కమిషనర్ ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ హయగ్రీవ సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ రాయ్ విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.., ఎన్‌వోసీ సమర్పించకపోవడం భవన నిర్మాణ అనుమతులను ఉల్లంఘించినట్లు కాదని స్పష్టంచేశారు. అందువల్ల జీవీఎంసీ నోటీసు అమలును నిలిపేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

ప్రజలు మెచ్చేలా జగన్ సంక్షేమ పాలన

• ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
• సారా కాంట్రాక్టర్లకు టీటీడీ పదవులు ఇచ్చింది చంద్రబాబు కాదా?



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలు మెచ్చేలా రామరాజ్యం మాదిరి సంక్షేమ పాలన కొనసాగుతుందని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ అన్నారు. అదే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎలాంటి కరువు పరిస్థితులు ఉండేవో ప్రజలందరికీ తెలుసునన్నారు. మంగళవారం దేవదాయ శాఖ కార్యక్రమాలపై ఆ శాఖ అధికారులతో సమీక్ష అనంతరం రాష్ట్ర సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. పేద ప్రజలకు మంచి చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పం గొప్పదని, అందుకే భగవంతుడు ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఆలయం లేని ఊరు ఉండకూడదని సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా మూడు వేల కొత్త ఆలయాలు నిర్మాణం చేపడుతుండగా.. కామన్‌గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కార్యక్రమాల ద్వారా మరో రూ. 270 కోట్లతో వివిధ జిల్లాల్లో పురాతన ఆలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాల నిర్మాణం కొనసాగుతుందని చెప్పారు. వీటికి తోడు తగినంత ఆదాయం లేక రోజూ నిత్య పూజలు జరగని ఆలయాలకు డీడీఎన్ఎస్ పథకం ద్వారా ఆర్థిక తోడ్పాటు అందజేస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక కొత్తగా రూ. 3,500 ఆదాయం లేని ఆలయాలకు కొత్తగా ధూప దీప నైవేద్య పథకంలో ఆర్థిక తోడ్పాటు అందజేసేందుకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. దేవుడి భూములను ఆక్రమించుకున్న వారి ఆట కట్టించేందుకు దేవదాయ శాఖ చట్టానికి కొత్తగా సవరణలు తీసుకొచ్చినట్లు వివరించారు. శ్రీశైలం ఆలయం వద్ద కొత్తగా అన్నదానం సత్రాల ఏర్పాటుకు 18 దరఖాస్తులు వచ్చాయని, వాటికి భూ కేటాయింపుల ద్వారా శ్రీశైల మల్లిఖార్జునస్వామి వారికి కూడా ఆదాయం దక్కేలా విధివిధానాలు తీసుకురానున్నట్లు వివరించారు.

సారా కాంట్రాక్టర్లకు టీటీడీ పదవులు కట్టబెట్టింది చంద్రబాబేగా..

టీటీడీ పదవులను జగన్ అమ్మేసుకున్నారంటూ చంద్రబాబు కొడుకు పిచ్చోడు తన పాదయాత్రలో మాట్లాడుతున్నాడని.. వాళ్ల నాన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సారా కాంట్రాక్టర్లకు, కుల సంఘాల నేతలకు, పెద్ద పైకం ఎవరు ఇస్తే వాళ్లకు ఆ పదవులు కట్టబెట్టారని ఉప ముఖ్యమంత్రి దుయ్యబట్టారు. చంద్రబాబు కోసం 50 ఏళ్ల పాటు కష్టపడి ఎదిగిన ఓ పత్రిక ప్రభుత్వంపై తప్పుడు కథనాలు రాసేందుకు పూనుకుందన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఇప్పుడు ఏ సామాజికవర్గం వ్యక్తి ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నారన్నది చూడడం లేదని.. వాళ్లకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డి వల్ల తమకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని నమ్ముతున్నారని చెప్పారు.

ఓటీపీ.. డబ్బంతా లూటీ



రూటు మార్చిన సైబర్ కేటుగాళ్లు

• ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇవ్వకుండానే.. పార్సిల్ వచ్చిందంటూ బురిడీ
• ఆర్డర్ క్యాన్సిలేషన్ కోసమని ఓటీపీ అడిగి మస్కా

ఇంట్లో మీరేదో పనిలో ఉంటారు. డెలివరీ బోయ్ వచ్చి.. మీకేదో ఆర్డర్ వచ్చిందంటాడు. మీరేమీ ఆర్డర్ ఇవ్వలేదని సమాధానం చెబుతారు. 'లేదు.. లేదు మీ అడ్రస్‌తోనే బుక్ అయిందని' ఆ మోసగాడు నమ్మబలుకుతాడు. ఒకవేళ బుక్ చేయకుంటే.. ఆర్డర్ క్యాన్సిల్ చేసుకోవడానికి మీ ఫోన్ నంబర్‌కు ఓటీపీ వచ్చింది చెప్పండి చాలు అంటాడు. వారిని నమ్మి మీరు ఓటీపీ చెప్పారో ఇక అంతేసంగతులు. మీ బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తం కొల్లగొట్టేస్తారు.

సాక్షి, అమరావతి: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త అవతారం ఎత్తుతున్నారు. జనంలో అవగాహన పెరిగిన అంశాలను కాకుండా కొత్త దారులు వెతుక్కుంటున్నారు. ఇప్పటివరకు ఓఎల్ఎక్స్‌లో వస్తువుల అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన మోసాలు ఉంటుండగా.. తాజాగా మీషో, క్వికర్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో వస్త్రాలు, ఇతర గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల డెలివరీ పేరిట మోసాలకు తెరతీస్తున్నారు. ఇటీవల ఈ తరహా మోసాలు పెరిగాయని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు.

సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు :

ఏపీ సైబర్ మిత్ర : **91212 11100** (వాట్సాప్ నంబర్)

టోల్ ఫ్రీ నంబర్లు: **100, 112**

జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ నంబర్: **1930**

అప్రమత్తతే రక్షా కవచం

మనం ఆర్డర్ ఇవ్వకుండానే వస్తువులు రావని గుర్తుంచుకోవాలి. మనం ఇవ్వని ఆర్డర్‌ను మనం క్యాన్సిల్ చేయాల్సిన పనిలేదు. ఆర్డర్ క్యాన్సిలేషన్ పేరిట ఎవరైనా ఓటీపీ అడిగితే చెప్పవద్దు. అది సైబర్ మోసం అని గుర్తించాలి. ఒకటికి రెండుసార్లు సరిచూసుకోకుండా నగదు చెల్లింపులు చేయకండి. మనం ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చేముందు ఆ కంపెనీ ప్రొఫైల్, రేటింగ్ తప్పక గమనించాలి. సైబర్ మోసం జరుగుతున్నట్టు అనుమానం ఉంటే వెంటనే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

ఓటీపీ చెప్పొద్దు.. ఇతర వివరాలూ ఇవ్వొద్దు

స్మార్ట్ ఫోన్లు వచ్చిన తరువాత సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థల ప్రతినిధులు, మరెవరైనా ఫోన్ చేసి అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పకూడదు. ఆధార్ నంబర్ లేదా ఇతర వివరాలు కూడా చెప్పొద్దు. ఎవరైనా సైబర్ మోసానికి గురయ్యామని భావిస్తే వెంటనే ఏపీ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– అమిత్ బర్దర్, ఎస్పీ (సైబర్ క్రైమ్)

'బాలిస్టిక్ క్షిపణుల టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి'



యోగేష్ కె.వర్మను సత్కరిస్తున్న డాక్టర్ సుమన్ తదితరులు

తాడేపల్లి రూరల్: బాలిస్టిక్ క్షిపణుల టెక్నాలజీపై ఈసీఈ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీవో సీనియర్ సైంటిస్ట్ యోగేష్ కే వర్మ అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కేఎల్ వర్సిటీలో నిర్వహించిన జ్యోత్రియా వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేఎల్‌యూలో విద్యార్థులకు అధునాతన ల్యాబొరేటరీలు, అంకితభావం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిస్సైల్ తయారు చేయడానికి కేవలం మెకానికల్ ఎలక్ట్రికల్ విభాగాలే కాకుండా రాడార్ వ్యవస్థను మెరుగుపరచడానికి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ చాలా అవసరమన్నారు. మిస్సైళ్ల టెక్నాలజీపైన పట్టు సాధించాలని ఈసీఈ విద్యార్థులకు సూచించారు. యోగేష్ కె వర్మను వర్సిటీ అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొఫెసర్ వీసీ డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఈసీఈ డైరెక్టర్, పరిశోధక, ప్లేస్‌మెంట్స్ అధిపతి డాక్టర్ కె.శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ డ్యూటీ మీట్ విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

సాక్షి, అమరావతి: అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో తృతీయ స్థానం సాధించిన రాష్ట్ర పోలీస్ అధికారులకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం నగదు ప్రోత్సాహకాలు ప్రదానం చేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు నిర్వహించిన ఈ పోలీస్ డ్యూటీ మీట్‌లో రాష్ట్ర పోలీస్ అధికారులు రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఓ కాంస్య పతకంతో మొత్తం ఆరు పతకాలు గెలుచుకుని మూడో స్థానంలో నిలిచారు. పోలీస్ శాఖ నుంచి స్వర్ణ పతక విజేతలకు రూ.3లక్షలు, రజత పతక విజేతలకు రూ.2 లక్షలు, కాంస్య పతక విజేతకు రూ.లక్ష చొప్పున నగదు బహుమతులు అందుకున్నారు. కాగా, డీజీపీ స్వర్ణ పతక విజేతలకు రూ.10 వేలు, రజత పతక విజేతలకు రూ.8 వేలు, కాంస్య పతక విజేతకు రూ.5 వేలు చొప్పున నగదు అందించి ప్రోత్సహించారు.

సిద్ధార్థ వైద్య కళాశాల ఇఎన్‌టీ విభాగానికి ఐదు పీజీ సీట్లు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ఇఎన్‌టీ విభాగానికి ఐదు పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) సీట్లు మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన సీట్లకు 2023-24 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు జరపనున్నారు. కాగా సిద్ధార్థ వైద్య కళాశాలలో పలు విభాగాల్లో పీజీ సీట్లకు ప్రాథమికంగా అనుమతి ఇస్తూ రెండు నెలల కిందట ఆదేశాలు వచ్చాయి. అయితే ఆయా విభాగాల్లో పీజీ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై 20 రోజుల కిందట నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యులు తనిఖీ చేశారు. ఇఎన్‌టీ విభాగంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఉండటంతో ఐదు పీజీ సీట్లకు అనుమతి లభించింది. ఈ విభాగంలో ప్రతి రోజూ 200 నుంచి 250 మంది వరకు అవుట్ పేషెంట్లకు పరీక్షలు నిర్వహిస్తారు. వారంలో 40 నుంచి 50 వరకు శస్త్ర చికిత్సలు చేస్తుంటారు. ఇక్కడ ఇఎన్‌టీ విభాగం దశాబ్దాలుగా ఉన్నప్పటికీ సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇప్పటివరకు పీజీ సీట్లు రాలేదు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించి, అత్యాధునిక పరికరాలను సైతం సమకూర్చడంతో నేషనల్ మెడికల్ కమిషన్ సీట్లు మంజూరు చేసింది. తమ విభాగానికి పీజీ సీట్లు వచ్చేందుకు కృషి చేసిన వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి సౌభాగ్యలక్ష్మిలకు ఇఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ రవి, ఇతర వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భారతీయ రైల్వేలు
రైల్వే విద్యుదీకరణ
www.ireps.gov.in
టెండరు నోటీసు నం. RESC-SNT-265TWS-06-22-23 తేదీ: 27-02-2323
దిగువ తెలిపిన పనుల కోసం చీఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, రైల్వే విద్యుదీకరణ, సికింద్రాబాద్ వారిచే విడి విడిగా ఇ-టెండర్లు (ఆన్‌లైన్) కోరబడుచున్నవి. అవి 27-03-2023న 15.00 గంటల వరకు స్వీకరించబడతాయి మరియు అదేరోజున 15.30 గం॥కు డిప్యూటీ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ కార్యాలయం, రైల్వే విద్యుదీకరణ, సికింద్రాబాద్ వద్ద తెరువబడును.
క్ర.సం. 1. TNo. RESC-SNT-265-TWS-06-22-23 తేది: 27-02-2023 పనివివరణ: 25KVAC RE కి తగినట్లుగా ద.మ. రైల్వేలోని లింగంపేట్ జగిత్యాల (LPJL) -నిజామాబాద్ (NZB) సెక్షన్‌లోని స్టేషన్ మెట్‌పల్లి (MTPI) వద్ద PI మోడిఫికేషన్ ద్వారా టవర్ వ్యాగన్ సైడింగ్స్ ఏర్పాటుకు సంబంధించి అండర్‌గ్రౌండ్ సిగ్నలింగ్ కేబుల్స్/పవర్ కేబుల్ ట్రెంచింగ్ & వేయుట ఫౌండేషన్స్ క్యాస్టింగ్, కొన్ని ఎక్విప్‌మెంట్స్, మెటీరియల్స్ సరఫరా చేయుట అపారటస్ కేసెస్ స్థాపన మరియు ఎక్విప్‌మెంట్ అమర్చుట, వైరింగ్, టెస్టింగ్ మరియు పనిచేయించుట మరియు టెలికమ్యూనికేషన్ సిస్టమ్స్ ఏర్పాటుచేయుట పని సుమారు విలువ: రూ. 51.43 లక్షలు, బయానా: రూ. 1,02,900/- టెండరు ఫారం ధర: లేదు పూర్తిచేయవలసిన కాలం: ఎనిమిది నెలలు.
1. ఇ-టెండరు (ఆన్‌లైన్) ద్వారా టెండరు ముగింపు: 27-03-2023న 15.00 గం॥
2. ఇ-టెండరు (ఆన్‌లైన్) ద్వారా టెండరు తెరచుట: 27-03-2023న 15.30గం॥
తదుపరి టెండరు నిబంధనలు / వివరాలు (టెండరు డాక్యుమెంట్లలో లభించును) కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి మా వెబ్‌సైట్ www.ireps.gov.in
PP టెండరు డాక్యుమెంట్లకు ఏవేని మోడిఫికేషన్స్ / సవరణ / అనుబంధం అవసరమైతే, పైన తెలిపిన వెబ్‌సైట్‌లో టెండరు తెరుచుటకు కనీసం పదిరోజుల ముందు పోస్ట్ చేయబడును మరియు వెబ్‌సైట్‌లో చూడవచ్చును.
చీఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, రైల్వే విద్యుదీకరణ, సికింద్రాబాద్
A0303
తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
E NIT No.33/MDR/ENC(MDR)/2023 (2nd call) తేది: 24-02-2023
పశ్చిమగోదావరి జిల్లాలో ప్లాన్ క్రింద రూ.31.08 కోట్ల మొత్తానికి 5 నంబర్ల పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు 06-03-2023న మ.3.00 గం. నుండి ఇ-మార్కెట్ ప్లేస్ అంటే www.apeprocurement.gov.in నుండి టెండరు షెడ్యూళ్ళను డౌన్‌లోడ్ చేసుకొని తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 20-03-2023న మ.3.30 గం. వరకు.
సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్ (R&B), మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్
DIPR RO No.7988/CL/Advt/1/1/2021-22, Dt 28.02.2023

GOVERNMENT OF ANDHRA PRADESH
GVWV & VSWS DEPARTMENT
RFP.NoGWS02-OPOM/275/2023, Dated:28-02-2023
RFPs are floated inviting bids from the interested bidders for printing & supply of Acknowledgements to the Village and Ward Secretariats to 26 Districts. For details pl. visit https//:tender.apeprocurement.gov.in & https://gramawardsachivalayam.ap.gov.in from 3.30 PM onwards on 01-03-2023.
Sd/- DIRECTOR, GSWSD

ANDHRA PRADESH SOLAR POWER CORPORATION PVT LTD
(A Joint venture company of Government of A.P and Government of India)
e - Procurement Tender Notice
APSPCL invites tender for the works of "APSPCL – LAD – Kadapa Ultra Mega Solar Park (1000 MW) – Restoration of Gundala Kona vanka Check Dam near Dhodium Village in Mylavaram Mandal, YSR Kadapa District., A.P." Approximate Value of Work Rs. 63.02 Lakh. Schedule Available Date & Time: 28.02.2023 from 05.00 P.M. For details visit: www.apspcl.ap.gov.in (or) www.apeprocurement.gov.in

శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానము,
పెదకాకాని గ్రామము & మండలం, గుంటూరు జిల్లా, సెల్ నెం. 9908771463
ఆర్.సి.నెం.బి1/3/2022-23 తేది. 27-2-2023.
ఇ-ప్రొక్యూర్‌మెంటు మరియు సీల్డు టెండర్ / బహిరంగవేలం ప్రకటన
పై దేవస్థానమునకు ది.01.04.2023 నుండి ది.31.03.2024 వరకు గల ఒక సంవత్సర కాలమునకు ... హక్కులకు ఇ-ప్రొక్యూర్‌మెంటు మరియు సీల్డు టెండరు కమ్ బహిరంగ వేలము ... ది.10.03.2023 శుక్రవారమున దేవస్థాన ప్రాంగణమునందు ఉ.గం॥ 11.00 లకు నిర్వహించబడును. ది.01.03.2023 ఉ.గం॥ 10.00ల నుండి https://tender.apeprocurement.gov.in నందు టెండర్ షెడ్యూల్స్ అందుబాటులో ఉండును. ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయము నందు సంప్రదించకోరుచున్నాము. ... పాల్గొనవలెను.
సం/ యస్.శ్రీనివాసరెడ్డి, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి.

క్లుప్తంగా...

బైడెన్ మళ్లీ పోటీ చేస్తారు: జిల్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి ఆ పదవికి పోటీపడనున్నారు. ఆయన ర్య జిల్ బైడెన్ సీఎన్ఎన్ వార్తా సంస్థకు ఈ మేరకు తెలిపారు. 80 ఏళ్ల బైడెన్ ఇప్పటికే అమెరికా అధ్యక్షుల్లో అత్యంత వయోధికునిగా రికార్డు సృష్టించారు. రెండేళ్లలో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి బరిలో దిగే ఆలోచన ఉందని ఆయన కూడా ఇప్పటికే పలుమార్లు చెప్పారు. సీఎన్ఎన్‌తో మాట్లాడుతూ జిల్ ఇదే విషయాన్ని గుర్తు చేశారు. ఆయన నిర్ణయానికి తాను పూర్తిగా మద్దతిస్తున్నట్టు తెలిపారు. రెండోసారి పోటీపై బైడెన్ బహుశా మరో రెండు మూడు నెలల్లో అధికారిక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు. అయితే డెమొక్రటిక్ పార్టీ సహచరుల్లో ప్రధానంగా ఆయన వయసు పైనే అభ్యంతరాలు నెలకొన్నాయి. దీనిపై రాయిటర్స్–ఇప్సోస్ తాజాగా నిర్వహించిన పోల్‌లో బైడెన్ పోటీ చేయొద్దని డెమొక్రాట్లలో ఏకంగా 52 శాతం మంది అభిప్రాయపడ్డారు! మరోవైపు రిపబ్లికన్ పార్టీ తరఫున రెండోసారి అధ్యక్ష బరిలో దిగాలని ఉవ్విళ్లూరుతున్న మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌కు కూడా ప్రస్తుతం 76 ఏళ్లు! పైగా పార్టీ అభ్యర్థిత్వం కోసం నిక్కీ హేలీ తదితరులు ఇప్పటికే ఆయనకు పోటీదారులుగా ఉన్నారు.

సన్నిహితులే పుతిన్‌ను చంపేస్తారు: జెలెన్‌స్కీ

కీవ్: రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను సొంతవాళ్లే అంతమొందిస్తారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ జోస్యం చెప్పారు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఇయర్ పేరిట విడుదలైన డాక్యుమెంట్‌లో జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా అధినేత పుతిన్ నాయకత్వం బీటలు వారటం మొదలైందని, సన్నిహితులే ఆయనకు వ్యతిరేకులుగా మారతారని జెలెన్‌స్కీ అందులో తెలిపారు. 'రష్యాలో పుతిన్ పాలన ముగిసే క్షణం తప్పక వస్తుంది. చుట్టూ ఉండే మృగాలే ఆ మృగాన్ని చంపేస్తాయి. ఇది నిజంగా జరుగుతుందా? జరుగుతుంది. కానీ, ఎప్పుడో తెలియదు'అని జెలెన్‌స్కీ అన్నట్లు న్యూస్‌వీక్ పేర్కొంది. ఏడాదిగా ఉక్రెయిన్‌తో యుద్ధం సాగిస్తున్న పుతిన్ పట్ల అంతరంగికుల్లోనే అసహనం మొదలైందన్న వార్తల నేపథ్యంలో జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

సీగల్‌కు రష్యా ఫ్రెండ్‌షిప్ అవార్డు



మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని సమర్థించిన హాలీవుడ్ యాక్షన్ స్టార్ స్టీవెన్ సీగల్ (70)కు రష్యా 'ఆర్డర్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్' అవార్డు ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు సీగల్ గట్టి మద్దతుదారు. 2014లో క్రిమియా ఆక్రమణను కూడా సమర్థించారు. 2016లో ఆయనకు రష్యా తమ దేశ పౌరసత్వం కూడా ఇచ్చింది. అంతేగాక పుతిన్ వ్యక్తిగతంగా సీగల్‌కు రష్యా పాస్‌పోర్టు అందజేశారు! 2018 నుంచీ అమెరికా, జపాన్ దేశాల్లో రష్యా విదేశాంగ శాఖ ప్రత్యేక రాయబారిగా కూడా సీగల్ పని చేస్తున్నారు. అమెరికా మాజీ విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్, ఫిఫా అధ్యక్షుడు గియానీ ఇన్ఫాంటినో తదితరులకు కూడా ఆర్డర్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ అవార్డు ప్రకటించారు.

భింద్రన్‌వాలే 2.0 అమృత్‌పాల్ సింగ్


'సిద్ధాంతానికి చావుండదు. మా సిద్ధాంతమూ అంతే'
'మా లక్ష్యాన్ని మేధోపరంగా, భౌగోళిక రాజకీయపరంగా చూడాలి'
'ఖలిస్తాన్ ఉద్యమాన్ని అడ్డుకుంటే ఇందిరకు పట్టిన గతే అమిత్ షాకూ పడుతుంది'

– ఇవీ... తనను తాను ఖలిస్తాన్ ఉద్యమ నాయకుడిగా ప్రకటించుకున్న అమృత్ పాల్ సింగ్ వ్యాఖ్యలు! ఏదైనా 'చేస్తా'నని బహిరంగంగా చెప్పి మరీ చేస్తున్నాడు. ఎవరితను? అతని సారథ్యంలో ఖలిస్తాన్ ఉద్యమం మళ్లీ చాప కింద నీరులా విస్తరిస్తోందా...?

అమృత్‌పాల్ సింగ్ రాకతో ఏడాదిగా ప్రత్యేక ఖలిస్తాన్ ఉద్యమ వాణి బలంగా మళ్లీ వినిపిస్తోంది. అచ్చం ఆపరేషన్ బ్లూ స్టార్‌లో మరణించిన కరడుగట్టిన ఖలిస్తానీ తీవ్రవాది భింద్రన్‌వాలే మాదిరిగా నీలం రంగు తలపాగా చుట్టుకొని, తెల్లటి వస్త్రధారణతో మాటల తూటాలు విసురుతూ యువతను ఉద్యమం వైపు ప్రేరేపిస్తున్నాడు. ఇటీవలి దాకా ఎవరికీ పెద్దగా తెలియని అమృత్‌పాల్ కేంద్రంపై తరచూ విమర్శలతో ఉన్నట్టుండి చర్చనీయాంశంగా మారిపోయాడు.

పంజాబ్‌లో బాహాటంగానే విస్తరిస్తున్న ఖలిస్తానీ ఉద్యమం

- అనుచరుని విడుదల కోసం పోలీస్‌స్టేషన్‌పైకే దండయాత్ర!
- అమిత్ షాకూ ఇందిరాగాంధీ గతి పట్టిస్తామంటూ హెచ్చరికలు
- ఆప్ ప్రభుత్వ మద్దతూ ఉందంటూ అనుమానాలు



భింద్రన్‌వాలే

ఎవరీ అమృత్‌పాల్

29 ఏళ్ల అమృత్ పాల్ సింగ్ గతేడాది దాకా దుబాయ్‌లోనే రవాణా వ్యాపారంలో ఉన్నాడు. సంప్రదాయాలకు అంత విలువనిచ్చేవాడు కాదు. కానీ నటుడు దీప్ సిద్ధూ స్థాపించిన 'వారిస్ పంజాబ్ దే'సంస్థ సభ్యుడు. 2022 ఫిబ్రవరిలో దీప్ సిద్ధూ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో సంస్థను తన గుప్పిట్లోకి తీసుకున్నాడు. పంజాబ్‌కు తిరిగి వచ్చి, అణగారిన ఖలిస్తానీ ఉద్యమానికి తన మాటలు, చేతలతో మళ్లీ ఊపిరిలూదుతున్నాడు. హింసామార్గాన్నే ఎంచుకున్న అమృత్‌పాల్ అచ్చం పాకిస్తాన్ ఐఎస్ఐ తరహాలో ఉద్యమాన్ని నడిపిస్తున్నాడన్న ఆందోళనలున్నాయి.

ఏమిటీ ఖలిస్తాన్ ఉద్యమం?

ఖలిస్తాన్ అంటే పంజాబీలో పవిత్రమైన భూమి. సిక్కులకు ప్రత్యేక దేశమే కావాలంటూ 1940లో ఖలిస్తాన్ ఉద్యమం ప్రారంభమైంది. భారత్‌లో పంజాబ్‌ను తమ మాతృభూమిగా ప్రకటించాలంటూ సిక్కులు ఇప్పటిదాకా ఎన్నో ఉద్యమాలు నడిపారు. 1970–80ల్లో తారస్థాయికి వెళ్లిన ఈ ఉద్యమాన్ని ప్రధాని ఇందిరాగాంధీ ఆపరేషన్ బ్లూ స్టార్‌తో అణచివేశారు. ఏకంగా అమృతసర్ స్వర్ణ దేవాలయాన్ని కేంద్రంగా చేసుకొని సమాంతర ప్రభుత్వాన్నే నడిపిన ఖలిస్తానీ నేత భింద్రన్‌వాలేను స్వర్ణ దేవాలయంలోకి చొచ్చుకెళ్లి మరీ సైన్యం హతమార్చింది. అలా చల్లబడ్డ ఉద్యమం ఇప్పుడు విస్తరిస్తున్నట్టు కనిపిస్తోంది. అమృత్ పాల్ కూడా స్వర్ణ దేవాలయం కేంద్రంగానే మరింత కాక రాజేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. స్వర్ణ దేవాలయంపై దాడిని నిరసిస్తూ ఇందిరను ఆమె సిక్కు అంగరక్షకులే బలిగొన్న తరహాలో అమిత్ షా తమ టార్గెట్ అంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగుతున్నారు!

కెనడా కనెక్షన్

కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాల్లో సిక్కు జనాభా ఎక్కువ. దాంతో ఆయా దేశాల్లో ఖలిస్తానీ ఉద్యమ ప్రభావం బాగా కనిపిస్తుంటుంది. అక్కడి హిందూ ఆలయాలపై, గణతంత్ర వేడుకలు జరుపుకునే వారిపై దాడులు పరిపాటిగా మారాయి. ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ ఖలిస్తాన్ ఉద్యమకారులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూనే ఉంటారు. కెనడాలోనైతే సిక్కు జనాభా మరీ ఎక్కువ. ప్రభుత్వంలోనూ సిక్కుల ప్రాబల్యముంది. ప్రత్యేక ఖలిస్తాన్ కోసం ఖలిస్తాన్ ఉద్యమ సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్ (సీఎఫ్‌జే) కెనడాలో ఏకంగా రిఫరెండం నిర్వహించగా లక్షకు మందికిపైగా సిక్కులు ఓటింగ్‌లో పాల్గొన్నారు! దీన్ని ఆపాలని మోదీ ప్రభుత్వం కోరినా కెనడా ప్రభుత్వం ఒప్పుకోలేదు. అది తమ చట్టాల ప్రకారం ప్రజాస్వామ్యయుతంగానే జరుగుతోందంటూ అనుమతినిచ్చింది. భారత్ నుంచి పంజాబ్‌ను విడదీసి ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని ఏకంగా ఐక్యరాజ్యసమితికే విజ్ఞప్తి చేయడానికి ఖలిస్తాన్ మద్దతు సంఘాలు యూఎన్‌ను సంప్రదించనున్నాయి!

ఖలిస్తానీ శక్తులు పుంజుకుంటున్నాయా?

తన అనుచరుడు లవ్‌ప్రీత్ సింగ్‌ను ఓ కిడ్నాపింగ్ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుంటే అమృత్‌సర్‌లో అమృత్ పాల్ సృష్టించిన భయోత్పాతాన్ని అంతా దిగ్భ్రమతో చూశారు. కత్తులు, కటార్లే గాక అధునాతన తుపాకులు కూడా చేతబట్టుకొని వేలాది మంది సిక్కులు పోలీసుస్టేషన్లోకి చొరబడటమే గాక ఏకంగా పోలీసులతో బాహాబాహీకి దిగారు. దాంతో పంజాబ్ ఆప్ ప్రభుత్వం అతనికి వ్యతిరేకంగా సాక్ష్యాలు లేవంటూ విడుదల చేసిన పరిస్థితి! ఈ ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది. అంతకుముందు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమం చేసినప్పుడు ఢిల్లీలో ధర్నా సందర్భంగా ఏకంగా చారిత్రక ఎర్రకోటపైనే ఖలిస్తాన్ జెండా ఎగురవేశారు! వీధుల్లో వీరంగం వేశారు. ఖలిస్తానీ శక్తులు బలం పుంజుకుంటున్నాయనడానికి ఇవన్నీ తార్కాణాలే. ఏడాది కాలం జరిగిన రైతు ఉద్యమం వెనకా ఖలిస్తానీ వేర్పాటు వాదుల హస్తమే ఉందంటారు. ఖలిస్తానీ ఉద్యమ పునాదులపై పుట్టిన అకాలీదళ్ పార్టీ బలహీనపడిపోతున్న తరుణంలో అమృత్‌పాల్ రూపంలో కొత్త గళం బలంగా వినిపించడం ప్రారంభమైంది.



పోలీసులతో బాహాబాహీ

ఆప్ పాత్రపై అనుమానాలు



పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ఖలిస్తానీ వేర్పాటువాదులకు అనుకూలంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. పెచ్చరిల్లిన హింసాకాండ, కాల్చి చంపడాల నేపథ్యంలో గన్ లైసెన్సులపై ఇటీవల సంపూర్ణ సమీక్ష నిర్వహిస్తున్న పంజాబ్ పోలీసులు ఎవరి దగ్గర ఆయుధాలు, తుపాకులున్నా వెంటనే కేసులు పెడుతున్నారు. కానీ బాహాటంగా ఆయుధాలు చేబూని తిరుగుతూ భయోత్పాతానికి దిగుతున్న అమృత్‌పాల్, అతని అనుచరులపై ఇప్పటిదాకా ఒక్క కేసూ నమోదవలేదు! ఏకంగా కేంద్ర హోం మంత్రికే చంపేస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నా ప్రభుత్వ పెద్దలను బాహాటంగా బెదిరిస్తున్నా చూసిచూడనట్టు వదిలేస్తున్నారు. దీని వెనక రాజకీయ కారణాలున్నాయనే అభిప్రాయాలున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘన విజయానికి ఖలిస్తాన్ శక్తులే తోడ్పాటు అందించినట్టు విశ్లేషణలున్నాయి. అందుకే ఇప్పుడు వారి ఆగడాలపై ఆప్ నోరు మెదపడం లేదంటూ విపక్షాలు దుయ్యబడుతున్నాయి. ఇక పంజాబ్‌లో మిలిటెంట్ కార్యకలాపాల్లో దోషులుగా తేలి 30 ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్న బందీ సింగ్ (సిక్కు ఖైదీ)ల విడుదల కోసం వారి మద్దతుదారులు వేలాదిగా రోడ్డెక్కి నిరసనలకు దిగుతున్నారు. ఇలా ఈ మధ్య ఖలీస్తాన్ వేర్పాటువాదులు ఏదో ఒక కార్యక్రమంతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు.

-సాక్షి, నేషనల్ డెస్క్

దిగువ కోర్టుకు వెళ్లండి

బెయిల్ పిటిషన్‌పై సిసోడియాకు సుప్రీంకోర్టు సూచన

మంత్రి పదవులకు సిసోడియా, సత్యేంద్ర రాజీనామా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో అరెస్టయిన ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు చుక్కెదురైంది. ఆయన పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సిసోడియా తరఫున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వి వాదించారు. 'మద్యం విధానానికి సంబంధించిన నిర్ణయాలు వేర్వేరు దశల్లో జరిగాయి, ఈ కేసులో డబ్బు రికవరీ కూడా లేనందున డిప్యూటీ సీఎం సిసోడియాను అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదు'అని అన్నారు. మద్యం విధానానికి సంబంధించి లెఫ్టినెంట్ గవర్నర్ కూడా భాగస్వామిగా ఉన్నారని చెప్పారు. అయితే, ఈ పిటిషన్‌ను ఆర్టికల్ 32 కింద విచారణకు స్వీకరించలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహల ధర్మాసనం పేర్కొంది. 'ఢిల్లీలో ఘటన జరిగిందనే కారణంతో, సిసోడియా నేరుగా అత్యున్నత న్యాయస్థానానికి రాకూడదు. సమస్య పరిష్కారం కోసం ఢిల్లీ హైకోర్టుతోపాటు ఇతర దిగువ కోర్టులకు కూడా వెళ్లేందుకు ఆయనకు అవకాశముంది'అని ధర్మాసనం తెలిపింది. దీంతో సింఘ్వి బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఎక్సైజ్ పాలసీలో అవకతవకల ఆరోపణలపై నమోదైన కేసులో సిసోడియాను సీబీఐ సోమవారం 5 రోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే.

ఆప్ సర్కారుకు ఎదురుదెబ్బ

ఢిల్లీలో సీఎం కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మంగళవారం రాష్ట్ర కేబినెట్‌లోని మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లు మంత్రి పదవులకు రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆమోదించారు. సిసోడియా పోర్ట్‌ఫోలియోలను రెవెన్యూ మంత్రి కైలాశ్ గహ్లోత్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్‌లకు కేటాయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆరోగ్య, పరిశ్రమల శాఖలకు మంత్రిగా ఉన్న సత్యేందర్ జైన్ మనీలాండరింగ్ కేసులో గత ఏడాది మే నుంచి తిహార్ జైలులో ఉన్నారు. శాఖలేవీ లేకుండానే ఆయన మంత్రిగా కొనసాగుతున్నారు. జైన్ కున్న శాఖలను కూడా సీఎం కేజ్రీవాల్ డిప్యూటీ సీఎం కూడా అయిన సిసోడియాకే కేటాయించారు. దీంతో, ఢిల్లీ ప్రభుత్వంలోని 33 శాఖలకు గాను ఆర్థిక, తదితర 18 శాఖలను నిర్వహిస్తున్న సిసోడియా కేబినెట్‌లో అత్యంత కీలకంగా ఉన్నారు. మద్యం పాలసీ కేసులో ఆదివారం సీబీఐ సిసోడియాను కస్టడీలోకి తీసుకుంది. తాజాగా వీరిద్దరూ కేబినెట్ నుంచి వైదొలగడం ఆప్ ప్రభుత్వానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు.



సిసోడియా, జైన్ (ఫైల్)

ముందే వైదొలిగి ఉండాల్సింది: బీజేపీ

ఆమ్ ఆద్మీ పార్టీ కమిషన్ల, అవినీతి పార్టీ అని బీజేపీ విమర్శించింది. అవినీతి ఆరోపణలు వెలుగులోకి వచ్చిన మొదట్లోనే సిసోడియా, జైన్‌లు మంత్రి పదవులకు రాజీనామా చేసి ఉండాల్సిందని పేర్కొంది.

ఐక్యరాజ్య సమితి చర్చల్లో నిత్యానంద 'యూఎస్‌కే' ప్రతినిధి



ఐక్యరాజ్యసమితి: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు నిత్యానంద స్థాపించిన దేశం 'కైలాస' ఐక్యరాజ్య సమితి చర్చల్లో పాలుపంచుకుంది. జెనీవాలో సుస్థిర అభివృద్ధి అంశంపై ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల కమిటీ ఈ నెల 24న చర్చా కార్యక్రమం ఏర్పాటు చేసింది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస ప్రతినిధినంటూ విజయప్రియ నిత్యానంద అనే మహిళ ఈ చర్చలో పాల్గొని, ప్రసంగించారు. హిందూ మతాన్ని, ఆచార సంప్రదాయాలను ప్రచారం చేస్తున్న నిత్యానందను భారతదేశం ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ఆయనకు రక్షణ కల్పించాలని కోరారు. యూఎస్‌కే తరఫున ఇయాన్ కుమార్ అనే వ్యక్తి కూడా చర్చల్లో పాల్గొన్నారు. అత్యాచారం, అపహరణ కేసుల్లో అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో 2019లో నిత్యానంద దేశ విడిచి పారిపోయిన విషయం తెలిసిందే. అజ్ఞాతంలో ఉంటూనే ఈక్వెడార్‌కు సమీపంలోని ఓ దీవిని తన సొంత కైలాస దేశమని, 200 కోట్ల మంది హిందువులకు ప్రాతినిధ్యం వహిస్తుందని ప్రకటించారు. ఐరాస గుర్తింపు పొందాలంటే భద్రతా మండలి, సర్వప్రతినిధి సభ ఆమోదం ముందుగా అవసరం. 193 దేశాల జాబితాలో యూఎస్‌కే లేదు. అయితే, జెనీవా చర్చలో పాల్గొన ద్వారా ఐరాస గుర్తింపు లభించిందనే తప్పుడు అభిప్రాయం కల్పించేందుకు యూఎస్‌కే ప్రయత్నించిందని పరిశీలకులు అంటున్నారు.

2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారత్'

- లక్ష్య సాధనకు ఆధునిక సాంకేతికత దోహదం
- ప్రజలందరికీ డిజిటల్ విప్లవ ప్రయోజనాలు
- టెక్నాలజీతో పలు రంగాల్లో పెనుమార్పులు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి



న్యూఢిల్లీ: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్య సాధనకు ఆధునిక సాంకేతికత దోహదపడతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. డిజిటల్ విప్లవ ప్రయోజనాలు ప్రజలందరికీ దక్కేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా భారీస్థాయిలో ఆధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. 'అన్‌లీషింగ్ ద పొటెన్షియల్: ఈజ్ ఆఫ్ లివింగ్ యూజింగ్ టెక్నాలజీ' పేరిట మంగళవారం నిర్వహించిన వెబినార్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. చిన్న తరహా పరిశ్రమలపై భారంగా మారిన నిబంధనలను తొలగించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

టెక్నాలజీతో పేదలకు లబ్ధి

అన్ని రంగాల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగం పెరుగుతోందని నరేంద్ర మోదీ వెల్లడించారు. 5జీ, కృత్రిమ మేధ(ఏఐ)పై ఇప్పుడు అంతటా చర్చ జరుగుతోందన్నారు. సాంకేతికతతో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో పెనుమార్పులు రాబోతున్నాయన్నారు. ఒకే దేశం, ఒకే రేషన్‌తోపాటు జన్ ధన్ యోజన, ఆధార్, మొబైల్ నెంబర్(జేఏఎం)కు టెక్నాలజీయే ఆధారమని అన్నారు. దీనివల్ల పేదలకు లబ్ధి చేకూరుతోందని హర్షం వ్యక్తం చేశారు. సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ఏఐ ద్వారా పరిష్కరించగలిగిన పదింటిని గుర్తించాలని నిపుణులకు సూచించారు. 21వ శతాబ్దాన్ని టెక్నాలజీ ముందుకు నడిపిస్తుందని, దీన్ని ఎవరూ ఆపలేరని వ్యాఖ్యానించారు. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో ప్రజల జీవనాన్ని సులభతరం చేయడానికి ప్రతి బడ్జెట్‌లోనూ పెద్దపీట వేస్తున్నామని మోదీ పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గిస్తున్నామన్నారు. ప్రభుత్వాన్ని ఒక అవరోధంగా పరిగణించవద్దని ప్రజలకు సూచించారు.

దక్షిణాదిలో మార్చి ఎండలు తక్కువే!

- వాతావరణ శాఖ అంచనా
- లా–నినా పరిస్థితులు మారే అవకాశం
- రుతుపవనాల నాటికి ఎల్–నినో!



సాక్షి, హైదరాబాద్: హమ్మయ్య! ఈ నెలలో దక్షిణాది రాష్ట్రాలు కొంచెం నిశ్చింతగా ఉండవచ్చు. ఎందుకంటారా? దేశం మొత్తమ్మీద మార్చి నెలలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండబోతున్నాయి. కానీ, దేశ ద్వీపకల్ప ప్రాంతంలో మాత్రం వేడి సాధారణం నుంచి అంతకంటే తక్కువ ఉండనుంది. భారతీయ వాతావరణ విభాగం (ఐఎండీ) ఈ విషయం తెలిపింది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి మాత్రం ఎన్నడూ లేనంతగా, స్పష్టంగా చెప్పాలంటే 1877 సంవత్సరం నుంచి ఇప్పటివరకూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన నెలగా రికార్డు సృష్టించింది. వేసవి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఐఎండీ మంగళవారం వర్చువల్ పద్ధతిలో విలేకరుల సమావేశం నిర్వహించింది. మార్చి నుంచి మే నెల వరకూ వేసవి తీరుతెన్నులపై తన అంచనాలను వెలువరించింది. దీని ప్రకారం.. మార్చిలో గరిష్ట ఉష్ణోగ్రతలు దేశ ఈశాన్య, తూర్పు, మధ్య ప్రాంతాలతోపాటు వాయువ్య ప్రాంతాల్లో కొన్ని చోట్ల సాధారణం కంటే ఎక్కువగా ఉండనున్నాయి. మిగిలిన ప్రాంతాలు అంటే.. దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం తక్కువగా ఉంటాయి. కనిష్ట ఉష్ణోగ్రతల్లోనూ ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. దక్షిణాది రాష్ట్రాలు మినహా మిగిలిన అన్నిచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని ఐఎండీ తెలిపింది. మార్చి నుంచి మే నెల మధ్యభాగంలో దేశ మధ్య ప్రాంతం దానికి అనుకుని ఉండే వాయవ్య ప్రాంతాల్లో వడగాడ్పులు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉండనుంది. మార్చిలో దేశంలోని మధ్య ప్రదేశంలో వడగాడ్పుల ప్రభావం అంతగా ఉండకపోవచ్చు.

సాధారణ స్థాయిలోనే వర్షాలు..

మార్చి నెలలో వర్షపాతం కూడా దేశం మొత్తమ్మీద సాధారణంగానే ఉండనున్నట్లు ఐఎండీ తెలిపింది. దీర్ఘకాలిక అంచనాలతో పోల్చినప్పుడు ఈ నెల వర్షాలు 83 –117 శాతం మధ్యలో ఉంటాయని తెలిపింది. దేశ వాయవ్య ప్రాంతాల విషయానికి వస్తే అక్కడ సాధారణం కంటే తక్కువ స్థాయి వర్షాలు నమోదు కావచ్చునని, సెంట్రల్ ఇండియా పశ్చిమ దిక్కున, ఈశాన్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని వివరించింది. దేశ ద్వీపకల్ప ప్రాంతంలో మార్చి నెల వానలు సాధారణం లేదా అంతకంటే ఎక్కువ స్థాయిలో ఉంటాయని తెలిపింది.

ఎల్‌నినో, లానినాలపై ఇప్పుడే చెప్పలేం

ఈ ఏడాది రుతుపవనాల పరిస్థితులపై స్పష్టంగా చెప్పడం ప్రస్తుతానికి వీలుకాదని ఐఎండీ తెలిపింది. ''పసఫిక్ మహాసముద్ర ప్రాంతంలోని ఉపరితల జలాల ఉష్ణోగ్రతల దృష్ట్యా లానినా పరిస్థితులున్నాయి. రానున్న రోజుల్లో ఇది బలహీనపడి ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం కనిపిస్తోంది'' అని వివరించింది. రుతుపవనాల సీజన్‌కు ముందు ఈ పరిస్థితులు ఏర్పడవచ్చంది. అంతేకాకుండా... రుతుపవనాలపై ప్రభావం చూపగల హిందూ మహాసముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రతలు కూడా సాధారణ స్థితిలోనే ఉండే అవకాశమున్నట్లు చెప్పారు.

హాలీవుడ్ సినిమాలు చూస్తే జైలుకే

సియోల్: హాలీవుడ్, ముఖ్యంగా దక్షిణ కొరియా సినిమాలు, టీవీ కార్యక్రమాల ప్రభావాన్ని తగ్గించేందుకు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ కఠిన చర్యలను ప్రకటించారు. పిల్లలు హాలీవుడ్ సినిమాలు చూస్తున్నారని తెలిస్తే వారి తల్లిదండ్రుల్ని ఆరు నెలలపాటు నిర్బంధ లేబర్ క్యాంపులకు తరలిస్తామని హెచ్చరించారు. అంతేకాదు, సదరు పిల్లలు ఏకంగా ఐదేళ్ల జైలు శిక్ష అనుభవాల్సి ఉంటుందని కూడా ప్రకటించారని మిర్రర్ పత్రిక పేర్కొంది. దక్షిణ కొరియా పౌరుడిలా కనిపించాలని చూసినా 6 నెలల జైలు జీవితం తప్పదని పేర్కొంది. గతంలో ఈ నేరాలకు పాల్పడిన వారిని గట్టి హెచ్చరికలతో వదిలేసేవారు. తాజాగా, ప్రభుత్వం ఇన్మిబన్ అనే కార్యక్రమాన్ని ప్రకటించిందని మిర్రర్ తెలిపింది. అంటే ప్రతి ఒక్కరూ తమ పక్క ఇళ్లలో ఏం జరిగే వాటిపై ఓ కన్నేసి ఉంచాల్సి ఉంటుంది. డ్యాన్సులు, పాటలు పాడటం, మాట్లాడటంపైనా కిమ్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

కెనడాలోనూ టిక్‌టాక్‌పై నిషేధం

టొరంటో: చైనాకు చెందిన టిక్‌టాక్‌పై కెనడా నిషేధం విధించింది. ప్రభుత్వం జారీ చేసిన మొబైల్ పరికరాలు వేటిలోనూ దాన్ని వాడకూడదని పేర్కొంది. ప్రభుత్వోద్యోగులెవరూ దీన్ని వాడొద్దని ఆదేశించింది. ప్రైవసీకి, భద్రతకు ఈ యాప్ వల్ల చాలా రిస్కుందని కెనడా చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ నిర్ధారించినట్టు ట్రెజరీ బోర్డ్ ప్రెసిడెంట్ మోనా ఫోర్టియర్ తెలిపారు. ఇది ప్రారంభమేనని, ముమ్ముందు మరిన్ని చర్యలుంటాయని ప్రధాని జస్టిన్ ట్రూడో చెప్పారు. డెన్మార్క్‌లో ప్రభుత్వ మొబైళ్లు తదితరాల్లో టిక్‌టాక్‌ను నిషేధించాలని పార్లమెంటు పేర్కొంది. అమెరికా నెల రోజుల్లోపు ప్రభుత్వ మొబైళ్లు తదితర పరికరాల్లో నుంచి టిక్‌టాక్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది.

పులులకు 'ఎండదెబ్బ'

- పదేళ్లలో 1,062 పులుల మృత్యువాత
- వాటిలో వేసవి మరణాలే 348
- సంరక్షణకు చర్యలు తీసుకోండి
- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న పులుల మరణాలు కలవర పరుస్తున్నాయి. ఈ ఏడాది రెండు నెలల్లోనే 34 పులులు మరణించాయి. ముఖ్యంగా ఎండాకాలం వాటి పాలిట మృత్యువుగా మారుతోంది. గత పదేళ్ల గణాంకాలు కూడా అదే చెబుతున్నాయి. మార్చి నుంచి మే చివరి వరకు పులుల మరణాల సంఖ్య భారీగా ఉంటోంది. దాంతో ఈ వేసవిలో పులుల సంరక్షణ కోసం తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసింది.

2012–2022 మధ్య పదేళ్లలో దేశవ్యాప్తంగా 1,062 పులులు మరణించినట్లు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ గణాంకాలు చెబుతున్నాయి. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 270, మహారాష్ట్రలో 184, కర్ణాటకలో 150 పులులు మరణించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 11, తెలంగాణలో తొమ్మిది పులులు మృత్యువాత పడ్డాయి. 2020లో 106, 2021లో 127, 2022లో 121 పులులు మరణించాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిల్లోనే 34 ప్రాణాలు కోల్పోవడం విషాదం. వీటిలో మధ్యప్రదేశ్‌లో 9, మహారాష్ట్రలో 8 మరణాలు సంభవించాయి. గడిచిన పదేళ్ల రికార్డులు చూస్తే మార్చిలో 123, ఏప్రిల్‌లో 112, మేలో 113 మరణాలు నమోదయ్యాయి. అంటే పదేళ్లలో వేసవిలో ఏకంగా 348 పులులు చనిపోయాయి!



తస్మాత్ జాగ్రత్త

ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటొచ్చన్న అంచనాల నేపథ్యంలో పులుల సంరక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. రాత్రిళ్లు అభయారణ్యాల్లో సఫారీలను ఆపేయండి. అక్రమ నిర్మాణాలపై నిఘా పెంచండి'' అని పేర్కొంది.

వేసవిలో పులుల మరణాలకు ఇవీ కారణాలు...

- ఎండాకాలంలో నీరు, ఆహారం కోసం తమ ఆవాసాలను దాటి దూరంగా రావడం
- అభయారణ్యాలనుంచి బయటకు వచ్చేయడం
- ఆహారం కోసం పులుల మధ్య పోరాటాలు
- అడవుల్లో పచ్చదనం తగ్గడం, బఫర్ జోన్‌లు లేకపోవడం
- అటవీ భూముల నరికివేత, సమీప ప్రజల్లో అడవి జంతువులపై అసహనం, భయంతో కొట్టి చంపడం

రష్యాపై డ్రోన్ల వర్షం

- నిఘా విమానం ధ్వంసం
- మరో విమానానికి భారీ నష్టం
- మాస్కో సమీపంలోనూ దాడులు
- ఉక్రెయిన్ పనే: రష్యా

కీవ్: డ్రోన్ దాడులతో రష్యా ఉక్కిరిబిక్కిరైంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం దాకా ఎడతెరిపి లేకుండా జరిగిన దాడుల్లో దేశంలో పలుచోట్ల మౌలిక సదుపాయాలకు స్వల్ప నష్టం వాటిల్లింది. ఇంతకాలం ఉక్రెయిన్ సరిహద్దుల సమీపానికే పరిమితమైన దాడులు ఏకంగా రాజధాని మాస్కో సమీపం దాకా చొచ్చుకొచ్చాయి. ఒక డ్రోన్ మాస్కోకు 100 కిలోమీటర్ల దూరంలో విధ్వంసం సృష్టించింది! పలు డ్రోన్లను రష్యా పేల్చేసింది. మరోవైపు హాకింగ్ దెబ్బకు రష్యా టీవీ, రేడియో ప్రసారాలకు చాలాసేపు అంతరాయం కలిగింది. డ్రోన్ల కలకలంతో సెయింట్ పీటర్స్‌బర్గ్ విమానాశ్రయాన్ని గంటలపాటు మూసేయాల్సి వచ్చింది! ఈ దాడులన్నీ ఉక్రెయిన్ పనేనంటూ రష్యా మండిపడింది. తమపై రష్యా పూర్తిస్థాయి యుద్ధానికి దిగిన నేపథ్యంలో ఎలాంటి దాడులకైనా పాల్పడే హక్కు తమకుందంటూ ఉక్రెయిన్ నర్మగర్భ వ్యాఖ్యలతో సరిపెట్టింది. రష్యా మిత్రదేశమైన బెలారస్‌లో ఓ వైమానిక స్థావరంపై జరిగిన డ్రోన్ దాడుల్లో రూ.2,737 కోట్ల విలువైన రష్యా నిఘా విమానంతో పాటు మరో సైనిక రవాణా విమానం, పలు వాహనాలు దెబ్బ తిన్నట్టు చెబుతున్నారు. ఇది స్థానిక ఉక్రెయిన్ మద్దతుదారుల పనేనని అనుమానిస్తున్నారు.

కుక్క కాటుకు వెయ్యి కుట్లు



వాషింగ్టన్: స్నేహితురాలితో ఆడుకోవడానికి పొరుగింటికి వెళ్లిన ఆరేళ్ల బాలికపై శునకం దాడిచేసింది. ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను బతికించడానికి వెయ్యికిపైగా కుట్లు వేయాల్సి వచ్చింది. చికిత్స కోసం నిధులు సేకరించారు. హృదయవిదారకమైన ఈ ఉదంతం అమెరికాలోని చెస్టర్‌విల్లేలో చోటుచేసుకుంది. ఆరేళ్ల చిన్నారి లిలీ ఫిబ్రవరి 18న ఆడుకోవడానికి పొరుగింటికి వెళ్లింది. అక్కడ టేబుల్‌పై కూర్చొని ఉండగా ఆ కుటుంబం పెంచుకుంటున్న పిట్ బుల్ అనే జాతి శునకం హఠాత్తుగా దాడి చేసింది. ముఖంపై కరిచేసింది. కంటి కింది నుంచి చుబుకం దాకా పంటి గాట్లు దిగాయి. లిలీ మిత్రురాలు వెంటనే గట్టిగా అరవడంతో వంటగదిలో ఉన్న ఆమె తల్లి బయటకు వచ్చింది. కుక్కను ఆమె దూరంగా తరిమేసింది. లిలీ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు చేతులెత్తేయడంతో బోస్టన్‌లోని మరో హాస్పిటల్‌లో చేర్చారు. చికిత్సకు చాలా డబ్బు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో లిలీ కుటుంబ మిత్రుడొకరు సోషల్ మీడియాలో 'గోఫండ్‌మీ' పేరిట పేజీని ఏర్పాటు చేసి, నిధులు సేకరించాడు. వైద్యులు లిలీకి చికిత్స పూర్తిచేశారు. ముఖంపై వెయ్యికిపైగా కుట్లు వేశారు. తన బిడ్డ దుస్థితిని చూసి శోకాన్ని ఆపుకోవడానికి తాను చాలా కష్టపడాల్సి వచ్చిందని లిలీ తల్లి డోరోతీ నార్టన్ చెప్పారు. లిలీ ముఖంలో కండరాలన్నీ దెబ్బతిన్నాయని, ఇప్పట్లో మాట్లాడలేదని, కనీసం నవ్వలేదని డాక్టర్లు వెల్లడించారు. పూర్తిగా కోలుకోవడానికి చాలా సమయం పడుతుందని అన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం । 1 । మార్చి । 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి తాడిగడప విద్యానగర్ కాలనీకి చెందిన కొత్తపల్లి విజయలక్ష్మి రూ. 1,00,001 విరాళాన్ని అందజేశారు.



ఈవీఎం గోదాము పరిశీలన

చిలకలపూడి: కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ పి.రంజిత్‌బాషా మంగళవారం పరిశీలించారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

జగ్గయ్యపేటలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. నేడు సెమీస్, ఫైనల్ పోరు జరగనుంది.

-8లో

న్యూస్‌రీల్

ఆర్చరీ పోటీలు ప్రారంభం



విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి 42వ సీనియర్ మహిళలు, పురుషుల ఆర్చరీ పోటీలు విజయవాడ శాతవాహన కళాశాల క్రీడామైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి 13 జిల్లాల నుంచి 40 మంది పురుషులు, 30 మంది మహిళలు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ ఎస్.రమాసత్యనారాయణ ఈ పోటీలను ప్రారంభించారు. తొలి రోజు ఇండియన్ రౌండ్ విభాగంలో క్రీడాకారులు తలపడ్డారు. బుధవారం కాంపౌండ్, గురువారం రికర్వ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీతరావు పాల్గొన్నారు.

కుక్కల సమస్యల నివారణకు టోల్ ఫ్రీ నంబర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో సుమారు 30 వేల వీధి కుక్కలు ఉన్నాయని, వీటికి వ్యాక్సిన్లు వేయటానికి, యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ)కి మూడు ప్రత్యేక వాహనాలు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని 64 డివిజన్లలో ఉన్న అన్ని వీధి కుక్కలకు ఆరు నెలల్లో రేబిస్ టీకాలు చేస్తామని తెలిపారు. వీధి కుక్కలతో పాటు పెంపుడు కుక్కల వివరాల సేకరణకు ప్రత్యేక బృందాలను నియమిస్తున్నామని వివరించారు. డాగ్ లవర్స్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవగాహన సదస్సులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. వీధి కుక్కల సమస్యలపై వీఎంసీ టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2000, వీఎంసీ వాట్సప్ నంబర్ 81819 60909ను సంప్రదించాలని సూచించారు.

వాలీబాల్ పోటీల్లో కృష్ణా జిల్లాకు ద్వితీయ స్థానం



చీపురుపల్లి: విజయనగరం జిల్లా చీపురుపల్లి పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఆహ్వానపు టోర్నమెంట్ విజేతగా యానాం జట్టు, ద్వితీయ స్థానంలో కృష్ణా జిల్లా జట్టు నిలిచాయి. కనకమహాలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో గత నెల 26న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఆహ్వానపు టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, యానాం నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. రెండు రోజులు జరిగిన పోటీల్లో యానాం, కృష్ణా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. రెండు జట్ల మధ్య సోమవారం రాత్రి హోరాహోరీగా సాగిన తుదిపోరులో కృష్ణా జిల్లా జట్టుపై యానాం జట్టు విజయం సాధించింది. రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన యానాం జట్టుకు రూ.30 వేల నగదు బహుమతితో బాటు ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జిల్లా జట్టుకు రూ.25 వేల నగదుతో బాటు ట్రోఫీని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందజేశారు.

'ఫ్యామిలీ డాక్టర్' కచ్చితంగా అమలవ్వాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఇక నుంచి కచ్చితంగా అమలు చేయాలని కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. తన కార్యాలయంలో ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ సిబ్బందితో ఆమె మంగళవారం సమావేశమయ్యారు. గీతాబాయి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా రూబెల్లా ఎలిమినేషన్ కార్యక్రమాన్ని డిసెంబర్ 2023 నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అర్హులైన పిల్లలకు 9 నుంచి 12 నెలల మధ్యవారికి ఎంఆర్–1, 16 నుంచి 24 నెలల మధ్య వయసు ఉన్న వారికి ఎంఆర్–2 వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల్లో ఉన్న రక్తహీనత స్థాయిని గుర్తించి వారి హిమోగ్లోబిన్ శాతాన్ని బట్టి ఐరన్ మాత్రలు, సుక్రోజ్ ఇంజెక్షన్లను అందజేయాలన్నారు. డాక్టర్ ఎస్.శర్మిష్ట, డీఐవో ఎ. వెంకట్రావు, డీటీసీ రత్నగిరి, నోడల్ ఆఫీసర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

సంతోషాలు వేవేలు

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- కృష్ణా జిల్లాలో రూ.194.96 కోట్లతో 2,404 సీసీ రోడ్లు నిర్మించాలని నిర్ణయం
- ఇప్పటికే 870 రోడ్ల నిర్మాణ పనులు పూర్తి
- 50 శాతానికి పైగా పూర్తయిన మరో 623 పనులు చేపట్టేందుకు చర్యలు
- ఎన్టీఆర్ జిల్లాలో రూ.117.46 కోట్లతో 1,008 సీసీ రోడ్ల నిర్మాణానికి అంచనాలు



మచిలీపట్నం మండలం గోకవరం గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ప్రయాణాలు ఇక సజావుగా సాగనున్నాయి. రెండు జిల్లాల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తోంది. తొలుత ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం ప్రతి పంచాయతీలోనూ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణ పనులు చేపట్టింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణ పనులపైన దృష్టి సారించింది. కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లో రూ.194.96 కోట్ల అంచనాలతో మొత్తం 2,404 రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే 870 రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసింది. 50 శాతానికి పైగా పనులు జరిగి అసంపూర్తిగా మిగిలిన రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో 623 రోడ్ల నిర్మాణానికి రూ.54.24 కోట్లతో అంచనాలు రూపొందించింది. ఈ పనుల్లోనూ ఇప్పటికే రూ.39.59 కోట్ల మేర పూర్తయ్యాయి. వీటికి సంబంధించి రూ.38.10 కోట్ల బిల్లులను సైతం చెల్లించింది. మిగిలిన రూ.14.65 కోట్ల పనులను పూర్తిచేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మిగిలిన పనులను దశల వారీగా చేపట్టేందుకు వీలుగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కృష్ణా జిల్లాలో

నియోజకవర్గం	పనుల సంఖ్య	అంచనా విలువ (రూ. కోట్లల్లో)	పూర్తయిన పని విలువ (రూ. కోట్లల్లో)
అవనిగడ్డ	31	1.94	1.32
గన్నవరం	28	5.10	3.88
గుడివాడ	149	8.04	5.78
మచిలీపట్నం	140	13.39	9.85
పామర్రు	64	4.11	3.19
పెడన	161	9.87	7.54
పెనమలూరు	50	11.79	8.03
మొత్తం	623	54.24	39.59

ఎన్టీఆర్ జిల్లాలో 1,008 పనులు

ఎన్టీఆర్ జిల్లాలో గతంలో మొత్తం 1,008 రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి రూ.117.46 కోట్లతో ప్రభుత్వం అంచనాలు రూపొందించింది. మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లోని 16 మండలాల్లో ఇప్పటికే 50 శాతానికి పైగా నిర్మాణం జరిగి అసంపూర్తిగా ఉన్న పనులు 739 ఉన్నాయి. వీటి అంచనా విలువ రూ.76.46 కోట్లు. ఇప్పటికే రూ.40.11 కోట్ల మేర పనులు జరిగాయి. రూ.37.44 కోట్ల బిల్లులు సైతం చెల్లించారు. మిగిలిన రూ.36.35 కోట్ల పనులను చేపట్టి పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఎన్టీఆర్ జిల్లా

నియోజకవర్గం	పనుల సంఖ్య	అంచనా విలువ (రూ. కోట్లల్లో)
జగ్గయ్యపేట	72	18.00
మైలవరం	166	21.29
నందిగామ	149	22.16
తిరువూరు	352	15.01
మొత్తం	739	76.46



ఇబ్రహీంపట్నం మండలం కాచవరం గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

త్వరితగతిన రోడ్ల నిర్మాణం



జిల్లాలో గతంలో 739 సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.76.46 కోట్లు అవసరమని అంచనాలు రూపొందించాం. ఇప్పటికే ఎక్కువ శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. జిల్లా వ్యాప్తంగా రూ.36 కోట్ల పనులు చేపట్టనున్నాం.

– ఎస్.ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. గతంలోనే మంజూరై, 50 శాతానికి పైగా పూర్తయిన, అసంపూర్తిగా మిగిలిన రోడ్ల నిర్మాణాన్ని ప్రస్తుతం చేపడుతున్నాం. ఈ పనులను ఇప్పటికే గుర్తించాం. జిల్లా వ్యాప్తంగా 623 రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం.

– పి.రంజిత్‌బాషా, కృష్ణా జిల్లా కలెక్టర్

జీజీహెచ్‌లో ఉచితంగా గ్రహణంమొర్రి ఆపరేషన్లు



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, డాక్టర్ మోహన్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రహణం మొర్రితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసేందుకు ఈ నెల రెండు నుంచి ఐదో తేదీ వరకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నామని విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి తెలిపారు. మిషన్ స్మైల్, ముత్తూట్ ఫౌండేషన్‌తో కలిసి ప్రభుత్వాస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వివరాలను డాక్టర్ సౌభాగ్యలక్ష్మి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. ఈ నెల రెండో తేదీన స్క్రీనింగ్ పరీక్షలు, రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. మూడు, నాలుగు, ఐదు తేదీల్లో శస్త్ర చికిత్సలు చేస్తామని పేర్కొన్నారు. ఈ మూడు రోజుల్లో 50 నుంచి 70 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వివరించారు. ఈ శిబిరానికి వచ్చే చిన్నారులకు మిషన్ స్మైల్ ఆధ్వర్యంలో రవాణా చార్జీలు కూడా చెల్లిస్తామన్నారు. సమీపంలోని గ్రామాల వారిని తమ వాహనాల్లోనే ఆపరేషన్ల అనంతరం ఇళ్లకు పంపిస్తామన్నారు. గ్రహణం, అంగిలి చీలిక వంటి వాటికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎ.ఆర్.సీహెచ్.మోహన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ నాలుగు సార్లు మిషన్ స్మైల్‌తో కలిసి ఉచితంగా గ్రహణం మొర్రి శస్త్ర చికిత్సలు చేశామన్నారు. ఈ శిబిరం ఐదోదని తెలిపారు. మరిన్ని వివరాలకు 96746 59679, 63033 58564 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యు.శోభ, ముత్తూట్ ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ సుబ్బారావు, మిషన్ స్మైల్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ సమీర్ పాల్గొన్నారు.

జన జాతరకు వేళాయె

- మార్చి 7 నుంచి పెనుగంచిప్రోలు తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల
- 9న అమ్మవారి పుట్టింటి నుంచి పసుపు, కుంకుమ బండ్ల రాక
- ఐదు రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు



శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల ఆరాధ్య దైవమైన పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాలు మార్చి ఏడు నుంచి 11వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు ఆలయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కొక్క రోజు ఒక్కో ప్రత్యేకతతో ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి పసుపు, కుంకుమ బండ్ల రాక ఈ తిరునాళ్లలో ప్రధాన ఘట్టం. తిరునాళ్లకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలి వస్తారు. ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మునేరులో జల్లు స్నానాలు, పలు చోట్ల చేతి పంపులు, షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులకు శుద్ధి చేసిన తాగు నీరు పంపిణీ చేయనున్నారు.

అఖండ జ్యోతి స్థాపన

మార్చి ఏడో తేదీ ఉదయం 5.59 గంటలకు అఖండ జ్యోతి స్థాపనతో చిన్న తిరునాళ్లు మొదలవుతాయి. వేలాదిగా భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో మొక్కులు తీర్చుకుంటారు.

గ్రామోత్సవం

తిరునాళ్లలో రెండో రోజైన మార్చి ఎనిమిదో తేదీ రాత్రి 6.01 గంటలకు తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఉత్సవమూర్తులను రథంపై ప్రతిష్ఠించి రథోత్సవం (గ్రామోత్సవం) నిర్వహిస్తారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కనుల పండువగా జరిగే ఈ వేడుకలో భక్తులు వేలాదిగా పాల్గొంటారు.

పసుపు, కుంకుమ బండ్లు

చిన్న తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన అమ్మ వారి పుట్టింటి పసుపు–కుంకుమ బండ్లు మార్చి తొమ్మిదో తేదీన అనిగండ్లపాడు గ్రామం నుంచి సాయంత్రం 6.04 గంటలకు బయలుదేరి వస్తాయి. అమ్మవారి పుట్టింటి వంశీకులు కొల్లా శ్రీనివాసరావు ఇంటి నుంచి ఏటా పసుపు, కుంకుమను బండ్లపై తీసుకు రావటం ఆనవాయితీగా వస్తోంది. గ్రామానికి చెందిన వారు వందల బండ్లతో పసుపు, కుంకుమ బండి వెంట పెనుగంచిప్రోలు ఆలయానికి చేరుకుంటారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు లక్షల్లో భక్తులు వస్తారు.

దివ్య ప్రభోత్సవం

ఉత్సవాల్లో నాల్గో రోజైన మార్చి పదో తేదీ రాత్రి 8.26 గంటలకు దివ్య ప్రభోత్సవం వైభవంగా జరగనుంది. 90 అడుగుల ఎత్తయిన దివ్యప్రభపై ఉత్సవ మూర్తులను ఉంచి ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయిస్తారు.

బోనాల సమర్పణ

మార్చి 11వ తేదీన భక్తుల బోనాల సమర్పణతో చిన్న తిరునాళ్ల ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి



చిన్న తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం ఎన్నో ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రత్యేకంగా క్యూలైన్లు, బారికేడ్లు, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాట్లు ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో చేస్తున్నాం. మునేరులో జల్లు స్నానాలు, తలనీలాలు తీసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవాలు జరిగే ఐదు రోజులూ ఆలయం వద్ద రాత్రి సమయంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

– జి.వి.డి.ఎన్.లీలాకుమార్, ఆలయ ఈఓ

కమనీయం.. గిరిజా కల్యాణం




విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ వేదికపై ప్రఖ్యాత నాట్యాచారిణి డాక్టర్ వనజాఉదయ్ బృందం ప్రదర్శించిన గిరిజా కల్యాణం నృత్య రూపకం ఆద్యంతం కమనీయంగా సాగింది. గిరిజా దేవిగా వనజాఉదయ్, పరమశివుడిగా డాక్టర్ విజయపాల్, మన్మథుడిగా చక్రవర్తి, రతీదేవిగా ఐశ్వర్య నర్తించగా ఆచార్య భాగవతుల సేతురామన్ నృత్య దర్శకత్వం వహించారు.

– విజయవాడ కల్చరల్

ఎన్నెస్పీ జలాల విడుదలకు వినతి

నూజివీడు: నూజివీడు డివిజన్ పరిధిలోని ఎన్నెస్పీ జోన్–3కి షెడ్యూల్ ప్రకారం సాగర్‌జలాలు విడుదల చేయాలని కోరుతూ ఏపీకి చెందిన ఎన్నెస్పీ అధికారులు మంగళవారం ఖమ్మం వెళ్లి అక్కడి అధికారులతో చర్చించారు. ఏపీకి చెందిన ఎన్నెస్పీ ఎస్ఈ రామకృష్ణ, నూజివీడు ఈఈ అప్పారావు, జగ్గయ్యపేట ఈఈ శ్రీనివాస్, నూజివీడు, విస్సన్నపేట, తిరువూరు, మైలవరం డీఈలు సాగునీటి ఆవశ్యకతను వివరించారు. జోన్–3 కింద ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, మైలవరం, నందిగామ నియోజకవర్గాలు, ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోజకవర్గం వస్తుందని, ఈ ప్రాంతంలో రైతులు మొక్కజొన్న, ఇతర ఆరుతడి పంటలు సాగు చేయడంతో పాటు మామిడి పిందె దశలో ఉన్నందున సాగునీటి అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. దీనిలో భాగంగా రెండో జోన్ మానిటరింగ్ ఈఈ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అధికారులు స్పందిస్తూ జోన్–1 పరిధిలోని నల్గొండ, సూర్యాపేట ప్రాంతాల్లోనే అధికంగా సాగర్‌జలాలను వాడుతున్నారని, పాలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 15 అడుగులు మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. నీటి నిల్వలను 20 అడుగులకు పెంచి విడుదల చేస్తేనే మూడోజోన్‌కు సాగర్‌జలాలు వస్తాయన్నారు.

రైతు భరోసా.. సాగు ధిలాసా



రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వసంత కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, కలెక్టర్ ఢిల్లీరావు, దేవినేని అవినాష్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు

- ఎన్టీఆర్ జిల్లాలో 1,34,338 మంది లబ్ధిదారులు
- రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.29.33 కోట్ల జమ
- రూరల్ మండల రైతులకు రూ.18.82 లక్షల పెట్టుబడి రాయితీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): రైతులకు అండగా నిలుస్తామని ఇచ్చిన మాట మేరకు వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తూ రైతు సంక్షేమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో వైఎస్సార్ రైతు భరోసా మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాల ద్వారా లబ్ధిని నేరుగా రైతుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని రైతు భరోసా కేంద్రం నుంచి వీక్షించిన అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు ప్రసంగించారు. జిల్లాలో 1,34,338 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.29.33 కోట్ల జమచేశామని తెలిపారు. విజయవాడ రూరల్ మండల రైతులకు రూ.18.82 లక్షల పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందజేశామన్నారు. సొంత వ్యవసాయ భూమి కలిగిన రైతులతోపాటు అటవీ భూములు సాగు చేసుకుంటున్న వారు, కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకాన్ని వర్తింపు చేస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీచేశారు.

రైతు బాంధవుడు సీఎం జగన్

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. రైతులకు సహాయం చేస్తే సమాజానికి చేసినట్లేనని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం నాటినప్పటి నుంచి పంట విక్రయించే వరకు రైతులను చేయిపట్టి నడిపిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ

ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను ఈ–క్రాప్ విధానంలో నమోదు చేసి, ఏవైనా విపత్తులు సంభవించి పంట దెబ్బతింటే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లిస్తోందన్నారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీని సకాలంలో రైతులకు అందజేస్తున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ, ఉచిత పంట బీమా, ఉచిత వ్యవసాయ విద్యుత్, సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధి సహాయం అందిస్తూ రైతులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు.

సీజన్ ముగిసేలోపే నష్ట పరిహారం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. గతంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పరిహారం కోసం రైతులు ఎదురు చూడాల్సి వచ్చేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే రైతులకు నేరుగా పరిహారం అందుతోందని వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను గుర్తించిన ఇతర రాష్ట్రాల ప్రతినిధులు వాటిని సందర్శించి కొనియాడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నాగిరెడ్డి, గొల్లపూడి ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, గొల్లపూడి సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకట్రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పి.గౌతంరెడ్డి, అడపా శేషు, తోలేటి శ్రీకాంత్, మాదు శివరామకృష్ణ, తాతినేని పద్మావతి, టి.జమలపూర్ణమ్మ, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయభారతి, జిల్లా హార్టికల్చర్ అధికారి బాలాజీకుమార్, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, తహసీల్దార్ జాహ్నవి, ఎంపీడీఓ బి.భార్గవి తదితరులు పాల్గొన్నారు.

● చిలకలపూడి(మచిలీపట్నం): గిరిజనుల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఎం. ఫణిదూర్జటి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు 2022-23 సంవత్సరానికి ఈ పథకం కోసం కొత్తగా ప్రతిపాదనలు ఉంటే www.ngo.tribal.gov.in పోర్టల్‌లో ఈ నెల 12వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9502082159లో సంప్రదించాలన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్

(భారత ప్రభుత్వ రంగ సంస్థ) .....విశ్వాసానికి మరోపేరు

సర్కిల్ శాస్త్రా సెంటర్
#27-33-40, మొదటి అంతస్థు, గూడవల్లి వారి వీధి, బీసెంట్ రోడ్ క్రాస్, గవర్నర్‌పేట, విజయవాడ - 520002.
ఫోన్: 0866-2571633, 2571634, ఇ-మెయిల్: cs8332@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జీలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారి / సెక్యూర్డు క్రెడిటార్ స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ సదరు ఋణగ్రహీత(లు), హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

ఋణగ్రహీత పేరు / బ్యాంకుకు మొత్తం బకాయిలు : మెస్సర్స్ సాయి వైష్ణవి ట్రేడింగ్స్, మేనేజింగ్ పార్టనర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నవారు : శ్రీ భవనం చంద్రశేఖర్ రెడ్డి, పార్టనర్ : శ్రీమతి దాకారపు పార్వతి, (ఖాతా నెం.4242008700001107 & 424200IL0000036) హామీదారు : శ్రీ భవనం చంద్రశేఖర్ రెడ్డి, శ్రీమతి దాకారపు పార్వతి, శ్రీమతి నిమ్మగడ్డ భూలక్ష్మి, శ్రీ నలకుర్తి ఇమ్మానుయేల్ బాబు, శ్రీ బవటూరి జయరామ్, శ్రీమల్లూరి శ్రీనివాస్, శ్రీమతి మల్లూరి రాజేశ్వరి, శ్రీమతి కట్టా స్వరాజ్యం బ్రాంచ్ ఆఫీస్ : శ్రీనగర్ కాలనీ - 424200

డిమాండ్ నోటీసు తేది : 29-09-2021 ప్రకారం తేది.08-06-2021 (ఎన్‌పిఏ తేది) నాటికి బకాయి రూ.5,36,10,724.51 పై. (అక్షరాల ఐదు కోట్ల ముప్పై ఆరు లక్షల పది వేల ఏడు వందల ఇరవై నాలుగు రూపాయల యాభై ఒక్క పైసలు మాత్రమే) మరియు తేది.01-06-2021 నుండి తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలు మరియు ఇతర ఖర్చులు (డిమాండ్ నోటీసు తరువాత ఏవైనా చెల్లింపు ఉన్న యెడల మినహాయించబడును). లాంఛనాత్మక స్వాధీనతా తేది : 07.12.2021

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 16.03.2023, సాయంత్రం 4 గం॥ల లోపు	బిడ్ పెంపుదల మొత్తం రూ.10,000/-

ఇ-వేలం తేది, సమయం 17-03-2023 ఉ॥ గం॥ 11.00 నుండి మ॥ గం॥ 2.00 వరకు

సెక్యూరిటీ / ఆస్తి వివరాలు మరియు ఆస్తి యజమాని/తనఖాపెట్టిన వ్యక్తి పేరు	రిజర్వు ధర రూ.	బయానా (ఇఎమ్‌డి)
శ్రీ మల్లూరి శ్రీనివాస్ మరియు శ్రీమతి మల్లూరి రాజేశ్వరి గార్ల పేరున గల ఆస్తి : **ఐటమ్ నెం.1 :** ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, నూజివీడు, ద్వారకా రోడ్, రెవెన్యూ వార్డు నెం. 25, ఆర్.యస్.నెం.460/1, ప్రస్తుత సబ్-డివిజన్ ఆర్.యస్.నెం.460/6 లోని సమీప డి.నెం.25-117, క్రొత్త డి.నెం.25-229/1 వద్ద 3767.80 చ.గ.లు మొత్తం విస్తీర్ణంలో 52.95 చ.గ.లకు సమానమైన 44.22 చ.మీ.లు విస్తీర్ణం గాగల అవిభాజ్యపు మరియు అనిర్దేశపు ఉమ్మడిగా ఏర్పడిన ఆస్తినకు **హద్దులు : తూర్పు :** శ్రీ మాదివేని నరసింహారావు గారికి అమ్మబడిన ఆస్తి, **దక్షిణం :** 30.00 అ.లు వెడల్పు మున్సిపల్ రోడ్డు కొరకు కొంతమేర మరియు ఐంబియాజ్ బేగం గారి ఆస్తి కొంతమేర, **పడమర :** యస్.యస్.పి.యొక్క ఆస్తి, **ఉత్తరం :** శ్రీ యనమదల వెంకట నరసింహారావు గారి ఆస్తి. **ఐటమ్ నెం.2 :** ఐటమ్‌నెం.1లో తెలిపిన 3767.80 చ.గ.లు విస్తీర్ణంలో గంధర్వ అపార్ట్‌మెంట్స్ అనుపేరు తో నిర్మించిన నిర్మాణము నందు బి-బ్లాకు, 3వ అంతస్థులో, 1025 చ.అ.లు ఫ్లింత్ ఏరియా మరియు కామన్ ఏరియాతో కలిపి స్టిల్ట్ ఫ్లోర్ నందు కేటాయించిన పార్కింగ్ ఏరియాతో గల అన్ని యూజిమెంటరీ హక్కులతో సహా ఉన్న నివాసిత ఫ్లాటు నెం.409 అమ్మకపు దస్తావేజు నెం.8692/2014, తేది.21-11-2014 ప్రకారం యావత్తు ఆస్తినకు **హద్దులు : తూర్పు :** కారిడార్, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, లిఫ్ట్ & ఫ్లాటు నెం.410, **ఉత్తరం :** శ్రీ యనమదల వెంకట నరసింహారావు గారి ఆస్తి.	రూ. 23.70 లక్షలు	రూ. 2.37 లక్షలు
శ్రీమతి కట్టా స్వరాజ్యం గారి పేరున డాక్యుమెంట్ నెం.608/1985, తేది.09-04-1985 ప్రకారం గల ఆస్తి : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, అసెస్‌మెంట్ నెం.5372, ప్రస్తుత సబ్-డివిజన్ ఆర్.యస్.నెం.514/1, డి.నెం.13-264 వద్ద డి.నెం.514/1 లోని ఎ.0.06-3/4 సెంట్లు నివాసిత ఆస్తిగా ఏర్పడిన దానికి సమానమైన 326.70 చ.గ.లు విస్తీర్ణము గల స్థలములో ఉన్న ఆర్‌సిసి రెసిడెన్షియల్ భవనము యావదాస్తినకు **హద్దులు : తూర్పు :** శ్రీ దొడ్డపనేని గారి భూమి, **దక్షిణం :** నాగార్జున సాగర్ కెనాల్, **పడమర :** 24.00 అ.లు కాలనీ రోడ్డు, **ఉత్తరం :** ఇతరుల ఆస్తి.	రూ. 31.40 లక్షలు	రూ. 3.14 లక్షలు
శ్రీ నల్లకుర్తి ఇమ్మానుయేల్ బాబు గారి పేరున డాక్యుమెంట్‌నెం.4950/2019, తేది.22-10-2019 ప్రకారం గల ఆస్తి : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, కేతనకొండ గ్రామం & గ్రామ పంచాయితీ, ఆర్.యస్.నెం.437, అసెస్‌మెంట్ నెం.1039, డి.నెం.6-39 లోని 208.80 చ.గ.లు విస్తీర్ణం నివాసిత ఆస్తిగా ఏర్పడిన స్థలము నందలి పార్కింగ్ కొరకు స్టిల్ట్, గ్రౌండ్, మొదటి, రెండవ మరియు మూడవ అంతస్థులతో కూడిన ఆర్‌సిసి రెసిడెన్షియల్ భవనము యావదాస్తినకు **హద్దులు : తూర్పు :** పంచాయితీ రోడ్డు, **పడమర :** షేక్ జాఫ్ గారి ఆస్తి, **ఉత్తరం :** శ్రీ పట్టాన్ బికారీ గారి ఆస్తి, **దక్షిణం :** శ్రీ షేక్ మహమ్మద్ సాహెబ్ గారి ఆస్తి.	రూ. 67.80 లక్షలు	రూ. 6.78 లక్షలు
శ్రీ బవటూరి జయరామ్ గారి పేరున డాక్యుమెంట్ నెం.5675/2013, తేది.24-12-2013 ప్రకారం గల ఆస్తి : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, బొమ్మలూరు గ్రామ పంచాయితీ, గంగాధరపురం గ్రామం, ఆర్.యస్.నెం.6/3 లోని ప్లాటు నెం.10 (తూర్పు భాగము) నందు 157.75 (135.90 చ.మీ.లు) విస్తీర్ణం నివాసిత ఆస్తిగా ఏర్పడిన స్థలము నందలి డి.నెం.4-11-4ఎ తో గల క్రింద మరియు మొదటి అంతస్థులతో కూడిన ఆర్‌సిసి రెసిడెన్షియల్ భవనము గా గల యావదాస్తినకు **హద్దులు : తూర్పు :** 24.00 అ.లు వెడల్పు రోడ్డు, **దక్షిణం :** ప్లాటు నెం.11, **పడమర :** శ్రీమతి త్రిపురనేని లక్ష్మి గారి యొక్క ఆస్తి, **ఉత్తరం :** ప్లాటు నెం.9.	రూ. 32.00 లక్షలు	రూ. 3.20 లక్షలు

ఇ-వేలం నియమ నిబంధనలు :
1. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తెలిపిన తదుపరి నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2. ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై' విక్రయించబడతాయి.
3. అధీకృత అధికారి గారి వద్దగల షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరములమేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4. అమ్మకం ఇ-వేలం పోర్టల్ http://www.mstcecommerce.com ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.17-03-2023, ఉదయం గం.11-00 ల నుండి మధ్యాహ్నం గం.2-00 ల వరకు నిర్వహించెదరు.
5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://www.ibapi.in , https://eprocure.gov.in/epublish/app, http://www.mstcecommerce.com/ , www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

తేది : 28-02-2023
ప్రదేశం : విజయవాడ

సర్ఫేసి చట్టం 2002 లోని రూలు 8(6) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

సం/-అధీకృత అధికారి,
పంజాబ్ నేషనల్ బ్యాంక్

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

జగ్గయ్యపేట అర్బన్: సామినేని వెంకట మల్లిఖార్జున ప్రసాద్(ఎస్‌వీఎం ప్రసాద్) మెమోరియల్ రాష్ట్ర స్థాయి మహిళా ఆహ్వాన కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల ప్రాంగణంలో రెండో రోజు పోటీల్లో జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఫ్లడ్ లైట్ల వెలుగులో మొత్తం తొమ్మిది లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. వీటిల్లో కృష్ణా, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లా జట్లు గెలిచి సెమీస్ చేరాయి. బుధవారం ఈ పోటీలకు సంబంధించిన సెమీస్, ఫైనల్స్ జరగనున్నాయి. అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా హాజరై, విజేతకు ట్రోఫీ అందజేస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రకటించారు.

యువ వైద్యులకు ఆదర్శం డాక్టర్ విఠల్‌రావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నేటితరం యువ వైద్యులకు డాక్టర్ విఠల్‌రావు ఆదర్శంగా నిలిచారని పలువురు వైద్యులు కొనియాడారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ మంగళవారం పదవీ విరమణ చేసిన డాక్టర్ సత్తా శ్రీనివాస విఠల్‌రావును పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు ప్రభుత్వ వైద్యునిగా కొనసాగిన డాక్టర్ విఠల్‌రావు వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేశారన్నారు. సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా 8 నెలల పాటే పనిచేసినప్పటికీ తనదైన ముద్ర వేశారన్నారు. వైద్య కళాశాలకు 70కి పైగా పోస్టు గాడ్యుయేషన్ సీట్లు తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావును అభినందించిన వారిలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. సౌభాగ్యలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ యు. శోభ, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ కె. అప్పారావు, ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ రవి, గవర్నమెంట్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.



డాక్టర్ విఠల్‌రావును సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

కొత్త ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుధాకర్



సిద్ధార్థ వైద్య కళాశాల కొత్త ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కంచర్ల సుధాకర్ నియమితులయ్యారు. ప్రస్తుతం గుంటూరు వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఆయనను పూర్తి అదనపు బాధ్యతలతో(ఎఫ్ఏసీ) నియమిస్తూ రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు మంగళవారం పదవీ విరమణ చేయడంతో ఆయన నుంచి డాక్టర్ కంచర్ల సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు. సిద్ధార్థ వైద్య కళాశాలలో దీర్ఘకాలం పాటు పని చేసిన డాక్టర్ కంచర్ల సుధాకర్ గతంలో కొంత కాలం ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు. ఇక్కడి నుంచి 2019లో గుంటూరు బదిలీపై వెళ్లిన ఆయన అక్కడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా కూడా కొంతకాలం పనిచేశారు. కోవిడ్ సమయంలో కోవిడ్ కంట్రోల్‌రూమ్‌లో ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యునిగా విశేష సేవలు అందించారు.

తల్లిపై కత్తితో దాడి చేసిన ఎక్సైజ్ కానిస్టేబుల్

వెల్లుర్తిపాడు(పెనుగంచిప్రోలు): ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి తన తల్లిపై కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని వెల్లుర్తిపాడు గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చావలి వెంకట్రావమ్మకు నలుగురు సంతానం. వారిలో రెండో వాడైన నాగమల్లేశ్వరరావు జగ్గయ్యపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో తన తల్లి వెంకట్రావమ్మకు పుట్టింటి నుంచి ఆస్తిగా వచ్చిన డబ్బును తనకు పంచమని అడిగాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరగటంతో తనతో తెచ్చుకున్న కత్తితో తల్లిపై దాడి చేశాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు నాగమల్లేశ్వరరావుపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఇంజినీర్ మృతి

పెనమలూరు: కానూరు సిరీస్ వద్ద మంగళవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఇంజినీర్ దుర్మరణం చెందాడు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌టీపీసీలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేసి రిటైర్ అయిన కాట్రగడ్డ రామకృష్ణారావు (81) పప్పులుమిల్లు వద్ద యమునా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. అతనికి భార్య పార్వతీ ఉండగా ఇద్దరు పిల్లలు విదేశాల్లో ఉన్నారు. కాగా రామకృష్ణారావు ప్రతిరోజు ఉదయం 4 గంటలకు వాకింగ్‌కు వెళ్తాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కానూరు సిరీస్ వెనక రోడ్డులో వాకింగ్ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఆయనను ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో రామకృష్ణారావుకు తీవ్ర గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రికవరి ఆఫీసర్ వారి కార్యాలయం-II
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం,
31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530 020
ఫోన్ నెం.0891-2957045, ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com

PROCLAMATION OF SALE-CUM-E-AUCTION SALE NOTICE

(ఆదాయపన్ను చట్టం 1961 యొక్క 2వ షెడ్యూలు రూల్ 52(2) చూడుము)
ఆర్.పి. నెం. 160/2018లో ఒ.ఎ.నెం. 685/2015

1. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఇ-ఆంధ్రాబ్యాంక్), లబ్బీపేట బ్రాంచ్, విజయవాడ వెర్సస్ మెసర్స్ అగ్రిగోల్డ్ ఫుడ్స్ & ఫామ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ & ఇతరులు మరియు ఒ.ఎ.నెం. 685/2015 పకు సంబంధించి [illegible] 1993 యొక్క సబ్ సెక్షన్ (22), సెక్షన్ 19 పరిధిలో [illegible] డెట్స్ రికవరి ట్రిబ్యునల్, విశాఖపట్నం వారిచే రికవరి సర్టిఫికెట్ తేది. 05-01-2018న జారీచేయబడినది [illegible].
2. రికవరి సర్టిఫికెట్‌లో సూచించిన ఆర్.పి.నెం. 160/2018 నందలి ఆదేశముల ప్రకారం రూ॥ 77,70,70,376.45 పైసలు (టి/ఎల్ రూ॥ 2,59,82,517.60 వడ్డీ @15.25% p.a. మరియు OCC లోన్ రూ॥ 75,10,87,858.85 పైసలు వడ్డీ @15.50% p.a.) 21.09.2015 నుండి నెలవారీ వడ్డీతో రికవరీ సర్టిఫికెట్ మరియు వడ్డీ, ఖర్చు మరియు ఇతర ఖర్చులు, [illegible] వసూలు చేయబడును.

(CD 1) మెసర్స్ అగ్రిగోల్డ్ ఫుడ్స్ & ఫామ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ : డోర్ నెం. 40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సామశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010.
(CD 2) శ్రీ వెంకట రామారావు అవ్వా, ఛైర్మన్ / డైరెక్టర్, తండ్రి శ్రీ ఎ.వెంకట [illegible] (లేటు) డోర్ నెం. 40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సామశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010.
(CD 3) శ్రీమతి KAM Tal, డైరెక్టర్, భర్త శ్రీ వెంకట రామారావు అవ్వా, డి.నెం. 23-35-39, [illegible] వీధి, [illegible] లక్ష్మీనగర్, విజయవాడ-520001.
(CD 4) మెసర్స్ అగ్రిగోల్డ్ ఫామ్ ఎస్టేట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ డోర్ నెం. 40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సామశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010.
(CD 5) మెసర్స్ కమ్యూనికేషన్ నెక్ట్స్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్, కొత్త నెం.5, పాత నెం. 43, [illegible], 2వ వీధి, [illegible], చెన్నై - 600032. [illegible], డైరెక్టర్ : శ్రీ [illegible]
(CD 6) మెసర్స్ [illegible] కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, కొత్త నెం.5, పాత నెం. 43, [illegible], 2వ వీధి, [illegible], చెన్నై - 600032. [illegible], డైరెక్టర్ : శ్రీ ఎ. వెంకటేశ్వరరావు.

3. రూ॥ 177,49,02,297.33 పైసలు (తేది. 20-09-2015 వరకు లెక్కించబడిన వడ్డీ మరియు ఖర్చులు) తేది.20-09-2015 నాటికి రికవరి ప్రొసీడింగ్స్‌లో [illegible] వడ్డీ, ఖర్చులు మొదలైనవి.
4. సర్టిఫికెట్ డెటార్లకు చెందిన షెడ్యూలు ఆస్తులు, క్రింది తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ ఏర్పాటుచేసిన వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంచే రికవరి సర్టిఫికెట్ [illegible] విక్రయించబడును. [illegible]

బిడ్ సమర్పించుటకు ఆఖరి తేది. 05-04-2023, సా॥ 4.00 గం॥ల వరకు, వేలం తేది. 10-04-2023

షెడ్యూలు	ఆస్తి యొక్క విస్తీర్ణం	రిజర్వు ధర (రూ॥లలో)	ధరావత్తు (రూ॥లలో)	బిడ్ పెంపుదల మొత్తం	వేలం సమయం*
షెడ్యూలు - ఏ యొక్క ఐటమ్ నెం.1	1170.16 చ॥గ॥ల (ప్లాన్ ప్రకారం 899.42 చ॥గ॥లు) విస్తీర్ణంలో ఆర్‌సిసి భవనం, ఏసిసి షీట్ షెడ్	4,25,00,000/-	42,50,000/-	1,00,000/-	ఉ॥11.00 నుండి మ॥12.00 గం॥ల వరకు
షెడ్యూలు-ఏ యొక్క ఐటమ్ నెం.లు 2 నుండి 7	ఎకరా 3.37 సెంట్లలో ఆర్‌సిసి భవనం, ఏసి షీట్ షెడ్స్‌తో కూడిన వ్యవసాయేతర భూమి	16,50,00,000/-	1,65,00,000/-	5,00,000/-	
షెడ్యూలు-ఏ యొక్క ఐటమ్ నెం.లు 8 & 9	ఎకరా 9.40 సెంట్ల వ్యవసాయేతర భూమి	2,05,00,000/-	20,50,000/-	1,00,000/-	
షెడ్యూలు-ఏ యొక్క ఐటమ్ నెం.10	ఎకరా 13.55 సెంట్ల వ్యవసాయేతర భూమి	3,00,00,000/-	30,00,000/-	1,00,000/-	

* ఇ-వేలం సమయం : ప్రతిసారి 5 నిముషాలు ఆటో ఎక్స్‌టెన్షన్ విధానంలో పొడిగించబడుతుంది. అనగా ఇ-వేలం సమయం ముగిసేముందు బిడ్ వేసినట్లయితే, వేలం సమయం 5 నిముషాలు పొడిగించబడుతుంది.

5. సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం నందు పాల్గొనవలసిందిగా ప్రజలను ఆహ్వానించడమైనది. సర్వీస్ ప్రొవైడర్ వివరములు : మెసర్స్ సీ1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించవలసిన వ్యక్తి : శ్రీ ధరణికృష్ణ, సంప్రదించవలసిన నెం. 9948182222, ఇ-మెయిల్ ఐడి : andhra@c1india.com
6. ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొన్నవారు ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనలు, పూర్తి వివరాలు కొరకు వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా పరిశీలించవలసినదిగాను మరియు బిడ్ ఫారములు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం నందు పాల్గొనుటకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్ సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ కొరకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవలసినదిగా సలహా సూచించడమైనది.
7. వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గలవారు బయానా మొత్తమును RTGS/NEFT/Funds బదిలీ విధానం ద్వారా అకౌంట్ నెం. 060811100004173, అకౌంట్ పేరు : అధీకృత అధికారి, బ్యాంక్ & బ్రాంచ్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచ్, IFSC కోడ్ UBIN080081 అకౌంట్‌నకు జమ అగునట్లు చెల్లించి, [illegible] 06-04-2023 సా॥ 04.00 లకు లేదా అలోగా చేరునట్లు రిజిస్టర్డు పోస్టు / స్పీడు పోస్టు/ కొరియర్ ద్వారా పంపవలెను. [illegible]
8. వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగలవారు ఏదేని వివరములు, షెడ్యూలు ఆస్తి తనిఖీ, టైటిల్ డీడ్స్ మరియు [illegible] సర్టిఫికెట్ కాపీలను పరిశీలించుటకు వేలం వివరాలు తెలుసుకొనుటకు శ్రీ కె.హైదారావు, విజయమ్ (మొబైల్ నెం.8074858053, ల్యాండ్ లైన్ 0891-2537792) ఇ-మెయిల్ ఐడి : ubin0817295@unionbankofindia.bank వారిని సంప్రదించవలసినదిగా కోరడమైనది. [illegible]

ఆస్తి వివరములు : షెడ్యూలు-ఏ : ఐటమ్ నెం.1 : [illegible] 1170.17 చ॥గ॥ల ఆర్‌సిసి భవనం, ఏసిసి షీట్ షెడ్ మెసర్స్ అగ్రి గోల్డ్ ఫుడ్స్ & ఫామ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (పూర్వం మెసర్స్ అగ్రి గోల్డ్ ఫామ్ లిమిటెడ్) కు చెందినది. హద్దులు :
(i) 1170.17 చ॥గ॥లతో కూడినది : (ఎ) 166.66 చ॥గ॥లు : తూర్పు : విజయవాడ- నూజివీడు హైవే రోడ్, దక్షిణం : [illegible] గారికి చెందిన ఆస్తి, పడమర : ఐటమ్ నెం. 2 ఆస్తి, ఉత్తరం : [illegible]
(బి) 731.70 చ॥గ॥లు : తూర్పు : ఐటమ్ నెం.1 ఆస్తి, దక్షిణం : [illegible] గారికి చెందిన ఆస్తి, పడమర : [illegible], ఉత్తరం : [illegible]
(సి) 271.80 చ॥గ॥లు : తూర్పు : విజయవాడ- నూజివీడు హైవే రోడ్, దక్షిణం : ఐటమ్ నెం.2 ఆస్తి కొంతభాగం మరియు ఐటమ్ నెం.1 ఆస్తి కొంతభాగం, పడమర : [illegible], ఉత్తరం : [illegible]
(ii) ఫ్లాట్ నెం.1 జి.ఎఫ్, డాక్యుమెంట్ నెం. 1693/2000, తేది.31-03-2000
ఆస్తి ఐటమ్ : గ్రౌండ్ ఫ్లోర్ ఫ్లాట్ నెం.1 : తూర్పు : కామన్ పాసేజ్, దక్షిణం : కామన్ పాసేజ్, పడమర : ఫ్లాట్ నెం.2, ఉత్తరం : కామన్ పాసేజ్.
(iii) ఫ్లాట్ నెం.2 జి.ఎఫ్, డాక్యుమెంట్ నెం. 1666/2000, తేది.30-03-2000 : గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నెం. 2 : తూర్పు : ఫ్లాట్ నెం. 1 మరియు పాసేజ్, దక్షిణం : కామన్ పాసేజ్, పడమర : ఫ్లాట్ నెం. 3, ఉత్తరం : కామన్ పాసేజ్.
(iv) ఫ్లాట్ నెం.3 జి.ఎఫ్, డాక్యుమెంట్ నెం. 1639/2000, తేది.29-03-2000 : ఆస్తి ఐటమ్: గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం.3 : తూర్పు : మెట్ల మార్గం, దక్షిణం : కామన్ పాసేజ్, పడమర : కామన్ పాసేజ్, ఉత్తరం : కామన్ పాసేజ్.
(v) ఫ్లాట్ నెం.1 ఎఫ్.ఎఫ్, డాక్యుమెంట్ నెం. 1792/2000, తేది.07-04-2000 : ఆస్తి ఐటమ్: మొదటి అంతస్థులోని ఫ్లాట్ నెం.1 : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఫ్లాట్ నెం.2, ఉత్తరం : ఓపెన్ టు స్కై.
(vi) ఫ్లాట్ నెం.2 ఎఫ్.ఎఫ్, డాక్యుమెంట్ నెం. 1730/2000, తేది.04-03-2000 : ఆస్తి ఐటమ్: మొదటి అంతస్థులోని ఫ్లాట్ నెం.2 : తూర్పు : కామన్ పాసేజ్ & మెట్లు, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై.
(vii) ఫ్లాట్ నెం.1 ఎస్.ఎఫ్, డాక్యుమెంట్ నెం. 1862/2000, తేది.11-04-2000 : ఆస్తి ఐటమ్: రెండవ అంతస్థులోని ఫ్లాట్ నెం.2 : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఫ్లాట్ నెం.2, ఉత్తరం : ఓపెన్ టు స్కై.
(viii) ఫ్లాట్ నెం.2 ఎస్.ఎఫ్, డాక్యుమెంట్ నెం. 1835/2000, తేది.10-04-2000 : ఆస్తి ఐటమ్: రెండవ అంతస్థులోని ఫ్లాట్ నెం.2 : తూర్పు : ఫ్లాట్ నెం.1 మరియు మెట్లు, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఫ్లాట్ నెం.2, ఉత్తరం : ఓపెన్ టు స్కై.

ఐటమ్ నెం. 2 : రిజిస్టర్డు క్రయదస్తావేజు నెం. 2630/2001, తేది. 31-07-2001 ఐటమ్ నెం. ఎ : కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, సూరంపల్లి గ్రామం & పంచాయితీ, ఆర్.యస్ నెం. 370/1, 370/2, 370/3, 370/4, 370/5 వద్ద మొత్తం ఎకరా 4.14 సెంట్లలలో ఎకరా 3.37 సెంట్ల వ్యవసాయేతర భూమి & ఆర్‌సిసి భవనం, ఏసిసి షీట్ షెడ్స్ మెసర్స్ అగ్రిగోల్డ్ ఫుడ్స్ & ఫామ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (పూర్వం అగ్రిగోల్డ్ ఫామ్స్ లిమిటెడ్)కు చెందినది. హద్దులు : మొత్తం 0.61 సెంట్లు : (i) ఎకరా 0.27 సెంట్లు : [illegible]
(ii) ఎకరా 0.34 సెంట్లు : [illegible]

ఐటమ్ నెం. 3 : రిజిస్టర్డు క్రయదస్తావేజు నెం. 2631/2001, తేది. 31-07-2001 ఐటమ్ నెం. ఎ : కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, సూరంపల్లి గ్రామం & పంచాయితీ, ఆర్.యస్ నెం. 370/2, 370/3, 370/4 వద్ద ఎకరా 1.13 సెంట్లు వ్యవసాయేతర భూమి & ఆర్‌సిసి భవనం, [illegible]. హద్దులు : మొత్తం ఎకరా 1.13 సెంట్లు : (i) ఎకరా 0.27 సెంట్లు : [illegible]
(ii) ఎకరా 0.52 సెంట్లు : [illegible]
(iii) ఎకరా 0.34 సెంట్లు : [illegible]

ఐటమ్ నెం. 4 : రిజిస్టర్డు క్రయదస్తావేజు నెం. 2632/2001, తేది. 31-07-2001 ఐటమ్ నెం. ఎ : కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, సూరంపల్లి గ్రామం & పంచాయితీ, ఆర్.యస్ నెం. 370/3 వద్ద ఎకరా 0.52 సెంట్లు భూమి & ఆర్‌సిసి భవనం, [illegible]. హద్దులు : మొత్తం ఎకరా 0.52 సెంట్లు : (i) ఎకరా 0.52 సెంట్లు : [illegible]

ఐటమ్ నెం. 5 : రిజిస్టర్డు క్రయదస్తావేజు నెం. 2633/2001, తేది. 31-07-2001 ఐటమ్ నెం. ఎ : కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, సూరంపల్లి గ్రామం & పంచాయితీ, ఆర్.యస్ నెం. 370/2, 370/4 వద్ద మొత్తం ఎకరా 4.14 సెంట్లలలో ఎకరా 3.37 సెంట్ల [illegible]. హద్దులు : మొత్తం 0.61 సెంట్లు : (i) ఎకరా 0.52 సెంట్లు : [illegible]
(ii) ఎకరా 0.34 సెంట్లు : [illegible]

ఐటమ్ నెం. 6 : రిజిస్టర్డు క్రయదస్తావేజు నెం. 2634/2001, తేది. 31-07-2001 ఐటమ్ నెం. ఎ : కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, సూరంపల్లి గ్రామం & పంచాయితీ, ఆర్.యస్ నెం. 370/2, 370/4 వద్ద మొత్తం ఎకరా 4.14 సెంట్లలలో ఎకరా 3.37 సెంట్ల [illegible]. హద్దులు : మొత్తం ఎకరా 0.61 సెంట్లు : (i) ఎకరా 0.27 సెంట్లు : [illegible]
(ii) ఎకరా 0.34 సెంట్లు : [illegible]

ఐటమ్ నెం. 7 : రిజిస్టర్డు క్రయదస్తావేజు నెం. 2087/2005, తేది. 21-04-2005 ఐటమ్ నెం. ఎ : కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, సూరంపల్లి గ్రామం & పంచాయితీ, ఆర్.యస్ నెం. 370/1, 370/5 వద్ద మొత్తం ఎకరా 4.14 సెంట్లలలో ఎకరా 3.37 సెంట్ల భూమి & ఆర్‌సిసి భవనం, [illegible]. హద్దులు : మొత్తం ఎకరా 1.79 సెంట్లు : (i) ఎకరా 0.48 సెంట్లు : [illegible]
(ii) ఎకరా 1.31 సెంట్లు : [illegible]
దస్తావేజుల ప్రకారం ఐటమ్ నెం. 2 నుండి 7 వరకు మొత్తం విస్తీర్ణం ఎకరా 5.27 సెంట్లు. కాని ఆందుబాటులో ఉన్న వాస్తవ విస్తీర్ణం ఎకరా 3.37 సెంట్లు

ఐటమ్ నెం. 8 : టైటిల్ డీడ్ నెం. 1780/2009, తేది. 16-07-2009 డిఫెండెంట్ నెం.6కు చెందిన ఆస్తి, కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కీసర గ్రామం & పంచాయితీ, అగ్రిగోల్డ్ ఫామ్స్ దగ్గర సర్వే నెం. 66/1 వద్ద మొత్తం ఎకరా 14.84 సెంట్లలో ఎకరా 9.40 సెంట్లు [illegible]

ఐటమ్ నెం. 9 : టైటిల్ డీడ్ నెం. 1781/2009, తేది. 16-07-2009 డిఫెండెంట్ నెం.6కు చెందిన ఆస్తి, కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కీసర గ్రామం & పంచాయితీ, అగ్రిగోల్డ్ ఫామ్స్ దగ్గర సర్వే నెం. 66/1 వద్ద మొత్తం ఎకరా 14.84 సెంట్లలో ఎకరా 9.40 సెంట్లు [illegible]

ఐటమ్ నెం. 10 : టైటిల్ డీడ్ నెం. 5553/2007, తేది. 25-08-2007 కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కీసర గ్రామం & పంచాయితీ, అగ్రిగోల్డ్ ఫామ్స్ దగ్గర సర్వే నెం. 64/1, 68/4 మరియు 69/2 వద్ద మొత్తం ఎకరా 15.05 సెంట్ల వ్యవసాయేతర భూమి మెసర్స్ కమ్యూనికేషన్ నెక్ట్స్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ డిఫెండెంట్ నెం.5కు చెందినది. [illegible]

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద 17 ఫిబ్రవరి, 2023న జారీచేయడమైనది.)

(బి.ఎస్.ఎస్.ఎ.ఎస్.కె.బంగార్రాజు)
రికవరి ఆఫీసర్-II
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc. ✆ 99493 08940

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888

■ సంప్ర. సెల్: 79977 89771, బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. (100% జెన్యూన్)

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడను. సంప్ర: 9603055647, 7995392747

PEST CONTROL

■ మహిమ పెస్ట్ కంట్రోల్: వాసనలేని, మరకలుపడని కెమికల్స్‌తో 5 సం॥ గ్యారంటీతో చెదలు నివారించు సంస్థ. ✆ 9494 960 415, 9494 960 674

WANTED

■ Wanted Telecallers and Executives in ICICI Bank Personal Loans DSA, Salary: 10,000/- +. Contact: ✆ 95335 44440.

■ MS Office, DTP, Photoshop, Tally సబ్జెక్టులు బోధించుటకు కంప్యూటర్ ఫ్యాకల్టీ కావలెను. విజన్ కంప్యూటర్స్, ఉయ్యూరు. ✆ 98853 48743.

■ Wanted HR Admin, Telecallers in VJA & Gosala. Q: Degree, Sal: 10,000 to 15,000/- + Incentives, Bonus. Office Timings: 9am-6pm. ✆ 97035 45777.

■ ఎలక్ట్రీషియన్స్ మరియు హెల్పర్స్ కావలెను. వయస్సు: 18-30 సం॥లోపు, హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. సంప్ర: ✆ 83329 45498

■ ప్రముఖ బ్యాంకు అనుబంధ సంస్థలో లోన్స్ DEPTలో పనిచేయుటకు అనుభవజ్ఞులైన లేడీ టెలీకాలర్స్ కావలెను. ఏజ్ : 18+, Q: ఇంటర్+, శాలరీ ఫిక్స్‌డ్+Inc. ✆ 79894 92700, 95423 66373

■ ప్రముఖ బ్యాంక్ సంస్థలో పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్ కావలెను. జీతం : 10K-15K+ ఇన్సెంటివ్స్, సంప్ర : ✆ 96764 44985, 96764 44705

■ IOCL పెట్రోల్ బంక్ నందు 8 గం॥/12 గం॥ పనిచేయుటకు సేల్స్ పర్సన్స్ కావలెను. పైలెట్ సర్వీసు స్టేషన్, MG Road, G.Pet, VJA-2 ✆ 94412 49912, 92463 75420

■ విజయవాడ, బందర్‌రోడ్‌లో పనిచేయుటకు హౌస్ కీపింగ్ లేడీస్ కావలెను. డ్యూటీ 10 గం॥, జీతం: 10,000/-, 4 వీక్లీ ఆఫ్‌లు కలవు. ✆ 75694 53744

■ ఆకాశ ఎయిర్‌లైన్స్‌లో వర్క్ చేయుటకు ఎయిర్ క్యాబిన్ సూపర్‌వైజర్స్, టీం లీడర్స్, సూపర్‌వైజర్స్, కస్టమర్‌కేర్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. Qly: 10th-డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, జీతం: 23,000/- To 29,000/- రూం + ఫుడ్ ఫ్రీ. వ: 18-35 సం॥. ✆ 88850 17934

■ అనుభవం గల క్వాలిఫైడ్ నర్సులు-1 (ANM/GNM), పున్నమ్మ ఫిజియోథెరపీ హాస్పిటల్ నందు పని చేయుటకు కావలెను. అడ్రస్: 29-26-44, జగదంబారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2 ✆ 98852 22525

■ కంకిపాడు సమీపంలో సెక్యూరిటీ గార్డ్స్‌గా పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 8 గం॥, జీతం: 12,000/- ✆ 95020 64738

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) మరియు Female టెలీకాలర్స్ కావలెను ✆ 95509 77677

■ VJAలో ప్రముఖ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో పని చేయుటకు ఎడ్యుకేషన్ కౌన్సిలర్స్, ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్స్ కావలెను. వయస్సు: 26 పై, అర్హత: డిగ్రీ, జీతం: 15 వేలు - 25 వేలు ✆ 73375 06998

■ నందిగామ దగ్గర కొణకంచి నందు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గంటల డ్యూటీ, 9250/- జీతం, ఫ్రీ రూం, ✆ 86884 17132, 90143 51804

■ విజయవాడ సిటీలో డెమో స్టాల్స్‌లో MA LED TV's ప్రమోట్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ M/F కావలెను. జీ॥ 12 - 18K + ఇన్సెంటివ్స్ + రూమ్ ఫ్రీ. ✆ 77029 07407

■ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ బాయ్స్, లేడీ అకౌంటెంట్, ఫోటో షాప్ డిజైనర్ కావలెను. ✆ 9246474837

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15 వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉంటూ పార్ట్‌టైమ్/ఒక గంట చేతివ్రాత ద్వారా పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్. ✆ 7702473949

■ ఇంటిపని చేయుటకు ఆడమనిషి కావలెను. గుంటూరులో శాఖాహారులు ఇంట్లోనే ఉండి ఇంటి పనిచేయుటకు ఏ బాదరబందీలేని ఒంటరి మహిళ కావలెను. తెలుగు చదవటం, వ్రాయటం వచ్చి ఉండవలెను. ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పించబడును. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరములకై సంప్రదించవలసిన ఫోన్ నెం: 9010298252

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశేతంగా పరిశీలించిన పిదప ప్రత్యేకం నిర్ధారించుకోవాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రెండు కేజీల గంజాయి పట్టివేత

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ పుట్టరోడ్డులో ఇద్దరు గంజాయి విక్రేతలను మంగళవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీన్ని పటమట పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరుకు చెందిన బనవాసి సుమంత్, పోలిమెట్ల సందీప్ తాపీ పని చేస్తుంటారు. మద్యంలో చెడు అలవాటుకు బానిసలై గంజాయి అమ్ముతున్నట్టు పోలీసులు చెప్పారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్సై శాతకర్ణి చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు



పటమట(విజయవాడతూర్పు): టైలర్స్ డేను 14వ డివిజన్ పటమట రజక కల్యాణ మండపంలో మంగళవారం నవ్యాంధ్ర పటమట టైలర్స్ – వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించించారు. ముఖ్యఅతిథి వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలర్లకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంవత్సరానికి 10 వేలు ఆర్థిక చేయడం, వారి సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో పటమట టైలర్ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి, స్థలం కోసం అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేయడానికి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కన్నా వెంకటేశ్వరరావు, బాబా వలి, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, రాంబాబు, శెటికం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ భక్తులకు మరిన్ని వసతులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అండగా ఉంటుందని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణను నగరంలోని ఆయన నివాసంలో దుర్గగుడి చైర్మన్, పాలక మండలి సభ్యులు మంగళవారం కలిశారు. తొలుత మంత్రికి చైర్మన్ రాంబాబు పుష్పగుచ్ఛం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేయగా, శాలువా కప్పి పాలక మండలి సభ్యులు సత్కరించారు. సోమవారం దేవస్థాన పాలక మండలి తొలి సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను, పలు అంశాలను చైర్మన్ కర్నాటి రాంబాబు మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు మల్లెల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ డైమండ్స్ ఆధ్వర్యాన మణిపాల్ హాస్పిటల్ వారితో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు జరిగాయి. ఆమె మాట్లాడుతూ మహిళల్లో క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స చేయడానికి ఇలాంటి శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ప్రత్యేక వాహనంలో పరీక్షలు నిర్వహించారు. సుమారు 60 మంది మహిళలకు రూ.4 లక్షలు విలువ చేసే పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ డైమండ్స్ సభ్యులు, మాచవరం వాకర్స్ తదితరులు పాల్గొన్నారు

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని అతిథులు విద్యార్థులకు సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం జమ్మిచెట్టు సెంటర్‌లోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ హైస్కూల్ (బీఎస్‌ఆర్‌కే) ఆవరణలో సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. ముఖ్యఅతిథి ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు మాట్లాడుతూ ప్రాక్టికల్స్ చేస్తే పాఠాలు బాగా గుర్తుంటాయని చెప్పారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ తమ పాఠశాలలో 6 నుంచి 10 వ తరగతి విద్యార్థులు 80 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారన్నారు. స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి పాల్గొన్నారు.

పట్టుదలతో విజయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): పట్టుదలతో జీవితంలో విజయం సాధించవచ్చని కృష్ణా విశ్వ విద్యాలయం ఉపకులపతి కె.రామ్మోహనరావు అన్నారు. సైన్స్ డే పురస్కరించుకుని కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఐక్యూఏసీ, ఫార్మాస్యుటికల్ ఎనాలసిస్ విభాగం ఆధ్వర్యాన మంగళవారం సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీవీ రామన్ విద్యాభ్యాసం, పరిశోధనల తీరు ఆంధ్రరాష్ట్రంతో ఆయనకు ఉన్న బంధాన్ని వివరించారు. మరో అతిథి హిందూ కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భవిష్యత్తులో సైన్స్‌లో జరిగే విప్లవాత్మక మార్పులను, వాటితో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు చేయాల్సిన కృషిని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత తదితరులు పాల్గొన్నారు.

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని పలు ప్రాంతాల్లో సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పటమట నిర్మల కాన్వెంట్‌లో సైన్స్ ఎక్స్‌పో జరిగింది. మాజీ ప్రిన్సిపాల్ నాన్సీ డిసౌజా విద్యార్థులకు సైన్స్ ప్రాధాన్యాన్ని వివరించారు. జీవ వైవిధ్య పరిరక్షణ, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, కాలుష్య నివారణ వంటి అంశాలపై చిన్నారులు ప్రదర్శించిన ప్రయోగాలు, మానవ అవయవా పని తీరు, సేంద్రియ వ్యవసాయం, వర్షం నీటి వినియోగం తదితర అంశాలపై చేసిన ప్రదర్శనలను అభినందించారు. సాయంత్రం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిబీ ఆంటోనీ, సహాయ ప్రిన్సిపాల్ మేరీ మాగ్దలీన్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



బీఎస్‌ఆర్‌కే హైస్కూల్ ఆవరణలో సైన్స్ ఎగ్జిబిషన్‌లో అంశాలు



నిర్మల స్కూల్లో సైన్స్ ఎక్స్‌పో



కేయూ వీసీ రామ్మోహనరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు



గోరా సైన్స్ సెంటర్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ హరిహరన్

నాస్తిక కేంద్రంలో..

పటమటలోని గోరా సైన్స్ సెంటర్‌లో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవంలో యూనివర్సిటీ ఆఫ్ వెస్టిండీస్ ప్రొఫెసర్ డాక్టర్ హరిహరన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) రాజ్యమేలుతుందని ఇలాంటి ఆవిష్కరణలన్నీ మానవ మస్తిష్కం నుంచే జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత, డాక్టర్ జి. సమరం, డాక్టర్ మారు, డాక్టర్ జగతి గోరా, సురేఖ పాల్గొన్నారు.

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరురోడ్డు మారుతీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ ఆవరణలో సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. దేవినేని అవినాష్ హాజరై సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుజన, ఈజీఎం మురళీకృష్ణ, అసిస్టెంట్ ఏజీఎం రాజేష్, వెంకట శివ, రామారావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళా పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, వారి ఆర్థిక స్వావలంబనకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అండగా నిలిచారని లబ్ధిదారులు కొనియాడారు. రాణిగారితోట18వ డివిజన్ 84 వార్డు సచివాలయం పరిధిలోని మాదంశెట్టి సీతయ్య వీధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఆయన 369 గడపలను సందర్శించి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. స్థానికురాలు మల్లీశ్వరి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మఒడి వంటి పథకాలతో ఆర్థిక లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేశారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడారు. అవినాష్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సిఫార్సు మేరకు పథకాలు అందేవని, అవి కూడా ఆ పార్టీ వారికి మాత్రమే ఇచ్చేవారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాదంశెట్టి సీతయ్య వీధిలో స్థానికురాలితో మాట్లాడుతున్న అవినాష్

మహిళా ఉద్యోగులను వేధించిన అకౌంటెంట్ సరెండర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళా ఉద్యోగులతో అసభ్యంగా ప్రవర్తించిన ప్రభుత్వాస్పత్రి పరిపాలనా విభాగం అకౌంటెంట్‌ను రాజమండి రీజినల్ డైరెక్టర్(ఆర్డీ)కార్యాలయానికి సరెండర్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. పరిపాలనా విభాగంలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న కేవీ ప్రసాద్ ఆ విభాగంలోని మహిళా ఉద్యోగినులతో అనుచితంగా ప్రవర్తించడంపై ఓ ఉద్యోగిని రెండు నెలల క్రితం ఆస్పత్రి అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనతో పాటు మహిళా ఉద్యోగినులతో అదేవిధంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి ఐదుగురు సభ్యులతో విచారణకు ఆదేశించారు. ఆ సభ్యుల కమిటీ ముందు బాధితులు తమను ఎలా వేధించారో తెలపగా, అకౌంటెంట్ విచారణకు హాజరు కాలేదు. మూడు సార్లు నోటీసులు ఇవ్వగా, ఆ తేదీల్లో సెలవుపెట్టి వెళ్లిపోయాడు. నాలుగోసారి విచారణకు హాజరు కావాలని చెప్పగా, సంతకం పెట్టి వెళ్లిపోయాడు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనతో మహిళా ఉద్యోగులతో అనుచితంగా ప్రవర్తించిన అకౌంటెంట్ కేవీ ప్రసాద్‌ను ఆర్డీకి సరెండర్ చేస్తూ ఆదేశాలు ఇచ్చినట్లు సూపరింటెండెంట్ సౌభాగ్యలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు.

గాడిచర్ల జీవితం యువతకు ఆదర్శం

పటమట(విజయవాడతూర్పు): గ్రంథాలయాలు, వయోజన విద్యాకేంద్రాలు స్థాపించి సమాజాభివృద్ధికి కృషి చేసిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు జీవితం నేటి యువతకు ఆదర్శమని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు పి. కిరణ్ అన్నారు. ఆంధ్రాతిలక్‌గా పేరొందిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు 63వ వర్ధంతి మంగళవారం సర్వోత్తమ భవన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ వందేమాతరం, ఆంధ్రోద్యమం తదితర ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని వివరించారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ కల్కురా ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాహితీవేత్త కొప్పర్తి రాంబాబు, ఏపీ గాంధీ స్మారక నిధి కార్యదర్శి వై. రామచంద్రరావు, శారద కళాసమితి అధ్యక్షులు శంకరరావు, సాహితీ వేత్త గుమ్మా సాంబశివరావు, ఏపీ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి రావి శారద పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమాచార శాఖ సంయుక్త సంచాలకుడు కిరణ్

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దాసాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం సిందూరం, ఆకు పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కార్యక్రమాలను ఈట నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం, భవానీపురం ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్కిల్-1 పరిధిలోని 41వ డివిజన్‌లో ముస్లిం బరియల్ గ్రౌండ్ చుట్టూ నిర్మించిన ప్రహరీ, 39వ డివిజన్ పరిధిలోని గుప్తా సెంటర్‌లో నిర్మించిన రైతుబజార్ భవనాన్ని, 46వ డివిజన్ కేఎల్‌రావునగర్‌లోగల దోబీఘానాను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉంటేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఏఈఈ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య వైభవం.. గిరిజా కల్యాణం..



సిద్ధార్థ కళావేదికపై రమణీయం.. గిరిజా కల్యాణం..

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం(సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ) నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలోని వేదికపై మంగళవారం నాట్యాచారిణి డాక్టర్ వనజా ఉదయ్ బృందం ప్రదర్శించిన గిరిజా కల్యాణం నృత్య రూపకం శాస్త్రీయ నృత్య వైభవాన్ని చాటింది.

సతీ వియోగంతో పరమేశ్వరుడు తపస్సు చేయడం, ఆయనకు సపర్యలు చేయడానికి గిరిజను.. హిమవంతుడు నియమించడం తదితర అంశాలతో నృత్య రూపకం సాగుతుంది. నృత్య దర్శకత్వం భాగవతుల సేతురామన్, గిరిజా దేవిగా డాక్టర్ వనజా ఉదయ్, పరమశివునిగా డాక్టర్ విజయపాల్, మన్మథుడిగా చక్రవర్తి, రతీదేవిగా ఐశ్వర్య నర్తించారు. నట్టువాంగం ఆచార్య భాగవతుల సేతురామన్, గాత్రం కన్నారావు, శారదా రెడ్డి, మృదంగంతో ఎస్. నాగేశ్వరరావు సహకరించారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, లలిత్ ప్రసాద్, రమేష్, వెల్లంకి నాగభూషణరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): భక్తులు, దాతల సహకారంతో ముత్యాలంపాడు సాయిబాబా మందిరాన్ని ఆంధ్ర షిర్డీగా తీర్చిదిద్దామని మందిర గౌరవాధ్యక్షులు పూనూరు గౌతంరెడ్డి అన్నారు. ముత్యాలంపాడు బాబా మందిరంలో మంగళవారం నిత్యాన్నదానానికి దాత ముప్పా ఇంద్రకీల గిరీష్, వీరవెంకట శ్రావ్య రూ.లక్ష విరాళాన్ని గౌతంరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనులకు జరిమానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): వీఎంసీ సర్కిల్-1 కార్యాలయంలో ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టును భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి రామమోహన్ మంగళవారం నిర్వహించారు. సర్కిల్-1 కార్యాలయ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై వివిధ డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 40 కేసులకు సంబంధించిన వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఆయా కేసుల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులు, పశువులను రోడ్లపైకి వదిలివేసే వారు, రోడ్లపై చెత్త వేసేవారికి న్యాయమూర్తి రూ.20,510 జరిమానా విధించారు.

దుర్గగుడిలో మనీ సర్క్యులేషన్ స్కీం కలకలం!

లాటరీ, డ్రాల పేరిట డబ్బు వసూలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో మనీ సర్క్యులేషన్ స్కీమ్‌ల కలకలం రేగింది. దేవస్థానంలో ఎన్ఎంఆర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి కొంత కాలంగా ఆలయంలోని సిబ్బంది, ఎన్ఎంఆర్‌లు, కాంట్రాక్టు సిబ్బందిని ఈ స్కీమ్‌లో సభ్యులుగా చేర్పించాడు. ఒక్కొక్కరి నుంచి వారానికి రూ.30 చొప్పున వసూలు చేస్తూ వందలాది మందిని సభ్యులుగా చేర్పించినట్లు తెలుస్తోంది. తొలి వారం రూ.30 చెల్లిస్తే, రెండో వారం రూ. 60 చెల్లించేలా ఈ స్కీమ్‌ను 30 వారాల పాటు నిర్వహిస్తున్నాడు. వారం వారం లక్కీ డ్రాలో ఒక్కొక్కరికి 20 గ్రాముల వెండి కుంకుమ భరిణ, కుక్కర్ ఇలా అనేక వస్తువులు ఇస్తున్నట్లు , స్కీమ్ చివరి వరకు ఉన్న వారికి భారీ బహుమతుల పేరిట ప్రచారం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం మంగళవారం ఆలయంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇటువంటి స్కీమ్ ఏమైనా నిర్వహించారా.. సభ్యులందరికీ డబ్బులు చెల్లించారా, లేదా ఏదైనా ఇబ్బంది ఎదురైందా అనే దిశగా దర్యాప్తు జరుగుతోంది. మరో వైపున ఇటువంటి స్కీమ్‌లను ఆలయంలో నిర్వహించడం పద్ధతి కాదని ఆలయ అధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

అనధికార నిర్మాణం కూల్చివేత



పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ నుంచి అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తే కూల్చేస్తామని వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ జీవీవీఎస్వీ ప్రసాద్ మంగళవారం హెచ్చరించారు. సత్యనారాయణపురం శ్రీనగర్ కాలనీలోని 5వ లైనులోని, డోర్ నం 21-10/5-15/2లో జీప్లస్‌త్రీకి అనుమతి పొంది నిర్మాణం మొదలుపెట్టారని తెలిపారు. ప్లాన్ కంటే అదనంగా మరో ఫ్లోర్ నిర్మిస్తుండటంతో వీఎంసీకి ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ పర్యవేక్షణలో, స్థానిక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సారథ్యంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, అక్రమ నిర్మూలన దళంతో అదనపు అంతస్తు కూల్చివేశామని తెలిపారు. కొంతమంది బిల్డర్లు మార్టిగేజ్ విడుదల కాకుండానే భవనాల్లో ప్లాట్ల అమ్మకాలు చేపట్టారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో వీఎంసీ నుంచి మార్టిగేజ్ విడుదలైనట్లు ధ్రువీకరణ ఉంటేనే ప్లాట్లు కొనుగోలు చేయాలని వివరించారు. నగర వాసులు భవన నిర్మాణ పనులకు ప్లాను అనుమతి పొందాలని తెలిపారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ ఈస్ట్ :
99122 20539, 90101 31135
Office mail : sakshiads@gmail.com

రికవరి ఆఫీసర్ వారి కార్యాలయం-II

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్

ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం,

31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530 020

ఫోన్ నెం.0891-2957045, ఇ-మెయిల్ : ro2.drtvpatnam@gmail.com

PROCLAMATION OF SALE-CUM-E-AUCTION SALE NOTICE

(ఆదాయపన్ను చట్టం 1961 యొక్క 2వ షెడ్యూలు రూల్ 52(2) చూడుము)

ఆర్.పి. నెం. 723/2017లో ఒ.ఎ.నెం. 686/2015

1. **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఇ-ఆంధ్రాబ్యాంక్), లబ్బీపేట బ్రాంచ్, విజయవాడ వెర్సస్ మెసర్స్ అగ్రిగోల్డ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ & ఇతరులు మరియు** మధ్యనున్న ఒ.ఎ.నెం. 686/2015 నకు సంబంధించి బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ సంస్థలు ఋణబకాయిల వసూలు చట్టం 1993 యొక్క సబ్ సెక్షన్ (22), సెక్షన్ 19 పరిధిలో మహారాజశ్రీ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారిచే రికవరీ సర్టిఫికెట్ **తేది. 04-12-2017**న జారీచేయబడినది మరియు దానిని అమలుపరచు నిమిత్తం క్రింద సంతకం దారునికి పంపబడినది.

2. ఆర్.పి.నెం. 723/2017 నందు సూచించిన ప్రొసీడింగ్స్ ప్రకారం ఈ దిగువ పేర్కొన్న సర్టిఫికెట్ ఋణగ్రహీతల నుండి రూ॥ **117,49,02,297.33 పై॥ (Rs. 6,05,85,877.33** పైబలు సంవత్సరానికి @15.75% వడ్డీతో పాటు పెరిగిన వడ్డీ రేటు సంవత్సరానికి 2% చొప్పున నెలవారి ముగింపుతో, రూ॥ 11,17,63,270/- సంవత్సరానికి @15.25% వడ్డీతో పాటు పెరిగిన వడ్డీ రేటు సంవత్సరానికి 2% చొప్పున నెలవారి ముగింపుతో, రూ॥ 76,93,84,644/- సంవత్సరానికి @15.50% వడ్డీతోపాటు పెరిగిన వడ్డీ రేటు సంవత్సరానికి 2% చొప్పున నెలవారీ ముగింపుతో, రూ॥ 23,31,68,506/- సంవత్సరానికి @14.75% వడ్డీతోపాటు పెరిగిన వడ్డీ రేటు సంవత్సరానికి 2% చొప్పున నెలవారీ ముగింపుతో) 21-09-2015 నుండి నెలవారీ వడ్డీతో రికవరీ సర్టిఫికెట్ మరియు వడ్డీ, కాస్ట్లు మరియు ఇతర ఖర్చులు, మొదలైనవి ఈ దిగువ ఋణగ్రహీతలనుండి తిరిగి వసూలు చేయబడును.

(CD 1) **మెసర్స్ అగ్రిగోల్డ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, కార్పొరేట్ ఆఫీస్ :** డోర్ నెం. 40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సోమశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010. మేనేజింగ్ డైరెక్టర్.

(CD 2) **శ్రీ వెంకట రామారావు అవ్వ,** చైర్మన్ / డైరెక్టర్, మెసర్స్ అగ్రిగోల్డ్ ప్రాజెక్ట్స్, తండ్రి లేటు ఎ.వెంకటప్పారావు, డోర్ నెం. 40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సోమశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010.

(CD 3) **శ్రీ ఎ.ఉదయ భాస్కరరావు,** మేనేజింగ్ డైరెక్టర్ - హామీదారు, తండ్రి లేటు ఎ.వెంకటప్పారావు, డి.నెం. 23-35-40, ఎఎస్‌రావు వీధి, ఎస్‌బిఐ లక్ష్మీనగర్, విజయవాడ-520011.

(CD 4) **శ్రీ ఎ.సీతారామారావు,** డైరెక్టర్ /హామీదారు, తండ్రి లేటు ఎ.వెంకటప్పారావు, డి.నెం. 6-3-680/ఎ/బి, ఠాకూర్ మాన్షన్ లేన్, సోమాజిగూడ సర్కిల్ దగ్గర, పంజాగుట్ట, హైదరాబాద్-500082.

(CD 5) **శ్రీ ఎవిఎస్ఎస్ రావు,** డైరెక్టర్ /హామీదారు, తండ్రి లేటు ఎ.వెంకటప్పారావు, డి.నెం. 23-35-39, ఎఎస్‌రావు వీధి, ఎస్‌బిఐ లక్ష్మీనగర్, విజయవాడ-520011.

(CD 6) **శ్రీఏవి శివరాం** డైరెక్టర్ /హామీదారు, తండ్రి లేటు ఎ.వెంకటప్పారావు, డి.నెం. 6-3-680/ఎ/బి, ఠాకూర్ మాన్షన్ లేన్, సోమాజిగూడ సర్కిల్ దగ్గర, పంజాగుట్ట, హైదరాబాద్-500082.

(CD 7) **శ్రీ వెంకట ప్రగడ సత్య వెంకట కనక దుర్గా ప్రసాద్,** డైరెక్టర్ /హామీదారు, తండ్రి లేటు ఎ.వెంకటప్పారావు, డి.నెం. 20-6-152, చల్లా కాంతారావు వీధి, రామలింగేశ్వరరావుపేట, మూడవ లేన్, విజయవాడ-520003.

(CD 8) **మెసర్స్ రిత్విక్ ఎనర్జీ లిమిటెడ్,** డైరెక్టర్, శ్రీ ఎ.ఉదయ భాస్కరరావు (కార్పొరేట్ గ్యారంటార్), డోర్ నం.40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సోమశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010.

(CD 9) **మెసర్స్ ఫ్లోరియన్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్,** మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ ఎ.ఉదయ భాస్కరరావు (కార్పొరేట్ గ్యారంటార్), డోర్ నం.40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సోమశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010.

(CD 10) **మెసర్స్ అగ్రిగోల్డ్ ఎక్జిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్,** మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ ఏ.వి.ఎన్. శర్మ (కార్పొరేట్ గ్యారంటార్), 40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సోమశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010.

(CD 11) **మెసర్స్ డ్రీమ్‌ల్యాండ్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్,** డైరెక్టర్, శ్రీ ఏ.వి. రామారావు (కార్పొరేట్ గ్యారంటార్), ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సోమశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010.

(CD 12) **మెసర్స్ అగ్రిగోల్డ్ ఫామ్ ఎస్టేట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,** మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ ఏ.వి.ఎస్.ఎస్. రావు (కార్పొరేట్ గ్యారంటార్), అగ్రిగోల్డ్ టవర్స్, 6-3-680/ఎ/బి, ఠాకూర్ మాన్షన్ లేన్, సోమాజిగూడ సర్కిల్ దగ్గర, హైదరాబాద్-500082.

(CD 13) **మెసర్స్ సాయి రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్,** డైరెక్టర్, శ్రీ ఎ.ఉదయ భాస్కరరావు (కార్పొరేట్ గ్యారంటార్), డోర్ నం.40-6-3, ప్లాట్ నెం.6, నిమ్మగడ్డ సోమశంకర రావు వీధి, పాత రెవెన్యూ కాలనీ, లబ్బీపేట, విజయవాడ-520010.

3. రూ॥ **177,49,02,297.33** పైసలు (**తేది. 20-09-2015** వరకు లెక్కించబడిన వడ్డీ మరియు ఖర్చులు) **తేది.20-09-2015** నాటికి రికవరీ ప్రొసీడింగ్స్‌లో భవిష్య వడ్డీ, ఖర్చులు మొదలైనవి.

4. సర్టిఫికెట్ డెటార్స్‌కు చెందిన షెడ్యూలు ఆస్తులు, క్రింది తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ ఏర్పరిచిన వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంచే రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు విక్రయించుటకు నిర్ణయించడమైనది. వేలం తేది, బిడ్‌ఫామ్ దాఖలు చేయు ఆఖరితేదీ, రిజర్వుధర, బయానా, బిడ్ పెంపు మొత్తం వేలం సమయం ప్రతి ఐటమ్/షెడ్యూలు దిగువ సూచించడమైనది.

బిడ్ సమర్పించుటకు ఆఖరి తేది. 12-04-2023, సా॥ 4.00 గం॥ల వరకు, వేలం తేది. 14-04-2023

షెడ్యూలు	ఆస్తి యొక్క విస్తీర్ణం	రిజర్వు ధర (రూ॥లలో)	ధరావత్తు (రూ॥లలో)	బిడ్ పెంపుదల మొత్తం	వేలం సమయం*
షెడ్యూలు - సి యొక్క ఐటమ్ నెం.22	1391.95 చ॥గు॥ల విస్తీర్ణం కలిగిన కమర్షియల్ భవనం	15,50,00,000/-	1,55,00,000/-	5,00,000/-	ఉ॥11.00 నుండి మ॥12.00 గం॥ ల వరకు
షెడ్యూలు - సి యొక్క ఐటమ్ నెం.23	1483 చ॥గు॥ల విస్తీర్ణం కలిగిన కమర్షియల్ భవనం	13,00,00,000/-	1,30,00,000/-	5,00,000/-	మ॥12.00 గం॥ల నుండి మ॥01.00 గం॥ వరకు

* ఇ-వేలం సమయం : ప్రతిసారి 5 నిముషాలు ఆటో ఎక్స్‌టెన్షన్ విధానంలో పొడిగించబడుతుంది. అనగా ఇ-వేలం సమయం ముగిసేముందు బిడ్ వేసినట్లయితే, వేలం సమయం 5 నిముషాలు పొడిగించబడుతుంది.

5. సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం నందు పాల్గొనవలసిందిగా ప్రజలను ఆహ్వానించడమైనది. **సర్వీస్ ప్రొవైడర్ వివరములు** : మెసర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించవలసిన వ్యక్తి : **శ్రీ ధరణీకృష్ణ, సంప్రదించవలసిన నెం. 9948182222, ఇ-మెయిల్ ఐడి : andhra@c1india.com**

6. ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొన్నవారు ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనలు, పూర్తి వివరాలు కొరకు వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** ద్వారా పరిశీలించవలసినదిగాను మరియు బిడ్‌ఫారమ్‌లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం నందు పాల్గొనుటకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్ సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ కొరకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవలసినదిగా సలహా సూచించడమైనది.

7. వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గలవారు బయాన మొత్తమును RTGS/NEFT/Funds బదిలీ విధానం ద్వారా అకౌంట్ నెం. **06081100004173, అకౌంట్ పేరు : అధీకృత అధికారి, బ్యాంక్ & బ్రాంచ్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచ్, IFSC** కోడ్ **UBIN080081** అకౌంట్‌నకు జమ అగునట్లు చెల్లించి, మరియు పైన పట్టికలో తెలిపిన ఆఖరు తేదీ లేదా ఆలోగా అవసరమైన వివరాలతో అనగా బయాన డిపాజిట్ రుజువు, పాన్ కార్డు, చిరునామా & ఐడి రుజువులను బిడ్ ఫారంలతో దాఖలు చేయాలి మరియు భర్తీ చేసిన బిడ్ ఫారం హార్డ్ కాపీని పై డాక్యుమెంట్ల స్వయం ధృవీకృత కాపీలను జతపరచి క్రింది సంతకం దారునికి 13-04-2023 సా॥ 04.00 లకు లేదా ఆలోగా చేరునట్లు రిజిస్టర్డు పోస్టు / స్పీడు పోస్టు/ కొరియర్ ద్వారా పంపవలెను. పోస్టల్ జాప్యములు పరిశీలించబడవు.

8. వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగలవారు ఏదేని విచారణలు, షెడ్యూలు ఆస్తి తనిఖీ, టైటిల్ డీడ్స్ మరియు ఋణాఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికెట్ కాపీలను పరిశీలించటం వేలం వివరాలు తెలుసుకొనుటకు శ్రీ కె.సైదారావు, ఏజియమ్ (**మొబైల్ నెం.8074858053,** ల్యాండ్ లైన్ **0891-2537792**) ఇ-మెయిల్ ఐడి : **ubin0817295@unionbankofindia.bank** వారిని సంప్రదించవలసినదిగా కోరడమైనది. **బ్యాంక్ యొక్క బ్రాంచ్ హెడ్ / అధీకృత అధికారి ఆస్తి మరియు సంబంధిత టైటిల్ డీడ్ పత్రాలను విజయవంతమైన బిడ్డరుకు అందజేస్తారు.**

ఆస్తి వివరములు : షెడ్యూలు-సి : ఐటమ్ నెం.22 : విజయవాడ, బీసెంట్ రోడ్, గాంధీనగర్, మల్లికార్జునరావు వీధి, అసెస్‌మెంట్ నెం.107776,107777, 107778, 107779, 107780, డోర్ నెం. 14-20-27 కలిగిన మొత్తం 1421.59 చ॥గు॥ల ఆస్తి CD-12 కు చెందినది. రిజిష్టర్డు క్రయదస్తావేజు నెం. 6434/2010, తేది. 22-12-2010 డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, విజయవాడ, కృష్ణా జిల్లా. ఈ క్రింది రెండు భాగాలుగా కలిగి ఉన్నది.

పార్టు-1 : విజయవాడ, గాంధీనగర్, ఎన్.టి.ఎస్ నెం.941/1 (పార్టు), రెవెన్యూ వార్డు నెం. 8, మున్సిపల్ వార్డు నెం. 17, బ్లాక్ నెం.31 కలిగిన 1283.21 చ॥గు॥ల విస్తీర్ణంలో కమర్షియల్ భవనం ఆస్తి. **హద్దులు :** తూర్పు : పార్టు-2 ఇక్కడ ఆస్తి & పి.ఆర్.జనరల్ స్టోర్ యొక్క ఆస్తి, దక్షిణం : శ్రీ ఎస్.రవిప్రసాద్ శ్రీపాద హోటల్ ఆస్తి, పడమర : డా॥ మల్లికార్జున వీధి, ఉత్తరం : బీసెంట్ రోడ్.

పార్టు-2 : విజయవాడ, గాంధీనగర్, ఎన్.టి.ఎస్ నెం.941/1 (పార్టు), రెవెన్యూ వార్డు నెం. 8, మున్సిపల్ వార్డు నెం. 17, బ్లాక్ నెం.31 కలిగిన 138.38 చ॥గు॥ల విస్తీర్ణంలో కమర్షియల్ భవనం ఆస్తి. **హద్దులు :** తూర్పు : పి.ఆర్.జనరల్ స్టోర్ యొక్క ఆస్తి 52', దక్షిణం : శ్రీ ఎస్.రవిప్రసాద్ శ్రీపాద హోటల్ ఆస్తి 23'6", పడమర :పార్టు-1 ఇక్కడ ఆస్తి54', ఉత్తరం : పి.ఆర్.జనరల్ స్టోర్ యొక్క ఆస్తి, 23'6"

అందుబాటులో ఉన్న అసలు విస్తీర్ణం 1391.95 చ॥గు॥లు

ఐటమ్ నెం.23 : విజయవాడ, గాంధీనగర్, ఆంధ్రరత్నరోడ్, ఎన్‌టిఎస్ నెం. 771, మున్సిపల్ వార్డు నెం. 10, రెవెన్యూ వార్డు నెం. 8, బ్లాక్ నెం.28, కొత్త అసెస్‌మెంట్ నెం.111169, డోర్ నెం. 26-2-28ఎ, కలిగిన సెల్లార్, గ్రౌండ్ మరియు మొదటి అంతస్తుతో కూడిన 1483 చ॥గు॥ల కమర్షియల్ భవనం కాంప్లెక్స్ CD-11 కు చెందినది. రిజిష్టర్డు క్రయదస్తావేజు నెం. 6431/2007, తేది. 16-07-2007 డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, విజయవాడ, కృష్ణా జిల్లా. హద్దులు : ఉత్తరం : ఆంధ్ర రత్న రోడ్, దక్షిణం : సాంబమూర్తి రోడ్, తూర్పు : టి.రాఘవయ్య ఇతరులకు అమ్మిన ఆస్తి, పడమర: రామ్ అవ్వాస్ రీసార్ట్స్ & హోటల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఆస్తి.

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద 20 ఫిబ్రవరి, 2023న జారీచేయడమైనది.)

(బి.ఎస్.ఎస్.వి.ఎస్.కె.బంగార్రాజు)
రికవరి ఆఫీసర్-II
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

క్లుప్తంగా...

కేంద్రమంత్రి గడ్కరీతో ఎంపీ విజయసాయిరెడ్డి భేటీ

- ఎన్‌హెచ్‌–16లో అభివృద్ధిపై చర్చ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర జాతీయ రహదారులు, రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. ఎన్‌హెచ్ 16లో రహదారుల అభివృద్ధిపై చర్చించారు. కేంద్రమంత్రిని శాలువాతో సత్కరించి తిరుమల శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు."ఏపీ ప్రతినిధుల బృందంతో కేంద్రమంత్రి గడ్కరీతో సమావేశమయ్యాం. భోగాపురం వయా రుషికొండ, భీమిలి వద్ద ఎన్‌హెచ్16లో వైజాగ్ పోర్టు కంటైనర్ టెర్మినల్ కలిపే ఆరు లేన్ల కోస్టల్ హైవే అభివృద్ధిపై చర్చించాం"అని ఎంపీ విజయసాయిరెడ్డి మంగళవారం ట్వీట్ చేశారు.

డ్రగ్స్ వినియోగంపై నిఘా పెంచాలి

- మహిళా,శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి రవిచంద్ర

సాక్షి, అమరావతి: మత్తు పదార్థాల వినియోగం గురించి తెలుసుకునేందుకు కళాశాలలు, పాఠశాలల వద్ద నిఘాను మరింతగా పెంచాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి రవిచంద్ర అన్నారు. బాలలపై మాదకద్రవ్యాల ప్రభావం-నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి విజయవాడలో మంగళవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. వీధి బాలలు, అనాథలు..గంజాయి, పొగత్రాగడం వంటి వ్యసనాలకు అలవాటు పడటం ఎక్కువగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాలలపై జరుగుతోన్న హింస, నేరాలను అరికట్టడంలో బాలల హక్కుల కమిషన్ పాత్ర ముదావహమన్నారు. విద్యార్థి దశ నుంచే పిల్లలకు క్రమశిక్షణ, మంచి అలవాట్లు నేర్పడం, మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాల పట్ల అవగాహన కల్పించడంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర న్యాయ సలహాల సంఘం సభ్య కార్యదర్శి ఎం బబిత మాట్లాడుతూ హింసకు గురైన మైనర్లను రక్షించడం, చట్టపరంగా అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవడం, బాధితులు, వారి కుటుంబ సభ్యులకు న్యాయసలహాలు ఇవ్వడంలో తాము ముందుంటామని తెలిపారు.

ఇక ఇదే రేటు

పదేళ్లు దాటిన పవన విద్యుత్ పీపీఏల టారిఫ్ నిర్ణయించిన ఏపీఈఆర్సీ

- 11 నుంచి 20 ఏళ్ల వరకు యూనిట్ రూ.2.64
- ఇరవై ఏళ్లు దాటిన పీపీఏల రద్దుకు డిస్కంలకు అవకాశం
- కొనసాగితే విద్యుత్ ఉత్పత్తి, డిస్కంల పరస్పర అంగీకారంతో టారిఫ్
- రాష్ట్రంలో ప్రస్తుతం పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం 4096.65 మెగావాట్లు
- గతేడాది డిసెంబర్ నాటికి 40.9 మెగావాట్ల కొత్త ప్రాజెక్టులు
- 9.8 శాతం వాటాతో దేశంలోని మొదటి 10 రాష్ట్రాల్లో ఏపీ



సాక్షి, అమరావతి: పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించి 10,785.51 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం రాష్ట్రానికి ఉంది. ఈ మొత్తంలో పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం 4,096.65 మెగావాట్లు. ప్రస్తుతం రాష్ట్రంలో రోజుకి 15 మిలియన్ యూనిట్ల నుంచి 20 మిలియన్ యూనిట్ల మధ్య పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. భవిష్యత్తులో ఇది మరింత పెరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో దీర్ఘకాల పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల (పీపీఏ)తో ఆర్థికంగా కుదేలవుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు ఊరట కలిగిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) పవన విద్యుత్ ధరలను నిర్ణయించింది. యూనిట్ రూ.2.64గా నిర్దేశించింది. యూనిట్‌కు రూ.3.43 ఇవ్వాలని విండ్ పవర్ జనరేటర్లు చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది.

ఇరవై ఏళ్ల తరువాత మీ ఇష్టం

విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి పవన విద్యుత్‌ను తీసుకుంటున్న డిస్కంలు మొదటి పది సంవత్సరాలకు యూనిట్‌కు రూ.3.50 చొప్పున చెల్లించాలని గతంలోనే ఏపీఈఆర్సీ ఆదేశాలిచ్చింది. అయితే 11 ఏళ్లు దాటిన తరువాత 20 ఏళ్ల వరకు యూనిట్‌కు రూ.3.43, లేదా అంతకంటే ఎక్కువ టారిఫ్ ఇవ్వాలని పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఏపీఈఆర్సీని కోరాయి. డిస్కంలు మాత్రం మొదటి పదేళ్లకే ఏపీఈఆర్సీ టారిఫ్ ఇచ్చిందని, దానికి జనరేటర్లు కూడా అంగీకారం తెలిపారని, ఆ తరువాత పదేళ్లకు టారిఫ్‌ను మండలి నిర్ణయించాల్సి ఉందని తేల్చి చెప్పాయి. దీనిపై స్పందించిన ఏపీఈఆర్సీ.. పవన విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి మొదటి పదేళ్ల యూనిట్‌కు రూ.3.50గా నిర్ణయించామని తెలిపింది. కానీ ఇప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినందున ఆ ధరలే ఇవ్వమనడం కుదరదని తేల్చి చెప్పింది. 11 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వరకు పవన విద్యుత్ టారిఫ్ యూనిట్‌కు రూ.2.64 గా నిర్ధారించింది. ఇరవై ఏళ్లు దాటిన తరువాత పీపీఏలను రద్దు చేసుకునేందుకు డిస్కంలకు అవకాశం కల్పించింది. ఒక వేళ పీపీఏలను కొనసాగిస్తే విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థల పరస్పర అంగీకారంతో టారిఫ్‌ను నిర్ణయించుకోవచ్చని, దానిని కమిషన్‌కు నివేదించి ఆమోదం పొందాలని సూచించింది.

కర్బన ఉద్గారాలను తగ్గించే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సాహాన్నిస్తోంది. అదే సమయంలో డిస్కంలు ఆర్థికంగా నష్టపోకుండా కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. గతేడాది దేశవ్యాప్తంగా పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 8 శాతం పెరిగితే రాష్ట్రంలో 9.8 శాతం పెరిగింది. అంటే జాతీయ స్థాయి వృద్ధికంటే 1.8 శాతం ఎక్కువ నమోదు చేసుకుని మొదటి పది రాష్ట్రాల్లో ఒకటిగా (ఆరో స్థానంలో) ఏపీ నిలిచింది. రాష్ట్రంలో పవన విద్యుత్‌కు అనుకూల పరిస్థి

పవన విద్యుత్‌కు అనుకూలంగా రాష్ట్రం

తులు ఏర్పడుతున్నాయని కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటీయెరాలజీ (పూణె) పరిశోధకులు వెల్లడించారు. 'కపుల్డ్ మోడల్ ఇంటర్-కంపారిజన్ ప్రాజెక్ట్ (సీఎంఐపీ) ప్రయోగాలలో సముద్ర తీర ప్రాంతాల్లో ముఖ్యంగా ఏపీలో గాలి సామర్థ్యం పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో గతేడాది డిసెంబర్ నాటికి (నాలుగో త్రైమాసికంలో) దేశవ్యాప్తంగా 229 గిగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు పెరగగా, మన రాష్ట్రంలో 40.9 మెగావాట్ల కొత్త ప్రాజెక్టులు వచ్చాయి.

ఎన్నికలు ఏవైనా.. గెలుపు వైఎస్సార్‌సీపీదే

- జగన్ పాలనలోనే బీసీలకు పెద్దపీట
- యాదవులకు రాజకీయ గుర్తింపునిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స, ధర్మాన, సీదిరి



వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎన్నికలు ఏవైనా గెలుపు మాత్రం వైఎస్సార్‌సీపీదేనని.. కుప్పంలోనే టీడీపీని కుప్పకూల్చేశామని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శ్రీకాకుళంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం సీఎం జగన్ ఏపీని సంక్షేమాభివృద్ధి వైపు నడిపించారని చెప్పారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటుకు సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. న్యాయపరమైన అడ్డంకులు తొలిగిన అనంతరం.. ఏప్రిల్ తర్వాత విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటవుతుందని చెప్పారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. పార్టీలోని నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో 18 మందికిగాను 14 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదన్నారు. టీడీపీ నేతల కుట్రలకు అవకాశం ఇవ్వకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. నాడు దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో మాత్రమే యాదవులకు గుర్తింపు లభించిందని గుర్తు చేశారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేసేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని.. దీనివల్ల ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. సీఎం జగన్ సచివాలయాలతో పాటు విద్య, వైద్య శాఖల్లో ఉద్యోగ విప్లవం సృష్టించారని చెప్పారు. వాస్తవ పరిశ్రమల స్థాపనకు అత్యధిక ఎంఓయూలు జరిగింది వైఎస్సార్‌సీపీ హయాంలోనేనని తెలిపారు. పట్టభద్రులను, ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ నేతలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, కంబాల జోగులు, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలకు దన్నుగా..

పిఠాపురంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూదందాపై సర్కారు న్యాయపోరాటం

- రూ.50 కోట్ల సాగుభూమి స్వాహాకు 'పచ్చ' నేత స్కెచ్
- ఆరు గ్రామాలకు చెందిన 300 మంది రైతుల నోట్లో మట్టి
- టీడీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని బరితెగింపు
- బినామీ హక్కుదారుడు పేరుతో రికార్డులు.. పాస్‌పుస్తకాలు
- రైతుల తరపున వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ప్రత్యక్ష ఆందోళన
- ప్రభుత్వం దిశానిర్దేశంతో అధికారులు హైకోర్టులో కౌంటర్ దాఖలు



ఆందోళన వ్యక్తంచేస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ : రాష్ట్రంలో అన్నదాతలకు అడుగడుగునా చేయూతనిస్తూ వారికి అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చోట వారి పక్షాన న్యాయపోరాటం కూడా చేస్తోంది. దశాబ్దాల తరబడి సాగుచేసుకుంటున్న భూమిని 'పచ్చ'గద్దలు ఎగరేసుకు పోవడానికి చేస్తున్న కుట్రలను ఎదిరించి రైతులు రోడ్డెక్కడంతో రాష్ట్ర ప్రభుత్వం వారికి బాసటగా నిలిచింది. 'పచ్చ'నేత భూదందాలో అన్యాయమైపోతున్న రైతన్నల పక్షాన పోరాటానికి నడుం బిగించింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఒకరు సాగించిన ఈ భూబాగోతం కథాకమామిషు ఏమిటంటే..

యు.కొత్తపల్లి మండలం యండపల్లిలో రూ.50కోట్లు విలువచేసే 52 ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలోని చెరువు గర్భం ఉంది. సర్వే నంబరు 627-1, 2, 628-1, 2 పాత, కొత్త చెరువులలో ఇది సాగు భూమిగా ఉంది. వీటిని ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ఆరు గ్రామాలకు చెందిన 300 మంది నిరుపేద రైతులు సాగుచేసుకుంటున్నారు. 20 సెంట్ల నుంచి అర ఎకరం వరకు వీరికి ఉంది. 50 ఏళ్లుగా పన్నులు చెల్లిస్తున్న రశీదులు కూడా ఉన్నాయి. తమ ఆడ పిల్లలకు ఆ భూములను కట్న కానుకలుగా ఇచ్చుకున్న రైతులూ ఉన్నారు. ఈ నేపథ్యంలో.. రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకోవడం.. ఇక్కడ ఎకరం రూ.కోటి పలుకుతుండడంతో గత ప్రభుత్వ హయాంలో సదరు టీడీపీ ప్రజాప్రతినిధి తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఈ భూమిపై కన్నేశాడు. నిరుపేదలు సాగులో ఉన్న భూమిని అప్పనంగా కొట్టేయాలని ఆయన, అతని అనుచరులు స్కెచ్ వేశారు. అంతే.. 2016-17, 2018-19 మధ్య ఆయన రెవెన్యూ రికార్డులను తారుమారు చేయించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.50కోట్లు విలువచేసే 52 ఎకరాలకు హక్కుదారు అంటూ ఆర్‌వీఎస్ రావు అనే వ్యక్తిని తెరమీదకు తీసుకొచ్చారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే 2017-18లో అతని పేరుతో రికార్డులు సృష్టించారు. పాస్ పుస్తకాలు కూడా పుట్టించారు.

రైతులకు తోడుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆందోళన

ఇక ఈ నకిలీ రికార్డుల ఆధారంగా రైతులను ఖాళీ చేయించేందుకు ఆ మాజీ ప్రజాప్రతినిధి తెర వెనుక పెద్ద ప్రయత్నమే చేశారు. అంతేకాక.. రైతులకు పంట దక్కకుండా నేలపాలు చేశారు. అంతటితో ఆగక పెంచిన మొక్కలనూ నరికేశారు. ఇలా గత సెప్టెంబర్‌లో వారిని బలవంతంగా ఖాళీ చేయించారు. దీంతో రైతులు రోడ్డెక్కారు. వీరికి సంఘీభావంగా అక్కడ ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. అదే సమయంలో రెండో విడత 'కాపు నేస్తం' కార్యక్రమం కోసం కాకినాడ జిల్లా గొల్లప్రోలు వచ్చిన సీఎం వైఎస్ జగన్ దృష్టికి ఎమ్మెల్యే ఈ సమస్యను తీసుకెళ్లారు. దీంతో రైతుల పక్షాన న్యాయ పోరాటం చేయాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేసింది. దీంతో అధికారులు హైకోర్టులో కౌంటర్ చేశారు.


రైతుల చేతికొచ్చేవరకు పోరాటం చేస్తాం



ఎన్నో ఏళ్లుగా నిరుపేద రైతులు సాగుచేసుకుంటున్న భూములను తిరిగి వారి చేతికి వచ్చేవరకు పోరాటం చేస్తాం. రైతులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది.

– పెండెం దొరబాబు, ఎమ్మెల్యే, పిఠాపురం

రైతుల పక్షాన కౌంటర్ వేశాం



యండపల్లిలో 52 ఎకరాల భూ సమస్యను పరిశీలించాం. అందులో రైతుల పక్షాన జిల్లా యంత్రాంగం న్యాయ పోరాటం చేస్తోంది. హైకోర్టులో కౌంటర్ కూడా దాఖలు చేశాం.

– కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్, కాకినాడ

తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నాం



మా తాతల కాలం నుంచి చెరువు భూమిని సాగుచేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నాం. ప్రాణాలను అడ్డుపెట్టి అయినా భూమిని కాపాడుకుంటాం.

– చింతపల్లి తాతిరెడ్డి, రైతు, కొత్త ఇసుకపల్లి

ఒక్క రూపాయి నుంచి పన్ను కడుతున్నాం



మేం సాగు చేసుకుంటున్న ఈ భూమికి మా తాతలు రూపాయి దగ్గర్నుండి పన్ను చెల్లిస్తూ వస్తు న్నారు. ఇప్పుడు భూమి మాది కాదని చెబుతున్నారు. సీఎం జగన్ మమ్మల్ని ఆదుకోవాలి.

– తమిలిశెట్టి సుబ్బారెడ్డి, రైతు కొత్త ఇసుకపల్లి

జిల్లా వార్తలు

సరుకు రవాణాలో ఆర్టీసీ ముందంజ

- అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు
- సకాలంలో వినియోగదారులకు సరుకు అందజేత
- ఆర్టీసీకి రికార్డు స్థాయిలో ఆదాయం



పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లోని డెలివరీ కౌంటర్‌లో పార్సిళ్లు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): సరుకు రవాణాలో తనదైన ముద్ర వేసుకుని ఏపీఎస్ ఆర్టీసీ రికార్డు స్థాయి ఆదాయాన్ని సాధిస్తోంది. ప్రైవేట్ రవాణా సంస్థలకు దీటుగా వినియోగదారులకు సరుకును తక్కువ సమయంలో సురక్షితంగా చేరవేసి వారి మన్ననలను పొందుతోంది.

2017 నుంచి కార్గో సేవలు..

2017వ సంవత్సరంలో పూర్తి స్థాయిలో కార్గో, సరుకు రవాణాను ప్రారంభించిన ఏపీఎస్ ఆర్టీసీ మెరుగైన సేవలతో వినియోగదారులను మెప్పించటమే కాకుండా రోజురోజుకు అభివృద్ధి సాధిస్తూ సరుకు రవాణాలో అగ్రగామిగా నిలిస్తోంది. అతి తక్కువ సమయంలో పార్సిళ్లను వినియోగదారులకు అందజేస్తోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.122 కోట్ల ఆదాయాన్ని సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ 25వ తేదీకే రూ.122 కోట్ల ఆదాయాన్ని అధిగమించింది. మూడు నెలలు ముందుగానే గతేడాది వచ్చిన ఆదాయాన్ని అధిగమించింది. 2021-22లో మొత్తం రూ.10.10 లక్షలు సాధించింది. ఎన్టీఆర్ జిల్లా రూ.10.56 లక్షలు సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

2021 నుంచి డోర్ డెలివరీ సౌకర్యం..

2021వ సంవత్సరంలో మొదటిసారిగా ఆర్టీసీ డోర్ డెలివరీ సౌకర్యాన్ని ప్రారంభించి వినియోగదారుల ప్రశంసలు అందుకుంటోంది. పార్సిళ్లను నేరుగా ఇంటి వద్దే అందించటం ద్వారా వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లాజిస్టిక్స్ సేవలు..

ఎన్టీఆర్ జిల్లాలో 4 బస్‌స్టేషన్ కౌంటర్లు, 37 పార్సిల్ బుకింగ్ ఏజెంట్ల వద్ద నుంచి లాజిస్టిక్స్ సేవలు అందిస్తున్నారు. రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు కూడా లాజిస్టిక్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని 84 బస్‌స్టేషన్లలో, 480 అధీకృత పార్సిల్ బుకింగ్ ఏజెంట్ల వద్ద నగదు చెల్లింపుతో పాటు యూపీఐ సేవలు కూడా లభిస్తున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి బస్‌స్టేషన్లలో 24 గంటలు పార్సిల్ బుకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

అతి తక్కువ ఖర్చుతో సరుకు రవాణా..

ప్రైవేట్ సరుకు రవాణా సంస్థలకు దీటుగా సరుకును రవాణా చేయటమే కాకుండా వారి కంటే తక్కువ ఖర్చుతో రవాణా చేస్తుండటంతో మంచి ఆదరణతో పాటు ఆదాయం లభిస్తోంది.

ఆర్టీసీ సేవలకు మంచి ఆదరణ

ఏపీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన కార్గో, పార్సిల్ సర్వీసులకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. వీటి ద్వారా ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తోంది. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది ఆదాయం పెరిగింది. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించటం ద్వారానే ఇది సాధ్యమైంది.

–ఎం.వై.ఏసుదానం, జిల్లా ప్రజారవాణా అధికారి.

హనుమంత వాహనంపై విహరించిన శ్రీవారు



అభయదాత హనుమంత వాహనంపై దేవదేవేరులు



తిలకిస్తున్న భక్త జనం

మంగళగిరి: పట్టణంలో వేంచేసివున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి వారు బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవరోజు మంగళవారం రాత్రి హనుమంతవాహనంపై గ్రామోత్సవంలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తితత్వాన్ని ప్రపంచానికి అందించిన భక్తాగ్రేసరుడు హనుమంతుడు. అందువలన స్వామి వారు ప్రథమంగా హనుమంతుని వాహనం ఎంచుకున్నారనేది భక్తుల నమ్మకం. హనుమ అంటే బుద్ధి, బుద్ధి ప్రదాత. అభయప్రదాత అయిన హనుమంతుని భుజస్కంధాలపై లక్ష్మీ నారసింహస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాన్ని తిలకించిన భక్తులకు స్వామివారు సద్బుద్ధిని, అభయాన్ని ప్రసాదిస్తారని భక్తుల నమ్మకం. ఆలయ ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించగా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు(రాజేష్) కైంకర్యపరులుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళావేదికలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హనుమద్వైభవం ప్రవచనం, అన్నమాచార్య కీర్తనలు, కూచిపూడి నృత్యాలు, మిమిక్రీలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు రాజాధిరాజ వాహనంపై విహరించనున్న శ్రీవారు


బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు రాజాధిరాజ వాహనంపై లక్ష్మీనృసింహస్వామి గ్రామోత్సవంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని ఆలయ ఈఓ రామకోటిరెడ్డి తెలిపారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

యార్డులో 1,12,869 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,15,935 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,12,869 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.13,000 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,677 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మేకలగొంది వద్ద రూ.1,200 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ విజయపురి సౌత్ పరిధిలోని మేకలగొంది వద్ద రూ.1200 కోట్ల వ్యయంతో తాగునీటి ప్రాజెక్టుకు సర్వే పనులు ప్రారంభించినట్లు పల్నాడు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఆర్‌ఎస్‌ఆర్ సురేష్ తెలిపారు. మంగళవారం నాగార్జునసాగర్ జలాశయం మేకలగొంది ప్రాంతాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాబార్డ్, జలజీవన్ మిషన్ పథకాల ద్వారా ఈ ప్రాజెక్టు నిర్వహణ జరగుతుందని చెప్పారు. మాచర్ల, గురజాల, వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చటమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమన్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిందని, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరో పది, పదిహేను రోజులలో సర్వే పనులు పూర్తి అవుతాయని, నెల రోజుల్లో వాటర్‌గ్రిడ్ పనులు మొదలవుతాయని పేర్కొన్నారు. మాచర్ల ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గోపాల్, పిడుగురాళ్ల డీఈ అలెక్స్, వినుకొండ డీఈ రాజు, నరసరావుపేట డీఈ ఏడుకొండలు, సాగర్ ప్రాజెక్టు ఏఈ బాబుమియా పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

- జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్
- ముగిసిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆంధ్రలయోల కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన సైన్స్ ఫెయిర్-2023 కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులంతా విజేతలేనని, గెలుపు, ఓటమితో సంబంధం లేదని చెప్పారు. అనంతరం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు భరోసా కల్పించే విధంగా సీఎం వైఎస్ జగన్ అమలు పరుస్తున్న పథకాలు మన్ననలు పొందుతున్నాయని వివరించారు. పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే ఏడాది అన్ని పాఠశాలల తరగతి గదుల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

విజేతలు వీరే..

ఐదు విభాగాల్లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో 260 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. వీటిలో అత్యంత నైపుణ్యం కలిగిన ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఎకో ఫ్రెండ్లీ విభాగంలో జి.హరిజస్మిత(వైఎస్సార్ జిల్లా), వై.భావన(నెల్లూరు), ఎన్.సుమ(తూర్పు గోదావరి), హెల్త్-క్లీన్లీనెస్ విభాగంలో ఎన్.లక్ష్మీనరసింహా(సత్యసాయి), జి.భానుప్రియ(అనంతపురం), కె.పూజిత(ప్రకాశం), సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ విభాగంలో కె.వినూత్న(తూర్పుగోదావరి), మహేష్‌కుమార్(పల్నాడు), ఎస్.ఆకాష్(చిత్తూరు), ఎన్విరాన్‌మెంట్, క్లైమేట్ చేంజ్ విభాగంలో ఎం.శశాంక్(ప్రకాశం), శ్రీనాథ్(పశ్చిమగోదావరి), వి.వైష్ణవి(విజయనగరం), మేథమేటికల్ మోడలింగ్ విభాగంలో పి.షహీన్‌బి(కర్నూలు), జి.గణేష్(అనకాపల్లి), వి.చరణ్‌శ్రీ (తూర్పుగోదావరి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు.

ఏఎన్‌యూ-కేఎల్‌యూ మధ్య ఎంఓయూ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, వడ్డేశ్వరంలోని కేఎల్‌యూ (కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ) మధ్య ఎంఓయూ (అవగాహనా ఒప్పందం) కుదిరింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్‌లు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సమక్షంలో ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ వీసీ మాట్లాడుతూ ఈ ఎంఓయూ రెండు యూనివర్సిటీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఎంఓయూలో భాగంగా మేనేజ్‌మెంట్, సైన్సెస్, హుమనిటీస్, టెక్నాలజీ రంగాలలో టీచింగ్, రీసెర్చ్, ట్రైనింగ్ అంశాలలో రెండు యూనివర్సిటీలు కలిసి పనిచేస్తాయన్నారు. వివిధ ప్రాజెక్టులు సమర్పించడం, ఎంబీఏ, ఎం.ఫార్మసీ ఎమ్మెస్సీ, ఎంటెక్ కోర్సుల పరిశోధకులు, విద్యార్థులకు మార్గదర్శకం చేయడంలో కూడా ఈ ఎంఓయూ తోడ్పడుతుందని చెప్పారు. ఇరు విశ్వవిద్యాలయాలలోని లేబరేటరీలను రెండు యూనివర్సిటీల పరిశోధకులు, విద్యార్థులు వాడుకోవచ్చని తెలిపారు. గెస్ట్ లెక్చర్స్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ కలిసి నిర్వహించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ప్రమీలరాణి, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలోని ముఖరా అనే చిన్న పల్లెను చూస్తే సినిమాల్లోనే ఇలాంటి పల్లె ఉంటుంది అనిపిస్తుంది. మూడేళ్లలో దీనిని ఇలా తీర్చిదిద్దింది సర్పంచ్ మీనాక్షి గాడ్గె. అందుకే ఆమెకు రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందింది. ఎందుకో చదవండి...

ఇది మీనాక్షి ఊరు


ముఖరా గ్రామ పంచాయతీ కార్యాలయం
ముఖరా గ్రామంలోని ఒక వీధి


మీనాక్షి

నూట అరవై కుటుంబాలు 700 జనాభా ఉన్న ఆ చిన్న ఊరు ఎంత ముచ్చటగా ఉంటుందంటే ప్రతి ఊరు ఇలాగే ఉంటే బాగుండు అనిపిస్తుంది. మూడేళ్ల క్రితం వరకూ అది అన్నింటిలాగే ఒక మామూలు పల్లె. మూడేళ్లలో దేశ వ్యాప్తంగా వార్తల్లో నిలిచే స్థాయికి ఎదిగింది. దానికి కారణం సర్పంచ్ మీనాక్షి గాడ్గె. ఆమె కృషి, పట్టుదల ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా గ్రామాన్ని అద్భుతమైన గ్రామంగా తీర్చిదిద్దాయి.

నూతన గ్రామపంచాయితీ

ఒకప్పుడు అనుబంధ గ్రామంగా ఉన్న ముఖరా 2019లో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ అయ్యింది. గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఉన్న సుభాష్ గాడ్గె తన భార్య మీనాక్షిని సర్పంచ్‌గా పోటీ చేయమని ప్రోత్సహించాడు. అక్షరాస్యత అంతంత మాత్రమే ఉన్న ఆ గ్రామంలో ఇంటర్ వరకూ చదివి అందరితో స్నేహంగా ఉండే మీనాక్షి ఆ పదవికి తగినదేనని ఊరంతా భావించింది. ఏకగ్రీవంగా ఆమెను సర్పంచ్‌గా ఎన్నుకుంది. ఈ నిర్ణయం మీనాక్షిని బాగా కదిలించింది. తన మీద ఇంత విశ్వాసం ఉంచిన గ్రామానికి పూర్తిగా సేవ చేయాలని గట్టిగా నిశ్చయించుకుంది.

అన్నీ మంచి పనులే

మీనాక్షి సర్పంచ్ అయిన వెంటనే చేసిన మొదటి పని ఊళ్లో ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు కట్టించడం. దాంతో ఊరు ఒక్కసారిగా బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత గ్రామంగా మారిపోయింది. ఆ తర్వాత తాగునీరు ప్రతి ఇంటికి అందేలా చేయడమే కాకుండా ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఏర్పాటు చేసి వృథానీరు ఆ గుంటలో పోయేలా చూసిందామె. దాంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఊరి బయట పెద్ద వాగు వానొస్తే పొంగి రాకపోకలకు తీవ్ర అంతరాయం జరిగేది. మీనాక్షి వంతెన కట్టించింది. పక్కా రోడ్ల నిర్మాణం, సైడు కాలువల వల్ల శుభ్రత ఏర్పడింది. పాత భవనంగా ఉన్న స్కూలును కొత్త భవన నిర్మాణం చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే కాదు ఇంగ్లిష్ మీడియంలో చెప్పడానికి టీచర్లను నియమించింది. దాంతో 1 నుంచి 5 వరకు ఊళ్లో ప్రతి ఒక్క విద్యార్థి ఈ ప్రభుత్వ బడిలోనే చదువుతున్నాడు.

చెత్తను ఎరువుగా అమ్మి

ముఖరాలో తడి చెత్త – పొడి చెత్త విభజనను ప్రతి ఒక్కరూ పాటిస్తారు. తడి చెత్త నుంచి ఎరువు తయారు చేసి రైతులకు అమ్మి పంచాయతీకి లాభం సంపాదించిపెడుతోంది మీనాక్షి. ఎరువు అమ్మకం ద్వారా 6 లక్షలు వస్తే వాటిలో నాలుగు లక్షలు వెచ్చించి ఊళ్లో 6 కె.వి. సోలార్ గ్రిడ్లు ఏర్పాటు చేసింది. ఇక్కడ తయారయ్యే కరెంటులో 4 కిలో ఓల్టులు పంచాయతీ ఉపయోగించుకున్నా 2 కిలో ఓల్ట్‌లను పవర్ గ్రిడ్‌కు అమ్మడం ద్వారా లాభం రానుంది.

డయల్ 100కు ఒక్క కాల్ లేదు

'గత మూడేళ్లుగా మా ఊరి నుంచి డయల్ 100కు ఒక్క కాల్ కూడా వెళ్లలేదు' అంటుంది మీనాక్షి. దానికి కారణం సంపూర్ణ మద్యపాన నిషేధం విధించడమే. దాని వల్ల సగం గొడవలు లేకుండా పోయాయి. మద్యం తాగితే జరిమానా విధిస్తారు. అంతేకాదు గ్రామమంతా శాకాహారాన్ని అలవాటు చేసుకుంది. ఆరోగ్యం కోసం శాకాహారాన్ని ప్రచారం చేయడం వల్ల ఈ మార్పు వచ్చింది. ఊరిలో చిన్న అంగడి కూడా నగదు రహిత లావాదేవీలు నిర్వహిస్తుంది. ఇక ఊరిలో నలభై వేల చెట్లు ఉన్నాయి. హరితహారంలో భాగంగా పది వేల మొక్కలు నాటి వాటిని పూర్తిగా కాపాడుకున్నారు. ఊళ్లోనే ఒక నర్సరీ ఉంది. వీటన్నింటి వల్ల ఊరు చల్లటి నీడలో ఉంటుంది. ఇందువల్లనేమో కరోనా ఈ ఊరు దరిదాపులకు రాలేదు.


మహిళా విజేత

ఇన్ని మంచి పనులు చేసింది కనుకనే మీనాక్షిని మార్చి 4న కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ 'స్వచ్ఛ సుజల్ శక్తి సమ్మాన్–2023' కార్యక్రమంలో భాగంగా మహిళా దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా 'మహిళా విజేత' పురస్కారంతో సత్కరించనుంది. 'నా భర్త, పిల్లలు, ఊరి ప్రజలు... వీరందరి సహకారం వల్లే ఈ పురస్కారం' అని మీనాక్షి అంది.

– ఇన్‌పుట్స్: గొడిసెల కృష్ణకాంత్ గౌడ్, సాక్షి, ఆదిలాబాద్

'కొత్త భాష నేర్చుకోవడం అంటే కొత్త వ్యక్తిగా రూపాంతరం చెందడమే' అనే మాట ఉంది. ఇది సరేగానీ, 'ఫలాన భాష టు ఫలాన భాష' సాంకేతికంగా ట్రాన్స్‌లేషన్స్ ఆప్షన్స్ ఉన్న ఈ కాలంలోనూ ఎందుకు యువతరం కొత్త భాషలు నేర్చుకోవడంపై ఆసక్తి ప్రదర్శిస్తోంది?

మీకెన్ని భాషలొచ్చు!?



యూత్ పల్స్

రకరకాల ఇజాలు యువతరానికి కొత్త కాదు. అయితే యువతరంలో కొంతమంది 'హైపర్ పాలిగ్లాటిజం'పై ఆసక్తి చూపుతున్నారు. హైపర్ పాలిగ్లాటిజం అంటే బహు భాషల్లో ప్రవేశం. ఒకప్పుడు జ్ఞానదృష్టితో కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో కొత్త భాషలు నేర్చుకునేవారు.

అయితే గ్లోబలైజేషన్ పరిణామంలో ఉద్యోగాల విషయంలో బహు భాషలు మాట్లాడేవారికి, కొత్త భాషలను వేగంగా నేర్చుకోగలిగే వారికి డిమాండ్ పెరిగింది. దీంతో యువతరం కొత్త భాషలు నేర్చుకోవడంపై ఆసక్తి ప్రదర్శిస్తోంది.

అయితే ఇప్పటి యువతరం '30 రోజుల్లో కొత్త భాష' అని అంగట్లో దొరికే పుస్తకాల కంటే చాలా ముందు ఉంది.

కొత్త భాషలను నేర్చుకోవడానికి రకరకాల టెక్నిక్స్‌ను అనుసరిస్తోంది. అందులో ఒకటి పాటతో కొత్త భాషపై పట్టు సాధించడం. అంటే మనం నేర్చుకునే భాషకు సంబంధించి వాక్యాలను పాపులర్ పాటల బాణీలలో పాడుకోవడం. దీనికి మూలం... నాగాలాండ్‌కు చెందిన 'ది తెట్సియో సిస్టర్స్' మ్యూజిక్ బ్యాండ్. మృత్యుశయ్యపై ఉన్న తమ మాతృభాష 'చోక్రి'ని బతికించుకోవడానికి ఈ బ్యాండ్ సంగీతాన్ని ఉపయోగించుకుంది. పాటలన్నీ తమ భాషలోనే ఉంటాయి. దీంతో యువతరం సులభంగా తమ భాషతో కనెక్ట్ అయింది. త్రిపురలోని ముగ్గురు సభ్యుల యంగ్ బ్యాచ్ తమ మాతృభాష 'కోక్‌బోరోక్' ను కాపాడుకోవడానికి జానపద బాణీలను ఆశ్రయిస్తోంది. అది మంచి ఫలితం ఇస్తోంది.

బహు భాషలు నేర్చుకోవాలనుకునే యువతరానికి ఇటలీకి చెందిన 'మెజో ఫాంటీ జిసపీ' రోల్ మోడల్. 30 భాషలు మాట్లాడడంలో జిసపీ దిట్ట.

ఇప్పుడు ప్రపంచంలో ఏ మూల అయినా ఉద్యోగం చేసే పరిస్థితుల్లో ఉన్నాం. స్థానికులతో కలిసి పనిచేయడానికి, ఆయా భాషలను వేగంగా నేర్చుకునే నైపుణ్యాలను కంపెనీలు కోరుకుంటున్నాయి. దీంతో 'స్వ కార్యం స్వామి కార్యం' లాగా కొత్త భాషలు నేర్చుకోవడంపై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది.

బహు భాష భాషిణి


కిరుభాషిణి

తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన 26 సంవత్సరాల కిరుభాషిణి జయకుమార్ బహుభాష ప్రవీణ. హిందీ, సంస్కృతం, కన్నడం, బెంగాలీ మొదలైన భారతీయ భాషలతో పాటు ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, అరబిక్... మొదలైన భాషలు మాట్లాడగలదు. దేశ, విదేశాలకు సంబంధించి 15 భాషల్లో కిరుభాషిణికి ప్రవేశం ఉంది. ఎనిమిది సంవత్సరాల వయసు నుంచే కొత్త భాషలు నేర్చుకోవడంపై కిరు ఆసక్తి చూపేది.

'ఒక భాషలో ప్రవేశం ఉంది అంటే ఓనమాలు తెలియడం కాదు. పదాలు సరిగ్గా పలకాలి. రాయాలి. భాష ఆత్మను పట్టుకోగలగాలి' అంటుంది కిరుభాషిణి. తనకు తెలిసిన భాషలకు సంబంధించిన పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, ఆయా భాషలకు సంబంధించిన వ్యక్తులతో సంభాషించడం ద్వారా భాషకు సంబంధించిన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకుంటుంది కిరు. 'రెండు డీ లు ఉంటే ఎవరైనా కొత్త భాషలో ప్రవేశం సంపాదించవచ్చు' అంటోంది కిరుభాషిణి. ఆ రెండు డీ లు....ఒకటి డెడికేషన్, రెండోది డైలీ ప్రాక్టీస్. ప్రతి రోజూ నిద్ర పోయేముందు తనకు తెలిసిన భాషలకు సంబంధించిన పుస్తకం ఒకటి చదవడం ఆమె అలవాటు. 20 భాషలు నేర్చుకోవాలనేది కిరుభాషిణి లక్ష్యం.

బ్యూటిప్స్

కొబ్బరి పాలతో స్క్రబ్

కొబ్బరి పాలలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. దీనివల్ల ఎక్కువ కాలం చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. ● కొబ్బరి పాలల్లో దూదిని ముంచి ముఖానికి, మెడకు రుద్దుకోవాలి. పావుగంట తర్వాత చల్లటి నీటితో కడిగేసుకొంటే మంచి ఫలితం కనిపిస్తుంది. ● ఇలా యాంటీ ఏజింగ్ ప్యాక్స్‌ను వారానికి రెండు నుంచి మూడు సార్లు వేసుకోవడం ద్వారా చర్మాన్ని ముడతలు పడకుండా కాపాడుకోవచ్చు.



మేనికాంతికి ఉసిరి.. నిమ్మ... నారింజ

తేనెను తరచూ మన ముఖానికి రాసుకుంటూ ఉంటే, ముఖం మీద ఉండే నల్లటి మచ్చలు తగ్గుముఖం పడతాయి. తేనెతో పెదవులకు మసాజ్ చేస్తే మృదువుగా, అందంగా కనిపిస్తాయి. చర్మాన్ని ఆరోగ్యంగా మెరిపించడంలో విటమిన్ సి ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అందువల్ల విటమిన్ సి పుష్కలంగా ఉండే ఉసిరిని అది దొరికినంతకాలం విరివిగా తీసుకోవాలి. నిమ్మకాయ, నారింజలోనూ విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఉసిరి దొరకనప్పుడు వీటిని తరచూ తీసుకోవడం వల్ల కూడా అందంగా మారవచ్చు. అలాగే, వేపాకులు వేసిన నీటితో స్నానం చేయడం, తరచు ముఖాన్ని కడుక్కోవడం, ద్రవ పదార్థాలు సమృద్ధిగా తీసుకోవడం వల్ల మొటిమలు, మచ్చలు లేకుండా మేని చర్మం మెరుపులీనుతూ ఉంటుంది.

గీత మార్చుకుంది...

ఎవరి సామర్థ్యాలేంటో వారికే తెలిసినప్పటికీ శరీరం సహకరించడం లేదనో, ఆర్థిక స్థితిగతులు బాగోలేవనో ఏదో కారణంతో వెనకడుగు వేస్తుంటారు. కానీ, 42 ఏళ్ల గీతా ఎస్ రావు వాటన్నింటినీ అధిగమించి తన సత్తా ఏమిటో ప్రపంచానికి చూపుతోంది. పోలియోతో బాధపడుతున్నా, శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు జాతీయస్థాయిలో నేడు ప్రారంభమయ్యే లాంగెస్ట్ సైకిల్ రేస్‌లో పాల్గొనబోతోంది. ఈ సైక్లింగ్‌లో రేస్‌లో పాల్గొంటున్న ఏకైక మహిళ గీతా ఎస్ రావు. 'నేను సాధించగలను' అనే ధీమాను తన విజయంలోనే చూపుతున్న మహిళగా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఇంపాజిబుల్ అనేవారికి ఇటీజ్ పాజిబుల్ అనే సమాధానం ఇస్తుంది.




గీతా ఎస్ రావు

నేడు శ్రీనగర్ నుండి ప్రారంభమై కన్యాకుమారి వరకు జరిగే 3,551 కిలోమీటర్ల లాంగ్ సైక్లింగ్ రేస్‌లో పాల్గొంటున్నది గీతా ఎస్ రావు. డిఫరెంట్లీ–ఏబుల్డ్ గానే కాదు ఇలా సైక్లింగ్ రేస్‌లో పాల్గొంటున్న ఏకైక మహిళగా కూడా గుర్తింపు పొందింది ఆమె. అహ్మదాబాద్‌లో ఉంటున్న గీతకు మూడేళ్ల వయసులో పోలియో కారణంగా ఎడమ కాలు చచ్చుబడిపోయింది. గీత తల్లిదండ్రులు ఆమెను మిగతా పిల్లలమాదిరిగానే ధైర్యం నూరిపోస్తూ పెంచారు. కొన్నాళ్లు బెడ్‌కే అంకితమైపోయిన గీత ఆ తర్వాత వీల్ చెయిర్, హ్యాండికాప్డ్ బూట్స్‌తో నిలబడింది. అక్కడ నుంచి ఒక్కో మెట్టు సాధన చేస్తూ ట్రెక్కింగ్, బంగీ జంపింగ్, పారాగ్లైడింగ్, వాక్ త్రూ, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, మారథాన్.. ఇలా ఒక్కో ప్రయత్నం ఆమెను శక్తిమంతురాలిగా నిలబెట్టాయి. ఆమె తన కలలను సాకారం చేసుకోవడానికి తన సంకల్ప శక్తినే ఆయుధంగా చేసుకుంది.

పడిపోతూ.. నిలబడింది

రెండు కాళ్లూ సరిగ్గా ఉన్న సైక్లిస్టులు రోడ్డు ప్రమాదాల్లో మరణించడం చూసి చలించిపోయేది. తను సైక్లిస్ట్‌గా మారలేనా అనుకుంది. ముప్పై ఏళ్ల వయసులో సైకిల్ నేర్చుకునే ప్రయత్నం చేసింది. రోడ్డు మీద సైక్లింగ్ చేసే సమయంలోనూ చాలా సార్లు పడిపోయింది. తల నుండి కాలి వరకు గాయలయ్యాయి. కానీ, శరీరం సహకరించలేదనే నెపంతో తనకు నచ్చిన సైక్లింగ్‌ను మూలనపడేయకూడదు అనుకుంది. తన లాంటి వారికి ప్రేరణగా నిలవాలనుకుంది. ఆ ధైర్యమే ఆమెను పారా ఒలిపింక్ గేమ్స్ వరకు తీసుకెళ్లింది. 2016లో మొదలుపెట్టిన ఆమె సైకిల్ ప్రయాణం ఇప్పటికి 80 వేల కిలోమీటర్ల వరకు సాగింది. మొదట్లో 200 మీటర్లు కూడా సైకిల్ తొక్కలేకపోయేది. కానీ, త్వరలో ప్యారిస్‌కు చెందిన ఆడాక్స్ క్లబ్ పర్షియన్ రాండెన్యూర్ రైడ్స్‌లో పాల్గొనబోతోంది. ఒక యేడాదిలోనే 200, 300, 400, 600 కిలోమీటర్ల రైడ్‌లను కొన్ని గంటల్లోనే సాధించింది.

తన రికార్డులను తనే తిరగరాస్తూ..

నియమాలకు కట్టుబడి, సమయాన్ని సమర్థంగా ఉపయోగించుకుంటే వికలాంగులు కూడా సమర్థులైన వ్యక్తులుగా సమాజంలో నిలబడతారు అని తన కథనం ద్వారానే నిరూపిస్తుంది గీత. 2017 డిసెంబర్‌లో లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసుకుంది. భారతదేశపు మొట్టమొదటి డిఫరెంట్లీ–ఏబుల్ సైక్లిస్ట్‌గా పేరు సంపాదించుకుంది. 2020–21లో తన రికార్డును తనే తిరగరాసుకుంది. ఈ యేడాది జనవరిలో వడోదర నుండి ధోలవీర వరకు వెయ్యి కిలోమీటర్ల రైడ్‌ను 73 గంటల 30 నిమిషాలలో పూర్తి చేసింది. హైదరాబాద్‌లో జరిగిన భారత జట్టు జాతీయ సెలక్షన్‌లలోనూ గీత మొదటి స్థానంలో నిలిచింది. ఆసియా ఛాంపియన్‌షిప్ కోసం ఆమెకు శిక్షణ ఇచ్చేందుకు స్వచ్ఛందంగా కోచ్‌లు ముందుకు వచ్చారు.


సమస్యలకు ఎదురెళ్లి

ఆసియా ఛాంపియన్‌షిప్ రేసులో ఎదురు దెబ్బ తగిలి, కింద పడిపోయింది. సైక్లింగ్ షూస్ చిరిగిపోవడం, పెడల్ నుంచి జారి పడిపోవడంతో ఎడమ కాలు మరింతగా బాధపెట్టింది. అయినప్పటికీ కొండ ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాల గుండా ఆమె తన రేస్‌లో పాల్గొంది. రెండవ స్థానంలో నిలిచి బహుమతి ప్రదానోత్సవానికి గంట ముందు అంబులెన్స్‌లో చికిత్స తీసుకుంటూ ఉంది. కిందటేడాది పారాసైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సూపర్ రాండన్యూర్‌గా పేరొందింది. ఒలింపిక్ ట్రై–అథ్లెట్‌లో రజత పతకాన్ని సాధించింది.

మద్దతు కోసం

తన కలలను సాకారం చేసుకోవడానికి గీత ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుండి స్పాన్సర్‌షిప్ కోసమూ ప్రయత్నిస్తోంది. ఈ పోరాట ప్రయాణానికి ఎంతో మంది తమ మద్దతును తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా లాంగెస్ట్ రేస్‌లో గీత పాల్గొనడానికి హైదరాబాద్‌లోని సుహానా హెల్త్ ఫౌండేషన్, ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ నుంచి ఆమెకు మద్దతు లభిస్తోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ –'ఇది జాతీయ స్థాయిలో జరిగే అతి పెద్ద రేస్. విభిన్నంగా ఉండే మన దేశీయ వాతావరణంలో, సుందరమైన ప్రదేశాల మీదుగా ఈ రేస్ ఉంటుంది. దేశంలోని వారే కాదు ప్రపంచంలోని మారుమూలప్రాంతాల నుంచి కూడా ఈ రేస్‌లో పాల్గొంటున్నారు. అతి పొడవైన ఈ సైక్లింగ్ రేస్ 12 రోజుల్లో 12 రాష్ట్రాలను దాటాలి' అని తెలియజేస్తుంది. సైక్లిస్ట్‌గానే కాదు గీత ట్రావెలర్‌గానూ పేరు తెచ్చుకుంది. కార్పొరేట్ కమ్యూనికేషన్, బిఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన గీత ఐటీ మేనేజర్‌గా ఉద్యోగమూ చేసింది. ఎంట్రప్రెన్యూర్‌గా సొంతంగా కార్పొరేట్ కంపెనీకి డైరెక్టర్‌గా ఉంది.

పిల్లలు సైకిల్ నేర్చుకునేటప్పుడు, ప్రాక్టీస్ చేసేటప్పుడు ఎంత ఉత్సాహంగా ఉంటారో గీత అంతే హుషారును చూపుతుంది. ఆ సాధన, ఆనందం ఆమెను ప్రపంచ కప్ సాధించే దిశగా తీసుకెళుతుంది.. వచ్చే సంవత్సరం ప్యారిస్‌లో జరిగే పారాలింపిక్స్‌లో భారత దేశం నుంచి సైక్లింగ్‌లో మొట్టమొదటి ఒలింపిక్ పతకాన్ని గెలుచుకురావాలని తపిస్తున్న గీత కలలు ఎంతో మందికి ఆదర్శం కావాలి.


ప్రతీకాత్మక చిత్రం

పెళ్లి ఎప్పుడు చేసుకోవాలి? 'మాకు చేసుకోవాలనిపించినప్పుడు' అంటారు పిల్లలు. 'మేము చేయాలనుకున్నప్పుడు' అంటారు తల్లిదండ్రులు. 'మేము కన్న మా పిల్లల భవిష్యత్తు మాకు తెలియదా' అని ప్రశ్నిస్తారు కూడా. అలాగే పిల్లల నిర్ణయం ప్రకారమే అనుకుంటే అది పదిహేనేళ్లు కావచ్చు, పాతికేళ్లు కావచ్చు. అందుకే ప్రభుత్వం వివాహానికి ఒక వయసును నిర్ధారించింది. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21ని వివాహ వయసుగా నిర్ధారిస్తూ అంతకంటే ముందు పెళ్లి జరిగితే ఆ పెళ్లిని బాల్య వివాహంగా పరిగణించాలని కూడా చెప్పింది. అలా వచ్చిన చట్టమే 'ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్– 2006', అంటే బాల్య వివాహ నిషేధ చట్టం అన్నమాట.

బాల్యానికి బందిఖానా!

అమ్మాయి అక్షరాలు దిద్దుతోంది కానీ...



చట్టాలు పని చేస్తూనే ఉన్నాయి. సమాజం చైతన్యవంతం అవుతూనే ఉంది. అమ్మాయిల అక్షరాస్యత శాతం పెరుగుతోంది. అయినా బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. అక్షరాస్యత శాతం పెరుగుతోంది కానీ పాఠశాల విద్య దాటి కాలేజ్ బాట పట్టే సంఖ్య తక్కువగానే ఉంది. ఆ చదువు కూడా ఇప్పటికీ ఇంటర్ దాటడం లేదు. మనం చెప్పుకుంటున్న కేస్‌స్టడీలు గ్రామాలు, అల్పాదాయ వర్గానికి చెందినవి కావడం గమనార్హం. బాల్య వివాహాలకు 'తల్లిదండ్రులకు చదువు లేకపోవడంతోపాటు సమాజంలో ఆడపిల్లకు భద్రత కరువవడం' కూడా కారణమేనంటారు కైలాశ్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ అనుబంధ విభాగం 'బచ్‌పన్ బచావో ఆందోళన్' తెలంగాణ రాష్ట్ర సమన్వయ కర్త చందన.

2025 నాటికి స్త్రీ–పురుష సమానత్వంతోపాటు మహిళలు, బాలికల సాధికారత సాధించాలని ఐక్యరాజ్యసమితి ఒక లక్ష్యంగా నిర్దేశించింది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే బాలికల విద్య మీదనే దృష్టి పెట్టాలి. అల్పాదాయ వర్గాల వాళ్లు కూడా అమ్మాయి పెళ్లికి లక్షలు ఖర్చు చేస్తున్నారు. చదివించడం లేదెందుకంటే 'మా దగ్గర డబ్బులెక్కడున్నాయ్' అంటారు. అలాంటి వాళ్లందరికీ నేను చెప్పేదొక్కటే... 'పెళ్లికి చేసే ఖర్చుని అమ్మాయి చదువుకి ఉపయోగించండి. మీ అమ్మాయి జీవనస్థాయి మారుతుంది.

– చందన,
కో ఆర్డినేటర్, బచ్‌పన్ బచావో ఆందోళన్, తెలంగాణ

ఐదు వేల బాల్య వివాహాలను నివారించాం



మనదేశంలో ప్రతి ముగ్గురు ఆడపిల్లల్లో ఒకరు బాల్య వివాహం చట్రంలో నలిగిపోతున్నారు. మేము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళాసాధికారత కోసం నిర్వహించిన 'సబల' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాం. అధికారులు ఐదు వేల బాల్య వివాహాలను నివారించగలిగారు. బాల్య వివాహ వ్యవస్థ తరతరాలుగా వస్తున్న దురాచారం. దీన్ని రూపుమాపడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి, పూర్తిగా నివారించడానికి ఇంకా కొన్నేళ్లు పడుతుంది. దీనికి మూలకారణం ఆర్థిక స్థితిగతులు, చదువు. ఆడపిల్లలను చదివించడం మీద దృష్టి పెట్టిన కుటుంబం బాల్య వివాహానికి దూరంగా ఉన్నట్లే. మహిళ సాధికారత సాధిస్తే తన కూతురిని ఈ చట్రంలో ఇరుక్కోకుండా రక్షించుకోగలుగుతుంది. అందుకే బాలికల విద్య, మహిళల ఆర్థికస్వయం సమృద్ధి పూర్తి స్థాయిలో సాధించగలిగిన రోజు బాల్య వివాహాలు వాటంతటవే నిర్మూలన అవుతాయి.

– వాసిరెడ్డి పద్మ, చైర్‌పర్సన్, మహిళా కమిషన్, ఆంధ్రప్రదేశ్

బాల్యాన్ని హరించడమే!

''బాల్య వివాహం కూడా మానవ హక్కుల ఉల్లంఘనే. వివాహం, పని, ఒత్తిడితో కూడిన చదువు... ఇవన్నీ పిల్లల బాల్యాన్ని హరించేవే. పిల్లల బాల్యాన్ని హరించే హక్కు కన్నవాళ్లకు కూడా ఉండదు. బాల్యవివాహాల నియంత్రణ కోసం చేస్తున్న ప్రయత్నాల్లో అతి పెద్ద విఘాతం కరోనా రూపంలో వచ్చి పడింది. మునుపు 35గా ఉన్న బాల్య వివాహాల శాతం కరోనా కారణంగా 2020లో 62 శాతానికి పెరిగిపోయింది. ఆ తర్వాత ఏడాది కొంత తగ్గి 57 శాతం దగ్గర ఆగింది. ప్రభుత్వ పథకాలు కొంత వరకు బాల్య వివాహాలను తగ్గించగలుగుతున్నాయి. కానీ రావలసినంత మార్పు రాలేదనే చెప్పాలి. దేశంలో ఉత్తరాది రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉన్నామని సంతోషం పడడమే ఇప్పటికి మనం సాధించింది'' అన్నారు చందన.

– వాకా మంజులారెడ్డి



మార్క్‌రమ్ సెంచరీ: దక్షిణాఫ్రికా 314/8

వెస్టిండీస్ జట్టుతో సెంచూరియన్‌లో మంగళవారం మొదలైన తొలి టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 82 ఓవర్లలో 8 వికెట్లకు 314 పరుగులు సాధించింది. ఓపెనర్లలో మార్క్‌రమ్ (174 బంతుల్లో 115 ; 18 ఫోర్లు) సెంచరీ సాధించగా... డీన్ ఎల్గర్ (118 బంతుల్లో 71 ; 11 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 141 పరుగులు జోడించారు. మార్కో జాన్సెన్ (17 బ్యాటింగ్; 3 ఫోర్లు), కోట్జీ (11 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. విండీస్ బౌలర్లలో అల్జారి జోసెఫ్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి టైటిల్



జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (కేరళ) జోడీ మహిళల డబుల్స్ విభాగంలో విజేతగా అవతరించింది. మంగళవారం పుణేలో జరిగిన ఫైనల్లో గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-10, 21-9తో కావ్య గుప్తా-దీప్శిక సింగ్ (ఢిల్లీ) ద్వయంపై గెలిచింది.



విజేత గౌతమ్ జూనియర్ కాలేజి

- సీనియర్ విభాగంలో భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజీకి టైటిల్
- ముగిసిన తెలంగాణ సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ

SPL SAKSHI PREMIER LEAGUE | SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

లాలాపేట: డిఫెండింగ్ చాంపియన్ గౌతమ్ జూనియర్ కాలేజి (ఈసీఐఎల్) జట్టు తెలంగాణ రీజియన్ సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో టైటిల్ నిలబెట్టుకుంది. హబ్సిగూడలోని ఐఐసీటీ మైదానంలో జరిగిన జూనియర్ విభాగం ఫైనల్లో గౌతమ్ కాలేజి జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఎస్‌ఆర్‌ఆర్ జూనియర్ కాలేజి (మంచిర్యాల) జట్టుపై ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌ఆర్‌ఆర్ కాలేజి 11 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌటైంది. గౌతమ్ కాలేజీ స్పిన్నర్ డి.మనీశ్ రెండు వికెట్లు పడగొట్టాడు. టోర్నీ మొత్తంలో మనీశ్ 12 వికెట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. అనంతరం గౌతమ్ కాలేజి జట్టు కేవలం 4.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 52 పరుగులు చేసి గెలిచింది. అన్విత్ రెడ్డి 11 బంతుల్లో 24 పరుగులు చేశాడు. టోర్నీ మొత్తం నిలకడగా రాణించిన అన్విత్ రెడ్డి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు సొంతం చేసుకున్నాడు. హెచ్‌సీఏ అండర్-14, అండర్-16 లీగ్‌లలో కూడా అన్విత్ రెడ్డి తన సత్తా చాటుకున్నాడు. బాలాజీకి 'మ్యాన్ ఆఫ్ ద ఫైనల్' అవార్డు లభించింది.

సీనియర్ విభాగంలో భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజి (సైనిక్‌పురి) జట్టు టైటిల్ సొంతం చేసుకుంది. ఫైనల్లో భవాన్స్ జట్టు 35 పరుగుల తేడాతో వాగ్దేవి డిగ్రీ కాలేజి (మంచిర్యాల) జట్టును ఓడించింది. ముందుగా భవాన్స్ జట్టు 15 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులు సాధించింది. రాహుల్ 36 బంతుల్లో 71 పరుగులు చేశాడు. అనంతరం వాగ్దేవి కాలేజి 14.4 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ రెడ్డికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, ఫైనల్' అవార్డులు దక్కాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతగా నిలిచిన జట్లకు రూ. 25 వేలు చొప్పున... రన్నరప్ జట్లకు రూ. 15 వేలు చొప్పున నగదు పురస్కారం లభించింది. తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి మల్లా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విన్నర్స్, రన్నరప్ జట్లకు ట్రోఫీలను అందజేశారు. అబ్బాయిలకే కాకుండా అమ్మాయిలకు కూడా టోర్నీలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ రాణి రెడ్డి కూడా పాల్గొన్నారు.



భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజి జట్టు

'హ్యాట్రిక్' విజయంపై భారత్ గురి

నేటి నుంచి ఆస్ట్రేలియాతో మూడో టెస్టు

- గెలిస్తే టీమిండియా ఖాతాలో సిరీస్‌తోపాటు డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్
- సమస్యలతో ఆసీస్ సతమతం
- ఉదయం గం. 9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్

ఇండోర్: 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'ని నిలబెట్టుకున్న భారత్ ఇప్పుడు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్‌పై కన్నేసింది. రెండు వరుస విజయాలతో తుదిపోరుకు మరింత చేరువైన టీమిండియా ఈ టెస్టు గెలిస్తే... చివరి టెస్టు, ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా ఫైనల్ చేరుతుంది. సొంతగడ్డపై జరుగుతున్న సిరీస్ కావడం... ఆటగాళ్లంతా ఆత్మవిశ్వాసంతో ఉండటం ఆతిథ్య జట్టును పటిష్టస్థితిలో ఉంచగా... గాయాలు, వరుస వైఫల్యాలతో పర్యాటక ఆస్ట్రేలియా జట్టు కునారిల్లుతోంది. ఈ నేపథ్యంలో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య బుధవారం మొదలయ్యే మూడో టెస్టులో రోహిత్ శర్మ బృందం ఆరంభం నుంచే పైచేయి సాధించాలనే పట్టుదలతో ఉంది.

రాహుల్ స్థానంలో గిల్!

పేలవ ఫామ్‌తో ఇప్పటికే వైస్ కెప్టెన్సీ కోల్పోయిన కేఎల్ రాహుల్ తాజాగా తుది జట్టుకూ దూరమయ్యే అవకాశముంది. మూడు ఇన్నింగ్స్‌ల్లో అతని స్కోరు 20, 17, 1. ఓ టాపార్డర్ బ్యాటర్ ఆటతీరును సమీక్షిస్తున్న జట్టు మేనేజ్‌మెంట్ ఓపెనింగ్‌లో జోరు మీదున్న శుబ్‌మన్ గిల్‌ను బరిలోకి దించాలని చూస్తోంది. ఇది మినహా విజయవంతమైన జట్టులో ఇంకేం మార్పు ఉండదు. రోహిత్-గిల్ జోడీ ఇన్నింగ్స్ ఆరంభిస్తే పుజారా, కోహ్లి, శ్రేయస్ అయ్యర్‌లతో కూడిన మిడిలార్డర్ పటిష్టంగా ఉంది. అక్షర్ పటేల్ బంతి లేదంటే బ్యాట్‌తో జట్టును ఆదుకోవడం ఈ సిరీస్‌లో కలిసొచ్చింది. అతనితోపాటు జడేజా, అశ్విన్‌ల స్పిన్ త్రయం మళ్లీ కంగారూ-కంగారూ పెట్టేందుకు సిద్ధమైంది. పిచ్ పరిస్థితుల దృష్ట్యా ఆరంభంలో పేసర్లు షమీ, సిరాజ్‌లు కూడా ఇండోర్‌లో ప్రమాదకరం కావొచ్చు.



స్మిత్ సారథ్యంలో...

భారత పర్యటన మొదలైనప్పటి నుంచి ఆస్ట్రేలియా మైదానం లోపల, వెలుపల కష్టాలతో సహవాసం చేస్తోంది. కీలకమైన ఆటగాళ్ల గాయాలు, మ్యాచుల్లో వైఫల్యాలు నంబర్‌వన్ టెస్టు జట్టుకు ప్రతికూలంగా మారాయి. మూడంటే మూడు రోజుల్లోనే ఆటను ముగించడం చూస్తుంటే నిజంగా ఇది ఆస్ట్రేలియా జట్టేనా అనే అనుమానం కూడా రాక మానదు. తాజాగా రెగ్యులర్ కెప్టెన్ కమిన్స్ గైర్హాజరు (స్వదేశానికి తిరుగుముఖం)లో అనుభవజ్ఞుడైన స్టీవ్ స్మిత్ జట్టు పగ్గాలు చేపట్టాడు. మాజీ కెప్టెన్ సారథ్యంలో జట్టు ఏ మేరకు పుంజుకుంటుందో చూడాలి. ట్రావిస్ హెడ్, ఉస్మాన్ ఖాజాలు శుభారంభం అందిస్తేనే తర్వాత లబుషేన్, స్మిత్, గ్రీన్‌లు జట్టును నడిపిస్తారు. లేదంటే గత మ్యాచ్‌ల ఫలితాలే పునరావృతమయ్యే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో తీవ్రమైన ఒత్తిడిలో ఉన్న ఆస్ట్రేలియా ఈ టెస్టును ఎన్ని రోజులు ఆడుతుందనేది ఆసక్తికరంగా మారింది.

పిచ్-వాతావరణం

ఇండోర్ పిచ్ ఆరంభంలో పేస్‌కు అనుకూలిస్తుంది. మూడో రోజు స్పిన్‌కు టర్న్ అవుతుంది. 2016లో న్యూజిలాండ్, 2019లో బంగ్లాదేశ్‌లతో జరిగిన మ్యాచ్‌ల్లో ఇదే జరిగింది. వేసవి వేడి మొదలవడంతో వాన ముప్పేమీ లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్/రాహుల్, పుజారా, కోహ్లి, శ్రేయస్ అయ్యర్, జడేజా, శ్రీకర్ భరత్, అశ్విన్, అక్షర్, షమీ, సిరాజ్.

ఆస్ట్రేలియా: స్మిత్ (కెప్టెన్), హెడ్, ఉస్మాన్ ఖాజా, లబుషేన్, హ్యాండ్స్‌కాంబ్, గ్రీన్, క్యారీ, స్టార్క్, మర్ఫీ, లయన్, కున్‌మన్/బోలండ్.

'టెస్టు' థ్రిల్లర్... కివీస్ విన్నర్

వెల్లింగ్టన్: క్రికెట్లో వన్డేలు, టి20ల్లో రోమాంచకరమైన మ్యాచ్‌లెన్నో చూశాం. కానీ టెస్టుల్లో మాత్రం ఆసక్తికరమైన మ్యాచ్‌లు చాలా అరుదు. ఇప్పుడు కూడా ఈ అరుదైన మ్యాచ్... టి20లను మించి మరీ థ్రిల్ ఇవ్వడమే గొప్ప విశేషం. 2-0తో న్యూజిలాండ్ పర్యటన ముగించాల్సిన ఇంగ్లండ్ అనూహ్యంగా... ఒకే ఒక్క పరుగు తేడాతో 1-1తో సమం చేసుకోవాల్సి వచ్చింది. మంగళవారం ముగిసిన రెండో టెస్టులో కివీస్ ఎవరూహించని విధంగా ఒక పరుగు తేడాతో నెగ్గింది. 258 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 48/1తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్ కొనసాగించిన ఇంగ్లండ్ గెలుపు గడపదాకా వచ్చింది. కానీ 74.2 ఓవర్లలో 256 పరుగుల వద్ద ఆలౌటైంది. జో రూట్ (95; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) ... స్టోక్స్ (33; 6 ఫోర్లు), ఫోక్స్ (35; 4 ఫోర్లు) గెలిపించే ప్రయత్నం చేసినా... న్యూజిలాండ్ బౌలర్లు పరుగు ముందే ఆలౌట్ చేశారు. వాగ్నర్ 4, సౌతీ 3, హెన్రీ 2 వికెట్లు తీశారు. ఫాలోఆన్‌లో పడి విజయం సాధించిన మూడో జట్టుగా కివీస్ గుర్తింపు పొందింది.



స్టోక్స్ సౌతీ

మెస్సీనే మేటి...

2022 ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్‌గా అర్జెంటీనా కెప్టెన్ ఎంపిక



పారిస్: తన అద్భుత ప్రతిభతో 36 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అర్జెంటీనా జట్టును మళ్లీ ప్రపంచ చాంపియన్‌గా నిలబెట్టిన లియోనెల్ మెస్సీ 2022 ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్‌గా ఎంపికయ్యాడు. గత ఏడాది ఖతర్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచకప్ ఫైనల్లో కెప్టెన్ మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా పెనాల్టీ షూటౌట్‌లో ఫ్రాన్స్‌ను ఓడించి 1986 తర్వాత మళ్లీ జగజ్జేతగా నిలిచింది. ఈ టోర్నీలో మెస్సీ ఏడు గోల్స్ చేశాడు. ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్ అవార్డు కోసం మెస్సీ, కిలియాన్ ఎంబాపె (ఫ్రాన్స్), కరీమ్ బెంజెమా (ఫ్రాన్స్) పోటీపడ్డారు. జాతీయ జట్ల కెప్టెన్‌లు, కోచ్‌లు, ఎంపిక చేసిన జర్నలిస్టులు, ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్యలో సభ్యత్వం ఉన్న 211 దేశాల ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓటింగ్‌లో మెస్సీకి 52 పాయింట్లు రాగా... ఎంబాపెకు 44 పాయింట్లు, కరీమ్ బెంజెమాకు 34 పాయింట్లు వచ్చాయి. గత 14 ఏళ్లలో మెస్సీ ఏడోసారి ప్రపంచ ఉత్తమ ఫుట్‌బాలర్ అవార్డు గెల్చుకోవడం విశేషం. ఉత్తమ కోచ్‌గా అర్జెంటీనాకు ప్రపంచ టైటిల్ దక్కడంలో కీలకపాత్ర పోషించిన లియోనెల్ స్కలోని ఎంపికయ్యాడు. మహిళల విభాగంలో ప్రపంచ ఉత్తమ క్రీడాకారిణి అవార్డు స్పెయిన్‌కు చెందిన అలెక్సియా పుటెలాస్‌కు లభించింది.

మహిళల స్నూకర్ ప్రపంచకప్ విజేత భారత్



బ్యాంకాక్: మహిళల స్నూకర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు టైటిల్ లభించింది. అమీ కమాని-అనుపమ రామచంద్రన్‌లతో కూడిన భారత 'ఎ' జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో అమీ కమాని-అనుపమ జోడీ 56-26, 67-27, 41-61, 27-52, 68-11, 55-64, 78-39తో ఇంగ్లండ్ 'ఎ' జట్టుకు చెందిన రీని ఇవాన్స్-రెబెకా కెన్నా ద్వయంపై విజయం సాధించింది.

సినిమా



త్రిష
సమంత
శోభిత
జాన్వీ కపూర్

గాయం... ఓ మంచి బహుమతి

గాయం తియ్యగా ఉంటుందా... మనసు తీసుకునేదాన్ని బట్టి ఉంటుంది. కొందరు కథానాయికలు కొన్ని గాయాలను అలానే తీసుకున్నారు. పవర్‌ఫుల్ రోల్స్ చేసేటప్పుడు అయిన గాయాలను 'బహుమతి'గా, 'తియ్యని గాయం'లా అనుకుంటున్నారు. 'ఆగేదే లేదు' అంటూ దూసుకెళుతున్నారు. ఆ నాయికల గురించి తెలుసుకుందాం.

యాక్షన్‌కి దక్కిన బహుమతి

ఒకవైపు మయోసైటిస్ వ్యాధితో పోరాటం చేసి, దాదాపు కోలుకున్న సమంత మరోవైపు 'సిటాడెల్' వెబ్ సిరీస్‌లో పోరాట సన్నివేశాల్లో నటిస్తున్నారు. ఈ సిరీస్‌లో పవర్‌ఫుల్ రోల్ చేస్తున్న సమంత హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ యానిక్ బెన్ దగ్గర శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత షూట్‌లో పాల్గొన్నారు. అయితే యాక్షన్ సీన్ తీస్తున్నప్పుడు ఆమె రెండు చేతులకు గాయాలయ్యాయి. మంగళవారం ఆ ఫోటోను షేర్ చేసి, 'యాక్షన్‌కి దక్కిన బహుమతి ఇది' అని పేర్కొన్నారు సమంత. ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్‌లో రూసో బ్రదర్స్ తెరకెక్కించిన హాలీవుడ్ వెబ్ సిరీస్ 'సిటాడెల్'కి ఇండియన్ వెర్షన్‌గా వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో రాజ్ అండ్ డీకే ఈ సిరీస్‌ని తెరకెక్కిస్తున్నారు.

నొప్పిని మరచి...

గాయం చిన్నదైనా పెద్దదైనా నొప్పి మాత్రం కామన్. అయితే త్రిష మాత్రం గాయం తాలూకు నొప్పి తెలియలేదు అంటున్నారు. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియిన్ సెల్వన్' షూట్‌లో తగిలిన గాయాల గురించే త్రిష ఈ విధంగా అన్నారు. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష తదితరులు ప్రధాన తారాగణంగా రెండు భాగాలుగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్'. తొలి భాగం గత ఏడాది సెప్టెంబర్ 30న విడుదల కాగా మలి భాగం ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది. ఇందులో యువరాణి కుందవై పాత్ర చేశారు త్రిష. పోరాట సన్నివేశాల్లో నటించినప్పుడు తన చేతులకు గాయాలయ్యాయని, శోభిత ('పొన్నియిన్...'లో ఓ కీలక పాత్రధారి) చెవులకు కూడా గాయం అయిందని త్రిష పేర్కొన్నారు. అయితే గాయాల తాలూకు నొప్పిని మరచిపోయి షాట్ గ్యాప్‌లో కబుర్లు చెప్పుకుని, ఆ తర్వాత షూటింగ్‌లో పాల్గొనేవాళ్లమని త్రిష పేర్కొన్నారు. అలాగే 'పొన్నియిన్ సెల్వన్' తన జీవితంలో ఓ మంచి జ్ఞాపకం అని కూడా అన్నారామె.

తియ్యని గాయం

'క్రికెట్ చూడ్డానికి ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది కానీ ఆడేటప్పుడు తెలుస్తుంది ఎంత కష్టమో' అంటున్నారు జాన్వీ కపూర్. రాజ్‌కుమార్ రావ్, జాన్వీ కపూర్ క్రికెటర్లుగా కనిపించనున్న చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ'. ఈ సినిమాలోని పాత్ర కోసం టీమిండియా క్రికెటర్ దినేష్ కార్తీక్ వద్ద శిక్షణ తీసుకున్నారు జాన్వీ. ఇటీవల తన పాత్రకు సంబంధించిన షూట్‌ని పూర్తి చేశారీ బ్యూటీ. ఈ సందర్భంగా ఈ సినిమా తనకు ఎప్పటికీ మరచిపోలేని అనుభూతిని మిగిల్చిందని పేర్కొన్నారామె. ''ఈ సినిమా కోసం కెమెరా ముందు క్రికెట్ ఆడినప్పుడు రెండు సార్లు నా భుజానికి గాయం అయింది. ఎముక పొజిషన్ మారింది. అయినప్పటికీ తియ్యని గాయం అనుకుంటున్నాను. ఒంటరిగా కూర్చుని నేను చేసిన సినిమాల గురించి ఆలోచించుకున్నప్పుడు కచ్చితంగా 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ' ముందు గుర్తొస్తుంది. ఇది నాకు అపురూపమైన సినిమా'' అన్నారు జాన్వీ. శరణ్ శర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది.

సమంత షేర్ చేసిన ఫొటో



పల్లవీ జోషి

గాయంతోనే షూటింగ్

వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ది వాక్సిన్ వార్'. ఈ చిత్రంలో కీలక పాత్ర చేస్తూ, ఓ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు పల్లవీ జోషి. ఆ మధ్య ఈ చిత్రం చివరి షెడ్యూల్ హైదరాబాద్ శివార్లలో వేసిన సెట్‌లో జరిగింది. ఓ సన్నివేశం చిత్రీకరిస్తుండగా వాహనం అదుపు తప్పడంతో పల్లవీ జోషికి స్వల్ప గాయాలయ్యాయి. అయినప్పటికీ ఆ సన్నివేశం పూర్తి చేశాకే ఆమె డాక్టర్ దగ్గరికి వెళ్లారు.

ఈ నాయికలే కాదు.. ఆ మధ్య టబు, శిల్పా శెట్టి వంటి తారలు కూడా షూటింగ్స్‌లో గాయపడ్డారు.

ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నా!

- ఎస్వీ కృష్ణారెడ్డి



సోహైల్, అచ్చిరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సి. కల్యాణ్, వరుణ్

''ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తటానికే 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' తీశాం. తెరమీద పాత్రలు మిమ్మల్ని (ప్రేక్షకులు) నవ్విస్తుంటే.. మీరు నవ్వుతూ ఉంటే చూసే రోజు కోసం(3వ తేదీ) ఎదురు చూస్తున్నాను'' అని డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. సోహైల్, మృణాళిని జంటగా రాజేంద్ర ప్రసాద్, మీనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'. కె. అచ్చిరెడ్డి సమర్పణలో కోనేరు కల్పన నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదల కానుంది. మంగళవారం నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ– ''మా మూవీ ట్రైలర్‌కి ఇక్కడున్న వారు కొట్టిన చప్పట్లతో సినిమా విజయంపై మరింత విశ్వాసం పెరిగింది. ఈ సినిమాకు అన్నీ చక్కగా కుదిరాయి'' అన్నారు. నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ–''నా దృష్టిలో తరాలు మారొచ్చు కానీ సినిమా అనేది నిరంతరం సాగే ప్రపంచం. మనసున్న ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చేలా సన్నివేశాలు తీశారు కృష్ణారెడ్డిగారు'' అన్నారు. ''ఇప్పటి ట్రెండ్‌ను ఫాలో అవుతూ ఈ సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు కృష్ణారెడ్డిగారు'' అని కె. అచ్చిరెడ్డి అన్నారు. ''హీరోగా నిరూపించుకోవడానికి నాకు వచ్చిన మంచి అవకాశం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' చిత్రం అని గర్వంగా చెబుతున్నాను'' అన్నారు సోహైల్.

పల్లి.. పల్లి.. బెల్లంపల్లి...



ఉపేంద్ర, తాన్యా హోప్

''చంద్రు ఇదివరకే అద్భుతమైన చిత్రాలను డైరెక్ట్ చేశారు. ఈ చిత్రం కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్. ఉపేంద్ర హీరోగా ఆర్. చంద్రు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కబ్జ'. పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఈ నెల 17న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలోని 'పల్లి.. పల్లి.. బెల్లంపల్లి..' అంటూ సాగే మూడో పాటను కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ విడుదల చేశారు. ఉపేంద్ర, తాన్యా హోప్‌పై ఈ మాస్ సాంగ్‌ని చిత్రీకరించారు. రవి బస్రూర్ స్వరపరచిన ఈ పాటను తెలుగులో చంద్రబోస్ రాయగా హరిణి ఇవటూరి, సంతోష్ వెంకీ పాడారు. దర్శక-నిర్మాత ఆర్. చంద్రు హోమ్ టౌన్ షిడ్ల గట్ట (కర్నాటక)లో జరిగిన ఈ పాట విడుదల వేడుకలో కర్నాటక ఆరోగ్య శాఖ మంత్రి కె. సుధాకర్, మాజీ మంత్రి హెచ్.ఎం. రేవన్న, కో ప్రొడ్యూసర్ అలంకార్ పాండియన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ విష్ణు

ఓ వింత సమస్య

'ప్రేమించి పెళ్లి చేసుకునేవాళ్లకి క్యాస్ట్ ప్రాబ్లమ్ వస్తుంది లేకపోతే క్యాష్ ప్రాబ్లమ్ వస్తుంది.. ప్రపంచంలో ఎవరికీ రాని వింత ప్రాబ్లమ్ నాకు వచ్చిందేంట్రా' అని హీరో శ్రీవిష్ణు చెప్పే డైలాగ్‌లతో 'సామజవరగమన' గ్లింప్స్ రిలీజైంది. శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ జంటగా రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన చిత్రం 'సామజవరగమన'. అనిల్ సుంకర సగర్వ సమర్పణలో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. శ్రీవిష్ణు బర్త్‌డే (ఫిబ్రవరి 29) సందర్భంగా గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. ఈ వేసవిలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: గోపీ సుందర్, కెమెరా: రాంరెడ్డి.

మంగళవారం మొదలైంది



అజయ్ భూపతి

అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'మంగళవారం'. స్వాతి గునుపాటి, సురేష్ వర్మ, అజయ్ భూపతి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా టైటిల్‌ని వెల్లడించి, కాన్సెప్ట్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''ఇండియాలో ఎవరూ ప్రయత్నించని కొత్త జానర్ చిత్రమిది. ఈ చిత్రంలో ఉన్న 30 పాత్రలకూ కథలో ప్రాధాన్యం ఉంటుంది'' అన్నారు అజయ్. ''మంగళవారం' పాన్ ఇండియా కాదు.. సౌత్ ఇండియన్ సినిమా'' అన్నారు స్వాతి, సురేష్ వర్మ. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికుమార్ యాదవిల్లి, కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్.

డప్పుకొట్టి చెప్పుకోనా...



శివ, రాశీ సింగ్

శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహల్ జంగాల, శశిధర్ కాశి, కార్తీక్ ముడుంబై నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి 'డప్పుకొట్టి చెప్పుకోనా..' అనే పాటను చిత్రబృందం రిలీజ్ చేసింది. విజయ్ బుల్గానిన్ స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు. ''ఇందులో శివ డిటెక్టివ్‌గా కనిపిస్తారు'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్, కెమెరా: గౌతమ్ జి.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



ఆకాశ్ పూరి, పండు

మాన్యం కృష్ణ, అర్చన జంటగా రూపొందిన చిత్రం 'మిస్టర్ కళ్యాణ్'. పండు దర్శకత్వంలో ఉషశ్రీ సమర్పణలో ఎస్వీ సుబ్బారెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ చిత్రం విడుదల తేదీ పోస్టర్‌ని హీరో ఆకాశ్ పూరి విడుదల చేసి, ''సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''ఫ్యామిలీ, లవ్ అండ్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. మహిళలకు కనెక్ట్ అయ్యే అంశాలు మా సినిమాలో ఉన్నాయి'' అని చిత్ర యూనిట్ తెలిపింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
326	89
58,962	17,304

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,504	△	37
డోజోన్స్	32,750	▽	139
ఎఫ్‌టీఎస్ఈ 100	7,876	▽	59
డాక్స్	15,365	▽	16
హాంగ్‌సెంగ్	3,280	△	21
నికాయ్	27,423	△	22

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	55,123	▽	543
బంగారం (22 క్యారెట్)	54,900	▽	543
వెండి (కేజీ)	62,770	▽	676

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.95	83.62
£	బ్రిటన్ పౌండ్	98.16	101.46
€	యూరో	86.20	89.24
¥	జపాన్ ఎన్ (100)	59.83	61.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	54.69	57.04
S$	సింగపూర్ డాలర్	60.45	62.42
SAR	సౌదీ రియాల్	21.05	22.72
UAE D	యూఏఈ దిర్హామ్	21.61	23.40
¥	చైనా యువాన్	10.79	12.87

హెచ్‌డీఎఫ్‌సీ, పీఎన్‌బీ, బీవోఐ రుణ రేట్ల పెంపు

నేటి నుంచే అమల్లోకి



న్యూఢిల్లీ: గృహ రుణాల ప్రముఖ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీతోపాటు, ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) రుణాల రేట్లను పెంచుతూ నిర్ణయాన్ని ప్రకటించాయి. సవరించిన రేట్లు మార్చి 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపాయి. కనీస రిటైల్ ప్రైమ్ లెండింగ్ రేటును హెచ్‌డీఎఫ్‌సీ 0.25 శాతం పెంచి 9.20 శాతానికి చేర్చింది. అయితే, 760 కంటే మించి క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి 8.70 శాతానికే గృహ రుణాన్ని ఆఫర్ చేస్తోంది. పీఎన్‌బీ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 0.10% పెంచింది. దీంతో పీఎన్‌బీ ఏడాది కాల ఎంసీఎల్ఆర్ రేటు 8.5%కి చేరింది. ఆటో, వ్యక్తిగత, గృహ రుణాలను ఈ రేటు ఆధారంగానే బ్యాంకు జారీ చేస్తుంటుంది. ఇక బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఎంసీఆర్ఎల్ రేటును 0.10% పెంచుతున్నట్టు ప్రకటించింది. ఆర్‌బీఐ ఎంపీసీ ఫిబ్రవరి సమీక్షలో రెపో రేటును 0.25 శాతం పెంచడం తెలిసిందే. ఇక గతేడాది మే నెల నుంచి చూసుకుంటే మొత్తం పెంపు 2.50 శాతంగా ఉంది.

మానసిక, శారీరక వైకల్యం ఉన్న వారికి బీమా

బీమా కంపెనీలకు ఐఆర్‌డీఏఐ ఆదేశం



న్యూఢిల్లీ: సాధారణ, స్టాండలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు వైకల్యం ఉన్న వారు, హెచ్ఐవీ బాధితులు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేకంగా బీమా ఉత్పత్తులను తీసుకు రావాలని బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆదేశించింది. ఐఆర్‌డీఏఐ హెల్త్ ఇన్సూరెన్స్ మార్గదర్శకాలకు (2016) అనుగుణంగా ఈ ఉత్పత్తుల ప్రీమియం ధరలను నిర్ణయించాలని తన తాజా సర్క్యులర్‌లో పేర్కొంది. ఈ తరహా వ్యక్తులకు సంబంధించి పాలసీల క్లెయిమ్‌లు తిరస్కరించకుండా బోర్డు స్థాయిలో ఆమోదం పొందిన అండర్‌రైటింగ్ పాలసీని అందుబాటులోకి తీసుకురావాలని కూడా ఆదేశించింది. ఏడాది కాల వ్యవధితో బీమా ఉత్పత్తి ఉండాలని, దాన్ని ఏటా పునరుద్ధరించుకునే అవకాశం కల్పించాలని కోరింది.

తగ్గిన వృద్ధి వేగం

- డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 4.4 శాతానికి పరిమితం
- జూన్, సెప్టెంబర్ త్రైమాసికాల్లో ఈ రేట్లు 13.5 శాతం, 6.3 శాతం
- తయారీ పేలవ పనితీరు
- క్యూ3 ఎకానమీ విలువ రూ.40.19 లక్షల కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం తగ్గుతోంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులతో పాటు దేశంలో కీలక తయారీ రంగం కుంటుపడటం ఎకానమీ మందగమనానికి కారణమవుతోంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) మంగళవారం విడుదల చేసిన అక్టోబర్-నవంబర్-డిసెంబర్ (3వ త్రైమాసికం) గణాంకాల ప్రకారం, స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు మూడవ త్రైమాసికంలో 4.4 శాతంగా నమోదయ్యింది. అంతక్రితం గడచిన రెండు త్రైమాసికాల్లో (జూన్, సెప్టెంబర్) జీడీపీ వృద్ధి రేట్లు వరుసగా 13.5 శాతం, 6.3 శాతాలుగా నమోదయ్యాయి. 2021 ఇదే కాలంలో భారత్ వృద్ధి రేటు 11.2%. ఈ లెక్కలు ఎకానమీ మందగమనాన్ని సూచిస్తున్నాయి.

2021-22 వృద్ధి రేటు 9.1 శాతానికి పెంపు

2021-22 వృద్ధి అంచనాలను ఎన్ఎస్ఓ తాజాగా క్రితం 8.7 శాతం నుంచి 9.1 శాతానికి ఎగువముఖంగా సవరించడం కొంత ఊరట కలిగించే అంశం. 2020-21లో జీడీపీ విలువ రూ.136.87 లక్షల కోట్లు. 2021-22లో ఈ విలువ రూ.149.26 లక్షల కోట్లకు చేరింది. వెరసి వృద్ధి రేటు 9.1 శాతంగా నమోదయ్యిందన్నమాట. కరోనా తీవ్ర సంక్షోభం నేపథ్యంలో 2020-21లో ఎకానమీలో అసలు వృద్ధి లేకపోగా 5.8% క్షీణతను నమోదుచేసుకుంది. ఇక తలసరి ఆదాయం 2020-21 నుంచి 2021-22కు రూ.1,27,065 నుంచి రూ.1,48,524కు పెరిగింది. పెట్టుబడులకు సంబంధించి గ్రాస్ క్యాపిటల్ ఫార్మేషన్ కరెంట్ ప్రైస్ ప్రకారం, ఇదే కాలంలో రూ.55.27 లక్షల కోట్ల నుంచి రూ.73.62 లక్షల కోట్లకు ఎగసింది. స్థూల పొదుపులు రూ.57.17 లక్షల కోట్ల నుంచి రూ.70.77 లక్షల కోట్లకు ఎగశాయి.

2022-23లో 7 శాతంగా అంచనా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) భారత్ వృద్ధి రేటు 7 శాతంగా ఉంటుందని ఎన్ఎస్ఓ రెండవ ముందస్తు అంచనాలు పేర్కొంటున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనాలకన్నా (6.8 శాతం) ఇది 20 బేసిస్ పాయింట్లు అధికంకావడం గమనార్హం.

4.4 శాతం వృద్ధి ఎలా అంటే..

ద్రవ్యోల్బణం సర్దుబాటు చేసిన స్థిర (2011-12 బేస్ ఇయర్) ధరల వద్ద 2021-22 అక్టోబర్-డిసెంబర్ మధ్య జీడీపీ విలువ రూ.38.51 లక్షల కోట్లు. 2022-23 ఇదే కాలంలో ఈ విలువ రూ.40.19 లక్షల కోట్లుగా తొలి అంచనాలు వేయడం జరిగింది. అంటే వృద్ధి రేటు 4.4 శాతమన్నమాట. ఇక ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, ప్రస్తుత ధరల వద్ద జీడీపీ వృద్ధి రేటు 11.2% వృద్ధితో రూ.62.39 లక్షల కోట్ల నుంచి రూ.69.38 లక్షల కోట్లకు చేరింది.

కీలక రంగాల తీరిది...

- **తయారీ:** గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ ప్రకారం (పరిశ్రమ లేదా ఆర్థిక వ్యవస్థలో ఒక రంగం వృద్ధి తీరు ఎలా ఉందన్న విషయాన్ని నిర్దిష్టంగా పరిశీలించడానికి దోహదపడే విధానం) 3వ త్రైమాసికంలో తయారీ రంగం ఉత్పత్తిలో అసలు వృద్ధి లేకపోగా 1.1 శాతం క్షీణించింది. 2021 ఇదే కాలంలో ఈ రంగం కనీసం 1.3 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది.
- **వ్యవసాయం:** మొత్తం ఎకానమీలో దాదాపు 15 శాతం వాటా ఉన్న ఈ రంగంలో వృద్ధి రేటు 3.7 శాతంగా ఉంది. 2022 ఇదే కాలంలో ఈ రేటు 2.2 శాతం.
- **మైనింగ్ అండ్ క్వారియింగ్:** వృద్ధి రేటు 5.4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గింది.
- **నిర్మాణం:** నిర్మాణ రంగంలో వృద్ధి రేటు 0.2 శాతం నుంచి 8.4 శాతానికి చేరింది.
- **విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలు:** వృద్ధి 6 శాతం నుంచి 8.2 శాతానికి ఎగసింది.
- **ట్రేడ్, హోటల్, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సేవలు:** వృద్ధి 9.2 నుంచి 9.7 శాతానికి చేరింది.

2022-23పై అంచనాలు ఓకే



మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7 శాతం వృద్ధి రేటు నమోదవుతుందన్న అంచనాలు తగిన విధంగా, వాస్తవికతకు అద్దం పట్టేవిగా ఉన్నాయి. ఈ స్థాయి వృద్ధి సాధనకు భారత్ నాల్గవ త్రైమాసికంలో 5 నుంచి 4.1 శాతం వృద్ధి సాధించాల్సి ఉంటుంది. అయితే ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను తట్టుకోవడానికి భారత్ సిద్ధం కావాల్సి ఉంది.

– వీ అనంత నాగేశ్వరన్, చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్

5జీతో విద్య, వైద్యంలో పెను మార్పులు

రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ



న్యూఢిల్లీ: అత్యంత వేగవంతమైన 5జీ సర్వీసులతో హెల్త్‌కేర్, విద్య, వ్యవసాయం, విపత్తు నిర్వహణ మొదలైన విభాగాల్లో భారీ మార్పులు రాగలవని టెలికం సంస్థ రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. వీటితో నగరాలు స్మార్ట్‌గా, సొసైటీలు సురక్షితమైనవిగా మారగలవని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ అనంతర వెబినార్‌లో పాల్గొన్న సందర్భంగా ఆకాశ్ అంబానీ ఈ విషయాలు చెప్పారు. ఆరోగ్యసంరక్షణ రంగంలో 5జీ వినియోగంతో అంబులెన్సులు డేటా, వీడియోను రియల్ టైమ్‌లో వైద్యులకు చేరవేయగలవని, రిమోట్ కన్సల్టేషన్‌లు, వేగవంతమైన రోగనిర్ధారణ విధానాలతో మారుమూల ప్రాంతాలకు కూడా నాణ్యమైన వైద్య సేవలను అందించడం సాధ్యపడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయం విషయానికొస్తే వాతావరణం తీరుతెన్నులు, నేలలో తేమ స్థాయి, పంటల ఎదుగుదల మొదలైన వాటి గురించి డేటా ఎప్పటికప్పుడు పొందడం ద్వారా సరైన సాగు విధానాలు పాటించేందుకు వీలవుతుందని ఆకాశ్ చెప్పారు. అంతిమంగా సమాజంపై 5జీ, అనుబంధ టెక్నాలజీలు సానుకూల ప్రభావాలు చూపగలవని వివరించారు.

నాలుగు నెలల కనిష్టానికి సూచీలు

- ఎనిమిదో రోజూ అమ్మకాలే
- 59 వేల దిగువకు సెన్సెక్స్



ముంబై: దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో అమ్మకాలు ఆగడం లేదు. ద్రవ్యోల్బణ భయాలతో స్టాక్ సూచీలు వరుసగా ఎనిమిదో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టాలను చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడిని పెంచాయి. డిసెంబర్ క్వార్టర్ జీడీపీ డేటా వెల్లడి(మార్కెట్ ముగిసిన తర్వాత)కి ముందు అప్రమత్తత చోటు చేసుకుంది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఇన్ఫోసిస్, ఐటీసీ షేర్లు 2% నుంచి 1.5% నష్టపోయి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. ఓ దశలో సెన్సెక్స్ 491 పాయింట్లు పతనమై 58,796 వద్ద, నిఫ్టీ 138 పాయింట్లు క్షీణించి 17,255 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 326 పాయింట్ల నష్టపోయి 58,962 వద్ద ముగిసింది. నిఫ్టీ 89 పాయింట్లు తగ్గి 17,304 వద్ద స్థిరపడింది. ఈ ముగింపు స్థాయిలు సూచీలకు 4 నెలల కనిష్టం కావడం గమనార్హం. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ షేర్లు నష్టపోయాయి. ఆటో, మీడియా, బ్యాంకింగ్, రియాల్టీ, వినిమయ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,559 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,610 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 21 పైసలు బలపడి 82.58 స్థాయి వద్ద స్థిరపడింది.

జనవరిలో మౌలిక రంగం ఊరట

4 నెలల గరిష్ట స్థాయిలో 7.8% నమోదు



న్యూఢిల్లీ: ఎనిమిది మౌలిక పారిశ్రామిక రంగాల గ్రూప్ జనవరిలో మంచి ఫలితాన్ని నమోదు చేసింది. ఈ గ్రూప్ వృద్ధి రేటు సమీక్షా నెల్లో 7.8 శాతంగా నమోదయ్యింది. 4 నెలల గరిష్ట స్థాయి ఇది. క్రూడ్ ఆయిల్ (1.1 శాతం క్షీణత) మినహా మిగిలిన ఏడు రంగాలూ వృద్ధి రేటును నమోదు చేసుకున్నాయి. వీటిలో బొగ్గు, సహజవాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలు ఉన్నాయి. కాగా ఏప్రిల్-జనవరి మధ్య ఈ గ్రూప్ వృద్ధి రేటు 11.6 శాతంగా ఉంది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ(ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాల వెయిటేజ్ 49.27 శాతం.

ప్రపంచ ఆటో తయారీ హబ్‌గా భారత్

- లక్ష్యానికి అనుగుణంగా పలు చర్యలు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి
- టాటా మోటార్స్ స్క్రాప్ ప్లాంటు షురూ



న్యూఢిల్లీ: భారత్‌ను ప్రపంచ ఆటో తయారీ కేంద్రం (హబ్)గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా వెల్లడించారు. సమీప భవిష్యత్‌లో దేశీ ఆటో పరిశ్రమ విలువ రూ. 15 లక్షల కోట్లకు చేరే అంచనాలున్నట్లు తెలియజేశారు. జైపూర్‌లో ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ఏర్పాటు చేసిన వాహనాలను తుక్కుగా మార్చే(స్క్రాపింగ్) ప్లాంటును వర్చువల్‌గా ప్రారంభించిన గడ్కరీ ప్రస్తుతం ఆటో పరిశ్రమ దేశ జీడీపీలో 7.1 శాతం వాటాను సమకూరుస్తున్నట్లు పేర్కొన్నారు. రూ. 7.8 లక్షల కోట్ల పరిమాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలియజేశారు. 2025కల్లా ఈ సంఖ్య 5 కోట్లను తాకనున్నట్లు అభిప్రాయపడ్డారు. జైపూర్‌లో టాటా మోటార్స్ వార్షికంగా 15,000 వాహన స్క్రాపింగ్ సామర్థ్యంతో తొలిసారి రిజిస్టర్డ్ ప్లాంటును ఏర్పాటు చేసింది.

రూ. 15 లక్షల కోట్లకు..: గ్లోబల్ ఆటో తయారీ కేంద్రంగా భారత్‌ను నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు గడ్కరీ పేర్కొన్నారు. సమీప కాలంలో పరిశ్రమ పరిమాణాన్ని రూ. 15 లక్షల కోట్లకు చేర్చనున్నట్లు చెప్పారు. పాత, పనికిరాని వాహనాలను తొలగించడం ద్వారా స్క్రాపేజ్ పాలసీ దశలవారీగా పర్యావరణ అనుకూల కొత్త వాహనాలకు దారి చూపుతుందని వివరించారు. తుక్కుగా మార్చే తాజా విధానాల వల్ల వాహన డిమాండు ఊపందుకుంటుందని, రూ. 40,000 కోట్ల ఆదనపు జీఎస్‌టీ ఆదాయానికి వీలుంటుందని తెలిపారు.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

స్పోర్ట్స్ అథారిటీ, న్యూఢిల్లీలో 152 పోస్టులు

న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. ఒప్పంద/డిప్యూటేషన్ ప్రాతిపదికన కోచ్, సీనియర్ కోచ్, చీఫ్ కోచ్, హైపెర్ఫార్మెన్స్ కోచ్ నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 152
» **పోస్టుల వివరాలు:** హై-పెర్ఫార్మెన్స్ కోచ్-25, చీఫ్ కోచ్-49, సీనియర్ కోచ్-34, కోచ్-44.
» **విభాగాలు:** ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, సైక్లింగ్, ఫెన్సింగ్, హాకీ, జూడో, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టీ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, కయాకింగ్-కెనోయింగ్,ఖో-ఖో,తైక్వాండో, వాలీబాల్, వుషు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా లేదా తత్సమానం లేదా ఒలింపిక్స్/ప్రపంచ ఛాంపియన్‌షిప్ విజేత లేదా పారాలింపిక్స్/ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం లేదా ద్రోణాచార్య అవార్డు గ్రహీత అయి ఉండాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.03.2023.
» **వెబ్‌సైట్:** sportsauthorityofindia.gov.in

ఇండియన్ ఆర్మీలో జేసీవో, హవల్దార్ పోస్టులు

ఇండియన్ ఆర్మీ.. జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో), హవల్దార్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(రిలీజియస్ టీచర్), హవల్దార్ (సర్వేయర్ ఆటోమేటెడ్ కార్టోగ్రాఫర్).
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 12 వతరగతి, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.10.2023 నాటికి 25 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ రాతపరీక్ష, రిక్రూట్‌మెంట్ ర్యాలీ, ఇంటర్వ్యూ (ఆర్టీ జేసీవో పోస్టులకు మాత్రమే) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.03.2023.
» **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** 17.04.2023 నుంచి 04.05.2023 వరకు.
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

'అగ్నివీర్'లకు ఆర్మీ స్వాగతం

» 2023-24 ఎంపిక ప్రక్రియలో మార్పులు
» ముందుగా ఆన్‌లైన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణ
» ఎంట్రన్స్‌లో ప్రతిభ ఆధారంగా దేహ దారుఢ్య పరీక్షలు
» మార్చి 15 వరకు దరఖాస్తు అవకాశం
» ఏప్రిల్ 17 నుంచి రాత పరీక్షలు



ఆర్మీ రిక్రూట్‌మెంట్

గతేడాది కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన.. 'అగ్నిపథ్' పథకంలో భాగంగా.. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో 'అగ్నివీర్' పేరిట నియామకాలు చేపడుతున్నారు. గతేడాది తొలిసారిగా అగ్నివీర్‌ల నియామకం జరిగింది! తాజాగా.. 2023-24 సంవత్సరానికి సంబంధించి.. ఆర్మీ విభాగంలో.. అగ్నివీర్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది! మరోవైపు నియామక ప్రక్రియలో కీలక మార్పులు ప్రకటించారు!! ఈ నేపథ్యంలో.. 'అగ్నివీర్' నియామక ప్రక్రియలో తాజా మార్పులు, రిక్రూట్‌మెంట్ విధానం, విధులు, ప్రయోజనాలు తదితర అంశాలపై విశ్లేషణ..

గత ఏడాది నుంచే అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ నియామకాలకు శ్రీకారం చుట్టారు. తాజాగా ఆర్మీ విభాగంలో.. 2023-24 సంవత్సరానికి దేశ వ్యాప్తంగా ఉన్న 72 ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్‌ల పరిధిలో.. అన్ని రాష్ట్రాల్లోనూ పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ అర్హతలతో అగ్నివీర్ నియామక ప్రక్రియ ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి సికింద్రాబాద్, విశాఖపట్నం, గుంటూరు రిక్రూటింగ్ ఆఫీస్‌ల పరిధిలో అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఎంపిక ప్రక్రియలో మార్పులు

- అగ్నివీర్ నియామక విధానంలో ఈ ఏడాది కొన్ని కీలక మార్పులు చేశారు. ఈ క్రమంలో ఫేజ్-1,ఫేజ్-2లుగా ఎంపిక ప్రక్రియను పేర్కొన్నారు. ముందుగా ఫేజ్-1లో భాగంగా అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.ఆ టెస్ట్‌లో సాధించిన మార్కులు, పోస్టుల సంఖ్యను అనుసరించి నిర్దిష్ట కటాఫ్‌ను పేర్కొని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశ ఫేజ్-2లో.. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్,ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ ర్యాలీలను నిర్వహిస్తారు. ఫేజ్-2 దశలోనూ ప్రతిభ చూపి..తుది విజేతలుగా నిలిస్తే అగ్నివీర్‌లుగా నియామకం ఖరారు చేస్తారు.
- వాస్తవానికి గత ఏడాది ముందుగా రిక్రూట్‌మెంట్ ర్యాలీ పేరుతో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించి.. అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి తదుపరి దశలో రాత పరీక్ష నిర్వహించి నియామకాలు ఖరారు చేశారు.

ఈ పోస్ట్‌లకే నియామకాలు

అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా 2023-24 రిక్రూట్‌మెంట్ ర్యాలీలో.. అగ్నివీర్(జనరల్ డ్యూటీ-ఆల్ ఆర్మ్స్), అగ్నివీర్(టెక్నికల్-ఆర్మ్స్), అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్), అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్(ఆల్ ఆర్మ్స్), ట్రేడ్స్‌మెన్(ఆల్ ఆర్మ్స్- ఎనిమిదో తరగతి) పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- **అగ్నివీర్-జనరల్ డ్యూటీ:** 45 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారికి డ్రైవర్ పోస్ట్‌లలో ప్రాధాన్యం ఇస్తారు.
- **అగ్నివీర్-టెక్నికల్:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణత ఉండాలి(ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లలో ప్రతి సబ్జెక్ట్‌లో 40 శాతం మార్కులు సాధించాలి)(లేదా) 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు.. మెకానిక్ మోటార్ వెహికిల్, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టెక్నీషియన్ పవర్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్, సర్వేయర్,జియో ఇన్ఫర్మాటిక్ అసిస్టెంట్, ఐసీటీ సిస్టమ్ మెయింటనెన్స్, మెకానిక్ కమ్ ఆపరేటర్ ఎలక్ట్రిక్ కమ్యూనికేషన్ సిస్టమ్, వెస్సెల్ నేవిగేటర్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్,కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ బ్రాంచ్‌లలో ఐటీఐ లేదా డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- **అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్:** 60 శాతం మార్కులతో ఆర్ట్స్/కామర్స్/సైన్స్ విభాగాల్లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి(ప్రతి సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి).
- **అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్-టెన్త్ క్లాస్:** పదోతరగతిలో ప్రతి సబ్జెక్ట్ 33 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్-ఎనిమిదో తరగతి:** అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ ఉద్యోగాల్లోనే కొన్నింటికి ఎనిమిదో తరగతిని అర్హతగా పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ప్రతి సబ్జెక్ట్‌లో 33% మార్కులతో ఎనిమిదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలి.
- పదో తరగతి లేదా ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు హాజరవనున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

- గత ఏడాది తొలిసారిగా నియామకాలు చేపట్టిన క్రమంలో వయో పరిమితిలో సడలింపు ఇచ్చి 17 1/2 నుంచి 23 ఏళ్ల మధ్య ఉన్న వారికి అవకాశం కల్పించారు. ఈ ఏడాది మాత్రం 17 1/2 ఏళ్ల నుంచి 21 ఏళ్ల లోపు ఉన్న వారినే అర్హులుగా పేర్కొన్నారు.

శారీరక ప్రమాణాలు

అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు విద్యార్హతలు, వయో పరిమితితోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కూడా ఉండాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, ట్రేడ్స్‌మెన్ అభ్యర్థులు 166 సెంటీమీటర్ల ఎత్తు, టెక్నికల్ అభ్యర్థులు 165 సెం.మీ. ఎత్తు, క్లర్క్/స్టోర్ కీపర్-టెక్నికల్ అభ్యర్థులు 162 సెం.మీ. ఎత్తు ఉండాలి. అదే విధంగా ఛాతి కొలత 77 సెం.మీ. ఉండాలి. శ్వాస పీల్చినప్పుడు 5 సెం.మీ. విస్తరించాలి.

ఫేజ్-1 ఆన్‌లైన్ సీఈఈ

- నియామక ప్రక్రియలో.. తొలి దశ(ఫేజ్-1)లో ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష (కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) నిర్వహిస్తారు. ఈ పరీక్ష.. ఆయా పోస్ట్‌లను అనుసరించి 50 మార్కులకు లేదా 100 మార్కులకు జరుగుతుంది.
- జనరల్ డ్యూటీ పోస్ట్‌ల అభ్యర్థులకు జనరల్ నాలెడ్జ్(15 ప్రశ్నలు), జనరల్ సైన్స్ (15 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్(15 ప్రశ్నలు), లాజికల్ రీజనింగ్(5 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. మొత్తం మార్కులు 50.
- టెక్నికల్ పోస్ట్‌ల అభ్యర్థులకు ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.

బోనస్ మార్కుల విధానం

ఆన్‌లైన్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌కు కేటాయించిన మార్కులతోపాటు బోనస్ మార్కులు కేటాయించే విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. ఎక్స్‌సర్వీస్‌మెన్, స్పోర్ట్స్‌మెన్, ఎన్‌సీసీ, ఐటీఐ, డీఓఈఏసీఈ స్కీమ్‌ల అభ్యర్థులకు బోనస్ మార్కులు కేటాయిస్తారు. ఇలా టెక్నికల్ విభాగం వారికి గరిష్టంగా 50 మార్కులు, నాన్-టెక్నికల్ అభ్యర్థులకు గరిష్టంగా 25 మార్కులు బోనస్ మార్కులుగా కేటాయిస్తారు.

ఫేజ్-2.. ర్యాలీ

తొలిదశ(ఫేజ్-1)లో ఆన్‌లైన్ పరీక్షలో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి రెండో దశ(ఫేజ్-2)లో రిక్రూట్‌మెంట్ ర్యాలీ పేరుతో.. నిర్దిష్ట ప్రాంతాల్లో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్(ఎఫ్‌టీటీ), ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఎంటీ)లను నిర్వహిస్తారు.

మెడికల్ ఎగ్జామినేషన్

ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లలో విజేతలుగా నిలిచిన వారికి చివరగా మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. ఆర్మీ వైద్య బృందాల ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షల్లోనూ విజయం సాధిస్తే.. అగ్నివీర్‌లుగా నియామకం ఖరారు చేస్తారు.

ఆరు నెలల శిక్షణ

- ఎంపిక ప్రక్రియలో అన్ని దశల్లోనూ విజయం సాధించి.. అగ్నివీర్‌లుగా ఎంపికైన వారికి తొలుత 6 నెలల పాటు శిక్షణనిస్తారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుంటే..అగ్నివీర్‌లుగా అభ్యర్థులు ఎంపికైన విభాగాల్లో నియమిస్తారు.
- అగ్నివీర్‌లుగా ఎంపికైన వారు శిక్షణ కాలంతో కలిపి నాలుగేళ్ల పాటు వారు ఎంపికైన విభాగాల్లో విధులు నిర్వహించే అవకాశం ఉంటుంది. సోల్జర్‌గా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించొచ్చు. అంతేకాకుండా సర్వీస్ పూర్తయిన తర్వాత స్కిల్ సర్టిఫికెట్‌ను కూడా అందిస్తారు.

వేతనం

- అగ్నివీర్‌లుగా ఎంపికైన వారికి వేతనాలు కూడా ఆకర్షణీయంగానే ఉంటాయి. మొదటి ఏడాది రూ. 30వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేలు చొప్పున నెల వేతనం లభిస్తుంది. ఈ వేతన మొత్తాల్లోంచి ప్రతి నెల 30% చొప్పున అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ 30 శాతానికి సమానమైన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా ఈ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తుంది.
- అంటే.. నాలుగేళ్ల పూర్తయ్యే సరికి అభ్యర్థుల కార్పస్ ఫండ్‌లో రూ.10.04 లక్షలు జమ అవుతాయి. సర్వీస్ పూర్తి చేసుకుని విధులను విరమించే సమయంలో ఈ మొత్తాన్ని అగ్నివీర్‌లకు చెల్లిస్తారు. దీంతోపాటు.. రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, డ్రెస్ అలవెన్స్, ట్రావెల్ అలవెన్స్‌లను కూడా చెల్లిస్తారు. నాన్-కంట్రిబ్యూటరీ జీవిత బీమా పేరుతో రూ.48 లక్షల మొత్తానికి జీవిత బీమా కల్పిస్తారు.

25 శాతం మందికి శాశ్వత ఉద్యోగం

అగ్నివీర్‌లుగా ఎంపికై నాలుగేళ్ల పాటు విధులు నిర్వహించిన వారిలో 25 శాతం మందికి శాశ్వత ఉద్యోగం కల్పించే విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. సర్వీస్ పూర్తి చేసుకునే సమయానికి ముందుగా అంతర్గత ఎంపిక ప్రక్రియ నిర్వహించి మొత్తం అభ్యర్థుల్లో 25 శాతం మందికి శాశ్వత కొలువు కల్పిస్తారు.

రాత పరీక్షలో విజయం ఇలా

- అగ్నివీర్ ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్షలో విజయానికి అభ్యర్థులు పలు అంశాలపై దృష్టిపెట్టాలి.
- **ఇంగ్లిష్:** బేసిక్ గ్రామర్ నైపుణ్యాలు పరీక్షించే విభాగం ఇది. ఇందులో రాణించడానికి ప్రిపొజిషన్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, యాక్టివ్, ప్యాసివ్ వాయిస్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్, డైరెక్ట్-ఇన్ డైరెక్ట్ స్పీచ్,వెర్బ్స్,టెన్సెస్,పంక్చుయేషన్స్, యాంటానిమ్స్, సినానిమ్స్‌లపై పట్టు సాధించాలి.
- **సైన్స్:** ఇంటర్మీడియెట్ స్థాయిలోని కైనమాటిక్స్, వర్క్, ఎనర్జీ, చలన నియమాలు, మెకానిక్స్, హీట్, థర్మోడైనమిక్స్, ఎలక్ట్రోస్టాటిస్టిక్స్, వేవ్స్, కరెంట్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, సెమీ కండక్టర్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.
- **మ్యాథమెటిక్స్:** క్వాడ్రాట్రిక్ ఈక్వేషన్స్, కాంప్లెక్స్ నెంబర్స్, సమితులు, ప్రమేయాలు, ట్రిగ్నోమెట్రీ, స్ట్రెయిట్ లైన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, వెక్టార్స్, స్టాటిస్టిక్స్, 3-డి జామెట్రీ, డిఫరెన్షియేషన్స్, డెరివేటివ్స్, ఆల్జీబ్రా వంటి గణిత అంశాలపై సన్నద్ధత పొందాలి.
- **జనరల్ అవేర్‌నెస్:** అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌పై ఎక్కువ శ్రద్ధ చూపాలి. అదే విధంగా భారత దేశ చరిత్ర,భౌగోళిక అంశాలు,పోర్ట్‌లు, తీర ప్రాంతాలు, ముఖ్యమైన వ్యక్తులు, సదస్సులు, క్రీడలు-విజేతలు, రక్షణ రంగానికి సంబంధించి తాజా పరిణామాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఫిబ్రవరి 16- మార్చి 15, 2023
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** ఏప్రిల్ 17 నుంచి పలు స్లాట్లలో పరీక్షలు నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in/latest-rally-agniveer-or.htm



వీడు ఏలియన్ కాదు.. మరెవరు?

ఏలియన్లు ఎలా ఉంటాయి? ఆకుపచ్చ రంగు శరీరం.. పెద్ద తల.. పెద్ద పెద్ద కళ్లు.. ఇలా ఉంటాయి.. లేదా ప్రపంచాన్ని నాశనం చేసేలా భీకర స్థాయిలో ఉంటాయి..

ఇప్పటివరకూ చాలామందికి గ్రహాంతర జీవులు అంటే మదిలో మెదిలేది ఇదే.. సినిమాలు మనకు అలాగే చూపించాయి.. ఒకవేళ నిజంగానే మన సౌర కుటుంబంలోనే ఏలియన్లు ఉంటే.. అవి ఎలా ఉంటాయి? అచ్చంగా మనిషిలాగా ఉంటాయా లేక సినిమాల్లో చూపించినట్టుగానే ఉంటాయా? దీనిపై ప్రపంచవ్యాప్తంగా కొందరు శాస్త్రవేత్తలు అన్నింటినీ విశ్లేషించి అంచనా వేశారు. సదరు గ్రహం/ఉపగ్రహంపై ఉండే గ్రావిటీ (గురుత్వాకర్షణ శక్తి), వాతావరణం సాంద్రత, ఉష్ణోగ్రతలు వంటి అంశాల ఆధారంగా వాటి రూపురేఖలను రూపొందించారు.



యూఎఫ్‌వోలు కనిపించడంతో..


ఇటీవల అమెరికా గగనతలంలో 'గుర్తుతెలియని ఎగిరే వస్తువులు (యూఎఫ్‌వో)'లు కనిపించాయంటూ వార్తలు రావడం, వీడియోలు, ఫొటోలు కూడా వెల్లువెత్తడంతో.. మళ్లీ గ్రహాంతరవాసుల (ఏలియన్ల)పై చర్చ మొదలైంది. ఏలియన్లు భూమ్మీదికి రావడానికి ప్రయత్నిస్తున్నాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తిపోయింది. ఈ క్రమంలో మన సౌరకుటుంబంలో ఏలియన్లు ఉన్నాయా? ఉంటే ఎలా ఉండొచ్చు? అన్నదానిపై డైలీమెయిల్ వెబ్‌సైట్ పలువురు శాస్త్రవేత్తలతో మాట్లాడి వివరాలు సేకరించింది.

ఏ ఆకారంలోనైనా..

మన సౌర కుటుంబంలోనే కాదు.. విశ్వంలో లక్షల కోట్ల కొద్దీ ఉన్న నక్షత్ర మండలాల్లో ఎక్కడైనా జీవం ఉండేందుకు అవకాశం ఎక్కువేనని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆ గ్రహాల్లో నెలకొని ఉన్న పరిస్థితులకు అనుగుణంగా.. మనుషులు, జెల్లీఫిష్‌లు, నత్తలు, స్క్విడ్ (ఆక్టోపస్ వంటివి)లు, ఎగిరే కీటకాలు, సూక్ష్మజీవులు.. ఇలా ఏ రూపంలో అయినా ఏలియన్లు ఉండవచ్చని అంటున్నారు.

- సౌర కుటుంబంలో అంగారక, శుక్ర గ్రహాలతోపాటు గురుడి ఉపగ్రహాలు యురోపా, గనిమీడ్, కలిస్టో.. శని ఉపగ్రహాలు ఎన్సెలాడస్, టైటాన్.. నెప్ట్యూన్ ఉపగ్రహం ట్రిటాన్, మరుగుజ్జు గ్రహం సెరెస్‌లపై జీవం ఉండేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్తున్నారు.
- భూమిని పోలిన పరిస్థితులు, వాతావరణం ఉన్నచోట.. భూమ్మీది తరహాలోనే విడిగా తల, కాళ్లు, చేతుల వంటి అవయవాలు, పెద్ద మెదడుతో కూడిన జీవులు ఉండొచ్చని కేంబ్రిడ్జి యూనివర్సిటీ పాలియాంటాలజిస్ట్ సిమన్ కోన్వే మోరిస్ తెలిపారు. ఒకవేళ నక్షత్రానికి దూరంగా ఉండి, కాంతి తక్కువగా పడే గ్రహాల్లో అయితే కళ్లు బాగా పెద్దవిగా ఉంటాయన్నారు. అయితే ఆ జీవుల ఆకారం మనుషుల్లా ఉండొచ్చు, లేకపోవచ్చని పేర్కొన్నారు.

ప్రస్తుత పరిస్థితులను బట్టి.. ఒకవేళ సౌర కుటుంబంలోనే జీవాన్ని కనుగొన్నా, అవి ఏక కణ సూక్ష్మజీవులే అయి ఉంటాయని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ ప్రొఫెసర్ ఆండ్రూ కోట్స్ స్పష్టం చేశారు. కానీ విశ్వంలోని కోట్లాది నక్షత్ర మండలాల్లో చాలా చోట్ల ఏలియన్లు జీవించి ఉండే అవకాశం ఉందన్నారు.




భూమిలా ఉంటే..

భూమిపై ఉన్నట్టుగానే కాస్త అటూ ఇటూగా గ్రావిటీ, వాతావరణం, ఉష్ణోగ్రతలు ఉంటే.. ఏలియన్లు మనుషుల మాదిరిగానే ఉండే అవకాశాలు ఎక్కువ.



గ్రావిటీ ఎక్కువగా ఉంటే..

భూమికన్నా పరిమాణంలో పెద్దగా ఉండే గ్రహాల్లో గ్రావిటీ ఎక్కువగా ఉంటుంది. మిగతా పరిస్థితులు భూమిలా ఉన్నా, గ్రావిటీ ఎక్కువుంటే.. ఏలియన్లు ఎత్తు తక్కువగా, దృఢమైన కండరాలతో కూడి ఉంటాయి.




గ్రావిటీ తక్కువగా ఉంటే..

చిన్నగా ఉండే గ్రహాలు/ఉప గ్రహాల్లో గ్రావిటీ తక్కువగా ఉంటుంది. అలాంటి చోట తేలికగా, ఎక్కువ ఎత్తుతో, బలహీనమైన కండరాలతో కూడిన జీవులు ఉండేందుకు ఆస్కారం ఉంటుంది.


వాతావరణం తక్కువగా ఉంటే..

గ్రహం/ఉపగ్రహం సైజుతో సంబంధం లేకుండా, వాతావరణం తక్కువ సాంద్రత (డెన్సిటీ)తో ఉంటే.. తక్కువ బరువుతో, చాలా పెద్ద రెక్కలతో కూడిన ఏలియన్లు ఉండొచ్చు.



నిండా మంచుతో కప్పి ఉంటే..

గురుడి ఉపగ్రహం యూరోపా మాదిరిగా మొత్తంగా మంచుతో కప్పబడి, దాని దిగువన నీటి సముద్రాలు ఉంటే.. పీతలు, ఆక్టోపస్‌ల వంటి ఆకారాల్లో ఏలియన్లు ఉండేందుకు చాన్స్ ఎక్కువ.



-సాక్షి సెంట్రల్ డెస్క్

పొడిగా ఉండే గ్రహాలైతే..

శుక్రుడు, మార్స్ వంటి పొడిగా ఉండే వాతావరణ పరిస్థితులు ఉన్న గ్రహాలు/ఉపగ్రహాల్లో జీవం సూక్ష్మజీవుల తరహాలో ప్రాథమిక స్థాయిలో ఉండొచ్చు. వాతావరణం అనుకూలంగా మారితే పరిణామక్రమంలో ఎదిగి.. పెద్దస్థాయి జీవులుగా మారొచ్చు.



మెడికల్ మాఫియాపై ఫోకస్

- కర్ణాటక నుంచి ఏపీకి అక్రమంగా సరఫరా అవుతున్న 'వైద్యుల సూచనల మేరకు వినియోగించే మందులు'
- డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల తనిఖీలలో వెలుగు చూసిన అక్రమ దందా
- రూ.16 లక్షల విలువ చేసే అబార్షన్ కిట్లు, నిద్ర మాత్రలు, వయాగ్రా స్వాధీనం
- ఏపీ నుంచి కర్ణాటక వెళ్లనున్న ప్రత్యేక బృందాలు

సాక్షి, అమరావతి/తణుకు: వైద్యుల రాసిచ్చే చీటీల (డాక్టర్ ప్రిస్క్రిప్షన్)పై మాత్రమే విక్రయించాల్సిన మందులు బహిరంగ మార్కెట్‌లో అమ్మకానికి పెట్టడాన్ని ఔషధ నియంత్రణ విభాగం తీవ్రంగా పరిగణిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన వ్యాపారి ఒకరు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకోగా.. అతడికి నిద్రమాత్రలు ఎక్కడ లభించాయనే దానిపై ఔషధ నియంత్రణ శాఖాధికారులు దృష్టి సారించారు. పలుచోట్ల తనిఖీలు నిర్వహించగా.. వైద్యుల చీటీలపై మాత్రమే విక్రయించాల్సిన అబార్షన్ కిట్లు, నిద్ర మాత్రలు, వయాగ్రా మాత్రలను విచ్చలవిడిగా విక్రయిస్తున్న వైనం వెలుగుచూసింది. వైద్యుల సూచనల మేరకు మాత్రమే వాడాల్సిన ఈ మందులు కర్ణాటక నుంచి మన రాష్ట్రంలోకి అక్రమంగా సరఫరా అవుతున్నట్టు ఔషధ నియంత్రణ విభాగం అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, తణుకు, ఏలూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ల పరిధిలో అనధికారికంగా నిల్వ ఉంచిన రూ.16.41 లక్షల విలువైన అబార్షన్ కిట్లు, వయాగ్రా, మత్తు మందులను సీజ్ చేశారు. ఐదుగురిపై కేసులు కూడా నమోదు చేసిన అధికారులు ఈ వ్యవహారంపై విస్తృతస్థాయి దర్యాప్తు చేపట్టారు.



శానిటైజర్‌తో చెరిపేసిన ఎమ్మార్పీ, బ్యాచ్ నంబర్లు

కర్ణాటక నుంచి సరఫరా

ఇలాంటి మందులను నిబంధనల ప్రకారం రిజిస్టర్డ్ రిటైల్ మందుల దుకాణాల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఉన్న వ్యక్తులకు మాత్రమే విక్రయించాలి. లేదంటే ఆ మందుల దుర్వినియోగమయ్యే అవకాశం ఉంటుంది. కర్ణాటక నుంచి అనధికారికంగా రాష్ట్రంలోకి సరఫరా అవుతున్న ఇలాంటి మందులను ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ముఠా సభ్యులు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. మందులపై ఉన్న ఎమ్మార్పీ ధరలను చెరిపేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు ఔషధ నియంత్రణ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. అధికారులు కేసు నమోదు చేసిన ఐదుగురిలో ఒక వ్యక్తి కర్ణాటకలోని బెంగళూరు, హుబ్లీ, తుముకూరు, బీదర్ నుంచి ఈ మందులను తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నాడు. నిందితుడి బ్యాంక్ లావాదేవీలు, ఫోన్ కాల్స్, ఇతర సాంకేతిక వివరాల ఆధారంగా అధికారులు ఈ విషయాన్ని నిర్ధారించుకున్నారు. దీంతో కర్ణాటక నుంచి అనధికారికంగా రాష్ట్రంలోకి మందుల సరఫరా వ్యవహారాన్ని ఆ రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం ఉన్నతాధికారులకు ఇక్కడి అధికారులు ఇప్పటికే తెలియజేసినట్టు సమాచారం. తదుపరి విచారణ కోసం బెంగళూరు, హుబ్లీ, తుముకూరు, బీదర్ ప్రాంతాలకు పంపేందుకు రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ బృందాల్లో పోలీసులు సైతం ఉంటారు.

పల్నాడు జిల్లా నుంచి కూడా..

మరోవైపు పల్నాడు జిల్లా నుంచి కూడా నాలుగు రకాల మందులు సరఫరా అయినట్టు విచారణలో తేలింది. ఆ మందులను సరఫరా చేసిన వ్యక్తిని విచారించగా చిలకలూరిపేట, నరసరావుపేటల్లోని రెండు మెడికల్ షాపుల నుంచి అనధికారికంగా కొనుగోలు చేసి సరఫరా చేసినట్టు వెల్లడించాడు. దీంతో చిలకలూరిపేట, నరసరావుపేటల్లోని సంబంధిత రెండు మెడికల్ షాపుల్లో ఔషధ నియంత్రణ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. రెండుచోట్ల సుమారు రూ.60 లక్షల వరకూ విలువ చేసే మందులను అనధికారికంగా విక్రయించినట్టు గుర్తించారు. దీంతో ఆయా షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు.

జ'లక్'!



పోలీసులు స్వాధీనం చేసుకున్న నక్క

తానొకటి తలిస్తే... మరొకటి జరిగింది. నిద్రలేవగానే నక్క ముఖం చూడటం లక్ అని అతను భావిస్తే... పోలీసులు అతనికి జలక్ ఇచ్చారు. నక్కను బంధించాడని అతడ్ని పోలీసులు జైలుకు పంపించారు. ఈ సంఘటన కర్ణాటకలోని తుమకూరు రూరల్ పరిధిలోని నాగవల్లి గ్రామంలో జరిగింది. నాగవల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ మూఢ నమ్మకాలు అనుసరిస్తాడు. ఎవరికైనా డబ్బులు వస్తే నక్క తోక తొక్కాడు... నక్క ముఖం చూశాడు... అనే సామెతలను బాగా నమ్మేవాడు. ఈ క్రమంలో అతను తన ఇంట్లో రెండు నక్క ఫొటోలను పెట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా అడవిలో ఉన్న ఒక నక్కను పట్టుకొచ్చి తన కోళ్లఫారం వద్ద బోనులో పెట్టాడు. ప్రతి రోజు ఉదయం దాని ముఖం చూసేవాడు. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది పోలీసులకు చెప్పడంతో వారు వచ్చి నక్కను స్వాధీనం చేసుకున్నారు. అడవిలో ఉండాల్సిన నక్కను బోనులో పెట్టడం నేరమని లక్ష్మీకాంత్‌ను అరెస్ట్ చేశారు. నక్కను అటవీ సిబ్బందికి అప్పగించారు.

– తుమకూరు

పుష్పగిరిలో కాకతీయులనాటి ఆలయం



పుష్పేశ్వర ఆలయంలోని మండపం

మైదుకూరు/కడప కల్చరల్: పుష్పగిరి క్షేత్రంలో 12వ శతాబ్దానికి చెందిన కాకతీయుల కాలం నాటి ఆలయం వెలుగు చూసింది. వైఎస్సార్ జిల్లాలో దక్షిణ కాశీగా పేరున్న పుష్పగిరిలో వందల ఆలయాలు ఉన్నాయి. కానీ అక్కడ పుష్పాచలేశ్వర ఆలయం ఉన్నట్లు చాలామందికి తెలియదు. కొండపై ఈశాన్యంలో ఈ ఆలయాన్ని కాకతీయ వాస్తు నిర్మాణ శైలిలో తీర్చిదిద్దారు. గుప్త నిధుల కోసం ధ్వంసం చేయడంతో ఆలయం నేడు శిథిలావస్థకు చేరింది. ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేస్తే ప్రస్తుతం తలపెట్టిన గిరి ప్రదక్షిణకు మరింత విశిష్టత చేకూరుతుందని రచయిత, చరిత్రకారుడు తవ్వా ఓబుల్‌రెడ్డి తెలిపారు.

లబ్ధిదారులను గుర్తించడం వరకే

వలంటీర్ల పని

- హైకోర్టుకు నివేదించిన సెర్ప్ సీఈవో ఇంతియాజ్
- విచారణ మార్చి 10కి వాయిదా

సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను గుర్తించడం, దరఖాస్తులను స్వీకరించడం వరకే వలంటీర్ల పని అని గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) సీఈవో ఇంతియాజ్ హైకోర్టుకు నివేదించారు. వలంటీర్లు సమాజ సేవకులు మాత్రమేనని, వారు చేస్తున్నది సమాజ సేవ అని తెలిపారు. తమను వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించారంటూ కొందరు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మంగళవారం మరోసారి విచారణ జరిపారు. గత విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఇచ్చిన ఆదేశాల మేరకు సెర్ప్ సీఈవో ఇంతియాజ్ కోర్టు ముందు హాజరయ్యారు. వలంటీర్లు సేకరించిన సమాచారాన్ని డిజిటల్ వెల్ఫేర్ సహాయకులు సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారని ఇంతియాజ్ వివరించారు. వారు ఎలా వ్యవహరించాలో పంచాయతీరాజ్ శాఖ స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) జారీ చేసిందని, దాని ప్రకారమే నడుచుకోవాలని కోర్టుకు తెలిపారు. అయితే ఈ వివరాలతో న్యాయమూర్తి సంతృప్తి చెందలేదు. వలంటీర్లు ఆధార్ వివరాలతో సహా ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తుంటారని, ఈ సమాచారానికి ఎలాంటి రక్షణ కల్పిస్తున్నారో తెలపాలన్నారు. అలాగే లబ్ధిదారుల ఎంపికకు ఆయా శాఖల ఉద్యోగులు ఉన్నప్పుడు, ప్రభుత్వ ఉద్యోగులు కాని వలంటీర్లు ఎలా ఎంపిక చేస్తారని, వారికా అధికారాన్ని ఎలా ఇస్తారని అడిగారు. వలంటీర్ల సర్వీసును క్రమబద్ధీకరించి, ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. వీటిపై అదనపు అఫిడవిట్ రూపంలో సమాధానం ఇవ్వాలని ఇంతియాజ్‌ను ఆదేశించారు. తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేశారు.

పరిహారం చెల్లించాల్సిందే

పురుషోత్తపట్నం, పట్టిసీమలపై ఏపీకి సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ హయాంలో నిర్మాణమైన పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులకు సంబంధించి జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) సంయుక్త కమిటీ సిఫార్సు చేసిన నష్టపరిహారాన్ని చెల్లించాలని ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్జీటీ ఆదేశించిన రూ.120 కోట్ల పరిహారం చెల్లింపుపై తరువాత విచారిస్తామని తెలిపింది. పోలవరం, పురుషోత్తపట్నం, పట్టిసీమ ప్రాజెక్టుల పర్యావరణ ఉల్లంఘనలపై జమ్ముల చౌదరయ్య, పెంటపాటి పుల్లారావు తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఎన్జీటీ ప్రాజెక్టు వ్యయం ఆధారంగా పర్యావరణ నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. మరోవైపు సంయుక్త కమిటీ పోలవరం ప్రాజెక్టును మినహాయించి పురుషోత్తపట్నం ప్రాజెక్టుకు రూ.2.48 కోట్లు పట్టిసీమ ప్రాజెక్టుకు రూ.1.90 కోట్లు నష్టపరిహారంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలికి చెల్లించాలని సిఫార్సు చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.4.38 కోట్లు భారం పడింది. ఎన్జీటీ ఆదేశాలు సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. ప్రతివాదుల న్యాయవాది శ్రావణ్‌కుమార్ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయలేదని, పురుషోత్తపట్నం రైతులకు పరిహారం ఇవ్వలేదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రెండువారాల సమయం ఇవ్వాలని ఏపీ న్యాయవాది కోరారు. రెండువారాల్లో జరిమానా చెల్లించారా లేదా అనే అంశంపై నివేదిక అందజేయాలని, లేకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ మూడువారాల తర్వాత చేపడతామని తెలిపింది.

ఎస్‌ఐ మెయిన్స్‌కు 57,923 మంది ఎంపిక

- ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు వెల్లడి... 38.28శాతం మంది అర్హత
- మార్చి 4 వరకు స్కాన్ చేసిన జవాబు పత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

- తదుపరి సమాచారం కోసం అభ్యర్థులు సంప్రదించాల్సిన రాష్ట్ర పోలీసు నియామక మండలి వెబ్‌సైట్ : slprb.ap.gov.in
- సందేహాల నివృత్తి కోసం మెయిల్ చేయాల్సిన ఈ–మెయిల్ ఐడీ: CTSI& PWT@ slprb. appolice. gov. in

సాక్షి, అమరావతి: ఎస్‌ఐ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో 38.28 శాతం మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో 411 ఎస్‌ఐ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షకు 1,51,288మంది హాజరయ్యారు. 57,923 మంది మెయిన్ పరీక్షకు అర్హత సాధించారని రాష్ట్ర పోలీసు నియామక మండలి తెలిపింది. ఈ మేరకు ప్రిలిమ్స్ ఫలితాలను మంగళవారం వెల్లడించింది. పేపర్–1, పేపర్–2లకు గరిష్టంగా 100 మార్కులు చొప్పున ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. 'ప్రాథమిక కీ'ని ఫిబ్రవరి 20న విడుదల చేయగా, దానిపై 1,553 అభ్యంతరాలు వచ్చాయి. వాటిని సబ్జెక్ట్ నిపుణులు పరిశీలించి పేపర్–1 'ప్రాథమిక కీ'లో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదని నిర్ధారించారు. కాగా, పేపర్–2లో ఒక ప్రశ్నకు ఒకటికిమించి సరైన సమాధానాలు ఉన్నట్టుగా గుర్తించారు. 'తుది కీ'ని పోలీసు నియామక మండలి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ప్రతి పేపర్‌లోనూ ఓసీ అభ్యర్థులకు 40శాతం, బీసీ అభ్యర్థులకు 35శాతం, ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికుల కేటగిరీ అభ్యర్థులకు 30శాతం మార్కులను అర్హతగా నిర్ణయించారు. రెండు పేపర్లలో విడివిడిగా కనీస అర్హత మార్కులు సాధించినవారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేశారు. స్కాన్ చేసిన జవాబు పత్రాలు పోలీసు నియామక మండలి వెబ్‌సైట్ నుంచి మార్చి 4వ తేదీ ఉదయం 11 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. మెయిన్ పరీక్ష తేదీని త్వరలోనే ప్రకటిస్తామని రాష్ట్ర పోలీసు నియామక మండలి చైర్మన్ మనీశ్‌కుమార్ సిన్హా తెలిపారు. అభ్యర్థులు తదుపరి సమాచారం కోసం ఎప్పటికప్పుడు తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి కోసం తమకు ఈ–మెయిల్ ద్వారా తెలియజేయాలని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో నోటరీల సమాచారం

- నోటరీల సమస్త సమాచారం ఐజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో
- సొసైటీలు, ఫర్మ్ రిజిస్ట్రేషన్ల సేవల ఆధునీకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నోటరీల వివరాలు ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తున్నాయి. ఇందుకోసం నోటరీలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఐజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో పెడుతున్నారు. నోటరీల ఫొటోలు, అడ్రస్, లొకేషన్లతో పాటు వారు ఎంతకాలం నుంచి ఉంటున్నారు, రెన్యువల్ అయ్యారా? లేదా (ఫోర్స్‌లో ఉన్నారా? లేదా?) వంటి వివరాలన్నింటినీ త్వరలో వెబ్‌సైట్‌లో చూసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా ఎవరికీ నోటరీని ఇచ్చే అవకాశం లేదు. జనాభానుబట్టి కేంద్రం రాష్ట్రాలకు నోటరీలు కేటాయిస్తుంది. రాష్ట్రానికి ఇచ్చిన కోటా గతంలోనే పూర్తయింది. ఉన్న నోటరీలను ఐదేళ్లకోసారి రెన్యువల్ చేస్తారు. మొదటి రెన్యువల్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, రెండో రెన్యువల్‌ను కమిషనర్ అండ్ ఐజీ, మూడు ఆ తర్వాత జరిపే రెన్యువల్స్‌ను ప్రభుత్వం చేస్తుంది. ఎక్కువ మంది నోటరీలు ఫోర్స్‌లో ఉన్నారా లేదా అనే విషయం ప్రజలకు తెలియడంలేదు. ఫోర్స్‌లో లేకపోయినా చాలామంది నోటరీలు చేస్తుండటంతో ఇబ్బందులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరిచి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. మరోపక్క సొసైటీలు, ఫర్మ్ రిజిస్ట్రేషన్ల సేవలను కూడా ఆన్‌లైన్‌లో ఆధునీకరిస్తున్నారు. జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి మళ్లీ ప్రారంభిస్తున్నారు.

మురుగునీటి శుద్ధిలోనూ ఏపీ టాప్

- 15 శాతం మురుగు నీరు శుద్ధి.. ఇందులో 22 శాతం తిరిగి వాడకం
- నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: మురుగు నీరు శుద్ధి చేయడంతోపాటు పునర్ వినియోగంలో ఇతర రాష్ట్రాల కన్నా ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు నివేదిక స్పష్టం చేసింది. ఏపీలో 15 శాతం మేర మురుగు నీటిని శుద్ధి చేస్తుండగా ఇందులో 22 శాతాన్ని తిరిగి ఉపయోగిస్తున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా మురుగునీటి శుద్ధి 21 శాతంగా ఉంటే.. ఇందులో 9 శాతాన్ని మాత్రమే మళ్లీ వినియోగిస్తున్నట్లు పేర్కొంది. 14 పట్టణ స్థానిక సంస్థల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయడమే కాకుండా.. శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగించడాన్ని ఏపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వెల్లడించింది. ఇలా శుద్ధి చేసిన నీటిని ఆక్వాకల్చర్, పశుగ్రాసం సాగుకు, భూగర్భ జలాల రీచార్జ్‌కు వినియోగిస్తున్నట్లు పేర్కొంది. మురుగు నీటిని రీసైక్లింగ్ చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 14 పట్టణ స్థానిక సంస్థల్లో రోజుకు 535.45 మిలియన్ లీటర్ల శుద్ధి సామర్థ్యం ఉండగా.. పునర్ వినియోగం రోజుకు 119.96 మిలియన్ లీటర్లుగా ఉందని నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు నివేదిక పేర్కొంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.